ఆదివారం
ప్రజాశక్తి
23 సెప్టెంబర్, 2001

సామాజిక స్పృహ కోల్పోతున్న యువత

స్వయంభు శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానం

కాణిపాకం గ్రామం, ఐరాల మండలం, చిత్తూరు జిల్లా - 517131

శ్రీ స్వామి వారి ఆర్జిత సేవల వివరములు

అభిషేక వివరములు	అనుమతించు సభ్యులు	టికెట్ వెల
ప్రత్యేక అభిషేకము (కండువ, జాకెట్‌పీస్, 5గ్రా./స్వామివారి వెండి డాలరు, ప్రసాదములు ఇవ్వబడును)	ఐదుగురు	రూ. 400-00
అభిషేకము (ప్రసాదములు మాత్రము ఇవ్వబడును)	ఐదుగురు	రూ. 250-00

గమనిక: అభిషేకము చేయువారు పూజా సామగ్రి తీసుకురావలసిన అవసరం లేదు. అభిషేక దర్శన టికెట్ రోజుకు రెండు పర్యాయములు అభిషేకములు ఉ॥ 9 నుండి 10 గంటల మధ్య మరియు 11-12 గంటల మధ్య 1 పర్యాయము అభిషేకమునకు 12 టికెట్లు అనుమతించబడును.

పూలంగి సేవ (ప్రతిగురువారం మాత్రం)	10 మంది సభ్యులు	రూ. 1000-00
పాలాభిషేకం	ఉ॥ 7 గంటల నుండి 8 గంటల మధ్య పాలు భక్తులే తీసుకొని రావలయును	రూ. 50-00
ప్రమాణము	ప్రతిరోజూ సా॥ 5 గంటల నుండి 6 గంటల వరకు	రూ. 516-00
గణపతి మోదుక పూజ	3 రోజుల ముందు రిజర్వు చేసుకొనవలెను భక్తులకు 41 కుడుములు ఇవ్వబడును.	రూ. 300 -00

వాహనపూజ (స్కూటర్, ఆటో వగైరా)	రూ. 30-00	గణపతి హోమము	రూ. 200-00	శనిదోష నివారణ	రూ. 50-00
వాహన పూజ (కారు, లారీ, బస్సు వగైరా)	రూ. 50-00	మూలమంత్రార్చన	రూ. 200-00	ప్రత్యేక దర్శనము	రూ. 5-00
మాస నిత్యార్చన	రూ. 50-00	గణపతి సహస్రనామార్చన	రూ.150-00	తలనీలాల	రూ. 3-00
		గణపతి పత్రపూజ	రూ. 58-00	పుష్పకావడి	రూ. 3-00
		నవగ్రహ శాంతి	రూ. 50-00	అర్చన	రూ. 3-00

శాశ్వత పూజల వివరములు

శాశ్వత అభిషేకం	రూ. 2500-00
శాశ్వత నిత్యపూజ	రూ. 516-00
శాశ్వత నిత్యార్చన	రూ. 516-00
శాశ్వత గణపతి హోమం	రూ. 2500-00

నిత్యాన్నదాన పథకంనకు మరియు ఉచిత ప్రసాదములకు

రూ. 1116 నుంచి ఎంతైనా భక్తులు చెల్లించవచ్చును.

పై సేవల అడ్వాన్స్ బుకింగ్ కొరకు ఏ తేదీనైనా ఆఫీసు పనివేళలలో సంప్రదించిన తరువాత డిమాండ్ డ్రాఫ్ట్ పంపవలెను. లేదా స్వయంగా నగదు చెల్లించి సేవలలో పాల్గొనవచ్చును.

డిమాండ్ డ్రాఫ్ట్ తీయవలసిన చిరునామా ✆ : 08573-80747, 80540

ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్
స్వయంభు శ్రీకాణిపాక వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానం
కాణిపాకం, చిత్తూరుజిల్లా, ఆంధ్రప్రదేశ్
రూటు: చిత్తూరు నుండి 12 కి.మీ. దూరం

జి.ఆర్.కె. ఆనందకుమార్
అసిస్టెంట్ కమిషనర్
మరియు కార్యనిర్వాహణాధికారి
(పూర్తి అదనపు బాధ్యత)

శుభాకాంక్షలతో....

క్రిష్టియన్ కన్సర్న్ మిషన్

(రిజిస్ట్రేషన్ నం : 1278 ఆఫ్ 1980)

రీజినల్ ఆఫీసు : వేంపాడు గ్రా॥ నిడమనూర్ మం॥ నల్గొండ జిల్లా - 508 278.

కార్యక్రమాలు (ప్రస్తుతం):

★ టి.బి. (క్షయ) నియంత్రణ ★ హెచ్.ఐ.వి. బాధితుల సేవ / సలహాలు

★ గ్రామీణ ఆరోగ్య కమిటీలు ★ గ్రామీణ సలహా కేంద్రాలు

★ గ్రామీణ గృహ నిర్మాణము ★ ఎయిడ్స్ అవగాహన తరగతులు

★ సంచార వైద్య / ఆరోగ్యసేవ

★ సలహాలు స్వీకరించబడును /అందించబడును.

★ విరాళాలు స్వీకరించబడును.

Head Office :
C.C.M., P.O.Bag-5, Shamshabad,
Rangareddy (Dist.) A.P. India. - 508 218.
Ph : 08413-22188, 23192

డా॥ జి.జె. జాన్సన్
బి.ఎ.ఎమ్.ఎస్., యం.డి; డి.ఎస్.డి.(కెనడా)
మెడికల్ డైరెక్టర్

Regd. No. 6341/99 Ph: 08723-30456

SELF EMPLOYED WELFARE ASSOCIATION

(A Non Governmental Organisation)

(SEWA)

H.No.: 7-3-90/1, Pulluri Complex, Vimal Talkies Road,
SIRCILLA-505 301, Dist. Karimnagar (A.P.)

"సెస్" డైరెక్టర్‌గా (8) ఎనిమిది సంవత్సరములు, "సేప్స్" ప్రధానకార్యదర్శిగా దాదాపు (8) సంవత్సరములు పనిచేసి మీ ఆదరాభిమానములకు పాత్రుడనైన నేను ప్రస్తుతము "సేవా" స్వచ్ఛంద సంస్థ స్థాపించి, సేవ చేయుటకు మీ ముందుకు వచ్చినాను. ఎప్పటిలాగే మీ ఆశీస్సులు, ఆదరాభిమానాలు ఉండాలని ఆకాంక్షిస్తున్నాను. బాల్యదశలోనున్న మా సంస్థ ద్వారా గ్రామీణ పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలందిస్తున్నాము. క్రీడల ద్వారా యువతకు ప్రోత్సాహం అందిస్తున్నాం. భవిష్యత్తులో యువకులకు యువ క్రీడాకారులకు మా సంస్థ ద్వారా ఇతోధికంగా సేవలంధించాలని మా కోరిక.



బీడి కార్మికులకు నిర్మించిన గృహం

మా "సేవా" సంస్థ ముఖ్య కార్యక్రమములు:

చెన్నమనేని వెంకటేశ్వరరావు
"సేవా" స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు
పుల్లూరి కాంప్లెక్స్, సిరిసిల్ల

1. గ్రామీణాభివృద్ధికై రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల ద్వారా వచ్చే నిధులతో కృషి చేయుట. 2. వృద్ధులకై వసతి కల్పించి తద్వారా వారికి సేవచేయుట. 3 బాలకార్మిక వ్యవస్థ రూపుమాపుటకై మావంతు కృషి, మూఢనమ్మకాలకు బలికాకుండా, గ్రామీణ ప్రజలకు చైతన్యవంతులను చేయుట, స్వయం ఉపాధి పథకాలలో భాగస్వాములను చేయుట. 4 మహిళా సదస్సుల ద్వారా, ఆర్థికంగా, సమాజికంగా, రాజకీయంగా చైతన్యవంతులను చేయుట, స్వయం ఉపాధి పథకాలలో భాగస్వాములను చేయుట 5. అత్యాధునిక పద్ధతుల ద్వారా వాటర్‌షెడ్స్ కార్యక్రమాల ద్వారా గ్రామీణ రైతులకు వ్యవసాయాభివృద్ధికై సహకరించుట. 6 స్వశక్తి సంఘాల ఏర్పాటు, తద్వారా బీడి కార్మికుల ఇళ్ళ నిర్మాణానికి కృషి. 7 గ్రామీణపేద ప్రజలకు మరుగుదొడ్ల నిర్మాణము. 8 ఊట చెఱువుల నిర్మాణానికి కృషి 9 చెఱువులు, కుంటలలో పూడిక తీయడం.

ఉచిత వైద్య శిబిరం

లోపలి పేజీల్లో.....

సాంప్రదాయక అలవాట్లలోని కంటి చికిత్సా దోషాలు ...6, 7

సోమరితనం ...11

గంగూలిపై విమర్శలు తగునా? 17

ఆనాడు గన్నవరంలో సి.పి.ఎం. చౌకడిపోలు .. 22, 23



ఇంకా...

గేయలహరి 9

బాల నేస్తాలు 12, 13

కథ 18

పుస్తకపరిచయం 20

కళాసాహితి 21

పలుకుబడి 24

వగైరా........

ఎవరికి ఎవరు కాపలా?

మనలో మాట

ఒకరాత్రి....

బోలెడు లగేజీతో బందరు బస్టాండులో అడుగుపెడతాం. మనం ఎక్కవలసిన హైదరాబాదు బస్సు సిద్ధంగా వుంటుంది. ఆ బస్సెక్కి మన లగేజీని కళాత్మకంగా సర్దుకుంటాం. కిటికీ పక్కనున్న సీట్లో కూచుని కిటికీ ఊచల మీద తలవాల్చుతాం. మరో అయిదు నిమిషాల్లో బస్సు కదుల్తుందనగా ఒక మనిషి బస్సెక్కుతాడు. అతను కచ్చితంగా రౌడీ అని చెప్పలేం గానీ - అతని అవతారం ఆ టైపులో వుండటం వల్ల రౌడీ ఏమోనని డవుటు కలుగుతుంది. ఎందుకైనా మంచిదని మన లగేజీ మొత్తాన్నీ మరొకసారి తనిఖీ చేసుకుంటాం. ఆ రవుడీ ఒక బ్రీఫ్‌కేసుతో మన దగ్గరికే వస్తాడు. మనల్ని ఇవతల కొచ్చి కూచోమని అడుగుతాడు. ఎందుకని అడుగుతాం. మనం కూచ్చున్న సీటు తనదేనంటాడు. అప్పుడు మన టిక్కెట్టు చూసుకుంటాం. అతను కరెక్టుగానే చెప్పినట్టు తెలుసుకుంటాం. కిటికీ పక్కసీటు అతనికిచ్చి - అతని పక్కన మనం కూచుంటాం!

అతను తెచ్చిన బ్రీఫ్‌కేసు పెట్టుకోడానికి చోటులేకపోవడం వల్ల అటూ ఇటూ చూచి ఈ రెండు శాల్తీలెవరివని అడుగుతాడు. మనవేనంటాం. ఆ మూడు ఎవరివంటాడు. అవి కూడా మనవేనంటాం. మొత్తం అయిదు శాల్తీలా అని అడుగుతాడు. మనతో కలుపుకుంటే మొత్తం ఆరని జోక్ వేస్తాం. ఆ జోక్‌కి అతను నవ్వడు. పైగా మనవేపు మిర్రున చూస్తాడు. మనకి భయం వేస్తుంది. తన బ్రీఫ్‌కేసుని తన కాళ్ళ దగ్గరే పెట్టుకుంటాడు. బతికిపోయేమనుకుంటాం. బస్సు కదుల్తుంది. ఎందాక అని మనల్ని అడుగుతాడు. హైదరాబాద్ అంటాం. మన బస్సు హైద్రాబాదు చేరుకునేలోగా - అంటే తెల్లారేలోగా - మన లగేజీలో ఏదో ఒకటి తాను కొట్టేస్తానని అతి మామూలుగా చెబుతాడు. ఆ అల్టిమేటంకి మనం ఉలికి పడతాం. అంచేత ఎట్టి పరిస్థితుల్లోనూ నిద్రపోకూడదని ప్రతిజ్ఞ చేసుకుంటాం. విజయవాడలో బస్సాగుతుంది. కాఫీ తాగుదాం బస్సు దిగమంటాడు. మనం బస్సు దిగితే మన లగేజి ఏమవుతుందోనన్న భయంతో - మధ్య స్టేషన్లో బస్సు దిగే అలవాటు మనకి లేదంటాం. బతికి పోయేవంటాడు. దాని మీనింగేమిటని అడుగుతాం. నువ్వు తాగే కాఫీలో మత్తు మందు కలుపుదామనుకున్నానని అతను బస్సు దిగేస్తాడు!

ఆపద గడిచినందుకు ఆనందిస్తాం. అంతలో కేంటీన్ కుర్రాడు కాఫీ తెచ్చి మనకిస్తాడు. ఆర్డర్ యివ్వకుండానే కాఫీలేమిటని అడుగుతూనే అతను తెచ్చిన కాఫీని తాగబోతుంటాం. మీ పక్క సీటాయన ఈ కాఫీని మీకివ్వమన్నాడని కేంటీన్ కుర్రాడు చెబుతాడు. ఆ మాట వినగానే నోట్లో వున్న కాఫీని తుపుక్కున ఉసేస్తాం. అదేమిటని అడుగుతాడు. అదంతె అంటాం. వాడు వెళ్ళిపోతాడు. రవుడీ వక్కపొడి నములుత్తా బస్సెక్కుతాడు. మన పక్కన కూచుంటూ - నేను పంపిన కాఫీ తాగుతావేమో అనుకున్నానంటాడు. ఆ పప్పులు మన దగ్గర ఉడకవని చెబుతాం. ఈ పప్పు కాకపోతే ఇంకో పప్పు! అర్ధరాత్రి దాటాక ఎంతటివాడైనా కునుకు తియ్యక తప్పదు. నువ్వు నిద్రలో వుండగా నీ లగేజీల్లో ఏదో ఒకటి మటాష్ అని వార్నింగిచ్చి వాడు నిద్రపోతాడు!

మనకి నిద్రవుండదు. ముంచుకువచ్చే నిద్రని బలవంతంగా ఆపుకుంటాం. తెల్లగా తెల్లవారుతుంది. మన బస్సు హైదరాబాద్ బస్సు స్టేషన్‌కి చేరుకుంటుంది. మన లగేజీ మళ్ళా లెక్క పెట్టుకుంటాం. అన్నీ భద్రంగా వుంటాయి. అమ్మయ్య అనుకుంటాం. రౌడీ అప్పుడే నిద్రలేచి బ్రీఫ్‌కేసుతో బస్సు దిగుతూ - థేంక్స్ అంటాడు. థేంక్స్ ఎందుకని ఆందోళనగా అడుగుతాం. నా బ్రీఫ్‌కేసులో డబ్బుంది. నాకు నిద్రెక్కువ. మేలుకుని కాపలా కాయడం నా తరం కాదు. అంచేత ఆడ్యూటీ నీకు వేసానంటాడు. అసలు సిసలు అమాయకులం మనమేనని అప్పటిగ్గాని తెలీదు. ఇది రొటీన్ కథే. ఈ టైపు కథల్తోనే ఏలికలు మనల్ని ఏలుబడి చేస్తున్నారు! ☆

సామాజిక స్పృహ కోల్పోతున్న యువత

"కొంతమంది యువకులు..పుట్టుకతో వృద్ధులు..." దేశ భవిష్యత్తుకు పునాదివంటి వారైన యువత తమ బాధ్యతలను గుర్తెరగకుండా ప్రవర్తిస్తున్నందుకు ఓ కవి వ్యక్తపరిచిన ఆవేదన అది. దేన్నయినా సాధించగల తెగువ, ఆత్మస్థైర్యం గల యువత, వివిధ వ్యసనాలకు బానిసై తమ అభివృద్ధితో పాటు దేశాభివృద్ధిని కుంటుపరుస్తున్న విషయం అసత్యం కాబోదు. తమ చుట్టూ జరుగుతున్న దేమిటో అర్థం కాకుండా పాలకులు వారి దృష్టిని మళ్ళిస్తుంటే ఆ మత్తులో కొట్టుకుపోతున్నారు. తమ హక్కులను సాధించుకోవడానికి కూడా ముందుకు రాని విధంగా యువతరం తయారవుతోంది. వీరి మధ్యే యువతరం కర్తవ్యాలను బోధిస్తూ పాలకుల విధానాలను బయటపెట్టే యువత కూడా ఉంది. మీడియా విషవలయంలో చిక్కుకుపోవద్దని, మన మెడకు బిగుసుకుంటున్న ఉచ్చును గమనించమని ఆ యువత కోరుతోంది. విభిన్న మనస్తత్వాలు గల యువత ఏ వైపుకు పయనిస్తున్నదో పరిశీలించడమే ఈ వారం కవర్ కథన ఉద్దేశం.

కంభాలపల్లి కృష్ణ

ఈ దేశ భవిష్యత్తు యువతీ యువకుల శక్తి సామర్థ్యాలపై ఆధారపడి ఉందని స్వాతంత్ర్యోద్యమ కాలంనాడే అప్పటి నాయకులు మనకు సెలవిచ్చారు. అలాంటి యువత నేడు మద్యం మత్తుతోనూ, అశ్లీల సినిమాలతోనూ, మాదకద్రవ్యాలతోనూ, పిజ్జాకార్నర్‌లతోనూ, డిస్కోక్లబ్‌లతోనూ కాలక్షేపం చేస్తోంది. మెజార్టీ యువత ఇటువంటి ప్రమాదకర వినోదంతో తమ జీవితాలను నాశనం చేసుకుంటుండగా చదువుకుంటున్న యువత మాత్రం తమ వ్యక్తిగత ప్రతిభా పాటవాలకు ప్రాధాన్యత ఇస్తోంది. ఎవరు ఏమైపోతే మనకేమిటిలే అనే ధోరణితో సమిష్టితత్వానికి దూరంగా ఉంటోంది. పోటీ ప్రపంచంలో కెరీరిజం పెరిగి సామాజిక సమస్యల పట్ల అలసత్వం అధికమవుతోంది. యువత పెడదారి పట్టకుండా చూడాల్సిన ప్రభుత్వాలు మాత్రం వారు ఆకాశానికి నిచ్చెనలు వేసేలా లేనిపోని ఆశలు కల్పిస్తూ మరింత భ్రమలో బతకమని చెబుతున్నాయి.

కాలక్షేపంతోనే సరి..!

ఉదయం లేవగానే బెడ్ కాఫీ..అలవాటు ఉంటే ఓ సిగరెట్..ఆ తర్వాత చిన్నగా ఇతర పనులు ముగించుకొని రోడ్డుపై పడటం..స్నేహితులతో కలిసి ఇష్టముంటే కాలేజీకి వెళ్ళడం..లేకపోతే ఏ సినిమాకో చెక్కేయడం..మళ్ళీ సాయంత్రం ఏ పార్కుకో, బీచుకో వెళ్ళడం..రాత్రికి ఇంటికి చేరుకోవడం..వివిధ పట్టణాలు, నగరాల్లో మెజార్టీ యువత దైనందిన కార్యక్రమం పైవిధంగానే సాగుతోంది. ఇటువంటి అలవాట్లు ఉన్నవాళ్ళలో సంపన్నులు అధికంగా ఉంటుండగా వారిని చూసి మధ్యతరగతి యువత కూడా వీటికి అలవాటు పడే ప్రయత్నాలు చేస్తోంది. కాలేజీ పేరు చెప్పి బలాదూర్ తిరగడానికే ఎక్కువశాతం యువత ఇష్టపడుతోంది. అయితే ఈ కాలక్షేపం తరతమ స్థాయిల్లో ఉంటోంది. తాత, తండ్రులు సంపాదించిన ఆస్తులను కరిగిస్తున్న వారు కొందరైతే వీరిని చూసి అప్పులు చేసైనా సరే సరదాలు తీర్చుకుంటున్న వారు ఉన్నారు. యువత కాలక్షేపం చేస్తున్న అంశాల్లో సినిమాలు, పార్కులు, బీచ్‌లు, విహారస్థలాలు, బేకరీలు, క్లబ్‌లు ప్రధానంగా ఉంటున్నాయి. ప్రధాన పట్టణాలు, నగరాల్లోని పార్కులు యువతతోనే నిండిపోతున్నాయి. ఒంటరిగా కూర్చొని దిక్కులు చూసే వారు కొందరైతే జంటగా వచ్చి కబుర్లలో పడిపోయే వారు మరికొందరు. ఏతావాతా రోజంతా పార్కుల్లోనే గడిపే వారి సంఖ్య కూడా బాగానే ఉంటోంది. 'రోజూ కాలేజీకి ఏం వెళ్తాం సర్. కొన్ని సబ్జెక్టులు మరీ బోర్. అక్కడికంటే ఈ పార్కులోనే ప్రశాంతంగా ఉంటుంది' అంటాడు బికామ్ చదువుతోన్న కిరణ్. తన తండ్రి రక్షణ విభాగంలో పని చేస్తున్నాడని, అందువల్లే ఖర్చులకు ఏమీ ఇబ్బంది ఉండదని అంటాడు. ఖాళీ సమయాల్లో ఇలా పార్కులకు వస్తుంటానని, ఇక్కడ కూడా బోర్ కొడితే ఏదేనీ ఇంగ్లీష్ సినిమాకు వెళ్తానని చెప్పాడు. రాత్రి సమయాల్లో పొద్దుపోయే వరకు మేలుకొంటానని, ఇంటర్నెట్‌లో చాటింగ్ చేస్తుంటానన్నాడు.

కేఫ్‌ల్లోనూ, టీస్టాళ్ళలోనూ యువత చేస్తున్న కాలక్షేపం అంతా ఇంతా కాదు. టీ మీద టీ తాగుతూ గంటల కొద్దీ కబుర్లు చెప్పుకుంటున్నారు. 'వారానికి రెండు సినిమాలయినా చూస్తా. ఏదో ఒక ఎంటర్‌టైన్‌మెంట్ కావాలి కదన్నా. సినిమాలయితే ఎక్కువ సేపు ఎంజాయ్ చేయొచ్చు. కొత్త సినిమాలన్నీ వదలకుండా చూస్తా' అని అంటాడు రమేష్ అనే డిగ్రీ విద్యార్థి. 'ఒక్కోసారి ఒక్కొక్కరం ఖర్చులు భరిస్తుంటాం. ఇంట్లో డబ్బులు ఎక్కువ ఇచ్చే వాళ్ళుంటే వాళ్ళు నెలలో రెండుసార్లయినా అందరి ఖర్చు భరిస్తుంటా'రని చెప్పాడతను. తండ్రి చిన్నపాటి గవర్నమెంట్ ఉద్యోగి. అయినా ఎలాగో అలాగా ఖర్చులకు డబ్బు ఇస్తుంటారన్నాడు. యువతుల విషయానికి వస్తే కొంచెం ఆర్థిక స్థోమత ఉన్న వారు సి.డి.లు తెచ్చుకొని సినిమాలు చూడటంతోనో, ఫ్రెండ్స్‌తో కలిసి బేకరీలకు వెళ్లడంతోనో ఎక్కువ భాగం కాలక్షేపం చేస్తున్నారు. వరుసగా రెండు మూడు సంవత్సరాల నుండి విశ్వసుందరి కిరీటాలు మనకే వస్తుండటంతో అమ్మాయిల్లో ఫ్యాషన్ పట్ల క్రేజీ అధికమవుతోంది. 'మేకప్ విషయంలో ఈ మధ్య మా ఫ్రెండ్సంతా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వారానికి ఒకసారైనా బ్యూటీపార్లర్‌కు వెళ్ళడం, కనీసం ఒక సినిమా అయినా చూడటం తప్పనిసరి' అని చెప్పింది మాధవి. ఆమె కంప్యూటర్ కోర్సు చేస్తోంది. పక్క జిల్లా నుండి హైదరాబాద్‌కు చదువుకోవడానికి వచ్చిన ఆమె ఉమెన్స్ హాస్టల్‌లో ఉంటోంది. బాగా బోర్ కొడితే టెంపుల్‌కు వెళ్తాం. అటు నుండి ఐస్‌క్రీమ్ పార్లర్ లేదా బేకరీలకు వెళ్ళడం అనేది తప్పనిసరిగా జరుగుతుంది. ఇక హాస్టల్‌లో ఎలాగూ టీవీ ఉంటుంది కనుక రాత్రి పన్నెండు వరకైనా కాలక్షేపం జరుగుతుంది' అని

అంటారామె.

'ఐటిపైనే క్రేజంతా'

దేశవ్యాప్తంగా నేడు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐ.టి.) రంగంపై అత్యధిక భాగం యువత దృష్టి కేంద్రీకరిస్తోంది. పదిమందిలో కనీసం ఏడుగురు కంప్యూటర్ కోర్సు చేస్తున్నామనో, చేయాలనే ఉద్దేశం ఉందనో చెబుతున్నారు. 'మల్టీమీడియా కోర్సు చేయాలని సంవత్సరం క్రితం అనుకున్నాను. నేనుండే పట్టణంలో ఎంక్వైరీ చేస్తే హైదరాబాద్‌లో బాగా చెబుతారని చెప్పారు. ఇంట్లో చెప్పి వచ్చి ఇక్కడ జాయిన్ అయ్యాను' అంటాడు మల్లికార్జున్. అతను ఇప్పటి వరకు మల్టీమీడియా కోర్సు కోసం 15 వేలు చెల్లించాడు. కోర్సు ముగిసే సమయానికి ఇంకా పదివేలయినా కట్టనున్నాడు. ఇప్పటి విద్యార్థులు, యువకులు కంప్యూటర్ కోర్సుల్లో అధికంగా చేరుతుండటం చూసి ఆయా రంగాల్లో శిక్షణ ఇచ్చే కేంద్రాల సంఖ్య కూడా ఇబ్బడిముబ్బడిగా పెరిగింది. ఒకప్పుడు టైప్ ఇనిస్టిట్యూట్‌లు ఎలా ఉండేవో ఇప్పుడు కంప్యూటర్ అప్లికేషన్స్‌లో శిక్షణ ఇచ్చే సంస్థల పరిస్థితి కూడా అలాగే ఉంది. ఇంటర్ మీడియట్ తరువాత డిగ్రీ చదువుతూనో లేక మొత్తానికి నిలిపివేసి కంప్యూటర్ కోర్సులోనో చేరిపోతున్నారు. గ్రాఫిక్ డిజైనింగ్ లేదా ఇంటర్నెట్ ఆప్షన్స్ ఉన్న జావా, సి, సి+ వంటి కోర్సులకు ఎనలేని గిరాకీ పెరిగింది. దీన్ని ఆసరా చేసుకొని నాణ్యత లేని అనేక సంస్థలు వెలిసి విద్యార్థుల జేబులు ఖాళీ చేస్తున్నాయి తప్ప నేర్పేది తక్కువగా ఉంటోంది. ఈ పరిస్థితికి ప్రభుత్వాలు చేస్తున్న ప్రచారం కూడా ప్రధాన కారణం అవుతుంది. 2005 నాటికి 2 కోట్ల ఉద్యోగాలను కేవలం ఐ.టి. ద్వారా సృష్టిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. కాని అమెరికా వంటి పెద్దదేశంలోనే ఐ.టి.లో పెద్దఎత్తున సంక్షోభం వచ్చింది. వై2కె సమస్య తలెత్తినప్పుడు ఇబ్బడిముబ్బడిగా సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్స్‌ను దిగుమతి చేసుకున్న అమెరికా, ఇప్పుడు వారిని ఇంటికి పంపిస్తోంది. అక్కడ కనీసం యాభై వేల మందిని ఉద్యోగాల్లోంచి తీసివేస్తే వారిలో అత్యధికులు భారతదేశస్థులు ఉన్నారు. ఇప్పటికే 54వేల మంది సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్స్, నాలుగువేల మంది సపోర్టింగ్ సిబ్బంది మనవద్ద ఉండగా అమెరికా నుండి తిరిగి వచ్చిన వారిని కూడా కలుపుకుంటే ఐ.టి.లో ఎన్ని ఉద్యోగాలు వస్తాయో అర్థమవుతుంది.

'విచ్చలవిడిగా హీనసంస్కృతి'

కేబుల్ టీవీ ప్రసారాలు ప్రారంభమయ్యాక విచ్చలవిడిగా విదేశీ సంస్కృతి మన ఇళ్ళల్లోకి వచ్చి చేరుతోంది. 100 చానెళ్ళలో వంద రకాల కార్యక్రమాలు వస్తూ మన సంస్కృతిని కాలుష్యం చేస్తున్నాయి. ఎంటీవి, ఎఫ్‌టీవీలను చూస్తూ యువత ఎక్కువ సమయం గడుపుతోంది. దుస్తుల అమ్మకం కోసం నిర్వహించే ఫ్యాషన్ షోల మోజు హైదరాబాద్ నగరానికీ సోకింది. ఫ్యాషన్ షోల పేరుతో అర్ధనగ్నంగా అటూ ఇటూ తిరగడానికి కొంతమంది యువతులు ఆరాటపడుతున్నారు. ఆధునికత పేరుతో వేషభాషల్లో అనేక మార్పులు వచ్చాయి. పాశ్చాత్యుల అనుకరణలో భాగంగా యువత చర్యలు వెర్రితలలు వేస్తున్నాయి. ఏదేనీ పండుగలు గానీ, నూతన సంవత్సరం వంటి సందర్భాల్లో గానీ యువతను అదుపు చేయడం కష్టతరంగా మారుతోంది. రోడ్లపైనే మద్యం తాగుతూ నానా గందరగోళం సృష్టిస్తున్నారు. సందర్శక స్థలాలన్నింటినీ వీరే ఆక్రమించి చిందులు వేస్తుంటారు. వీరికోసమే అన్నట్లుగా నగరాల్లో డిస్కోలు నిర్వహిస్తున్నాయి కొన్ని హోటళ్ళు. అక్కడ మద్యం తాగడంతో పాటు ఏవో కొన్ని పిచ్చి పాటలకు పిచ్చిపిచ్చిగా డాన్స్ వేస్తుంటారు. అర్ధరాత్రి వరకు ఈ మత్తులోనే మునిగి తేలుతున్నారు. ఈ కార్యక్రమాలను ఎక్కువగా మద్యం కంపెనీలు స్పాన్సర్ చేస్తుంటాయి. మద్యం మత్తులో యువతీ యువకులు చేసే డాన్స్‌లు అశ్లీలంగానూ, అత్యంత వెగటు పుట్టించేవిగా ఉంటున్నాయి. ఈ సమయంలో వారు చేస్తున్నదేమిటో వారికే అర్థం కాని స్థితిలో ఉండిపోతున్నారు. బాగా డబ్బున్న యువత ఇలాంటి హోటళ్ళలో కాలం గడుపుతుంటే ఓ మాదిరి సంపన్నులు మద్యంతో పార్టీలు చేసుకోవడంలో మునిగి తేలుతున్నారు. ఒకరకం యువత ఇలా విందులు, వినోదాలతో సరదాగా గడుపుతోంటే మరోరకం యువత మత్తుమందుకు బానిస

'మార్గం సరిగా లేదు'

-విజయ్ (బిసిఏ ఫైనల్ ఇయర్)

తమ సమస్యల పరిష్కారానికి యువత పోరాడాల్సిన అవసరం ఉన్నా కొన్ని విద్యార్థి సంఘాలు ఎంచుకుంటున్న మార్గం సరిగాలేదు. అవసరమైతే జాతీయ పతాకాన్ని కూడా ముక్కలు ముక్కలు చేయడానికి కొందరు వెనకాడడం లేదు. ఇది మంచి సంప్రదాయం కాదు. యువత ఆవేశం తగ్గించుకొని తామేం చేస్తున్నామో కొంచెం ఆలోచించాలి. అమెరికాలో కానీ, ఇండియాలో కానీ ఐ.టి. రంగంలో వచ్చిన సంక్షోభం వల్ల బిసిఏ విలువ తగ్గుతూ వస్తోంది. దీనికి నిదర్శనం ఇటీవల జరిగిన ఇంజనీరింగ్ కౌన్సిలింగే. భవిష్యత్తులో ఎంబిఏ చేయాలనే ఆలోచనతో ఉన్నాను.

సమరశీల యువజన సంఘం డి.వై.ఎఫ్.ఐ.

పి.వి. శ్రీనివాస్,
డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు

సంవత్సరానికి 1.9 శాతం చొప్పున రాష్ట్రంలోనూ, రెండు శాతం చొప్పున కేంద్రంలోనూ ఉద్యోగాలు తగ్గించేలా ప్రపంచబ్యాంకుతో ఒప్పందం కుదిరింది. దేశవ్యాప్తంగా 1993-94లో 1.9 శాతంగా ఉన్న నిరుద్యోగం 1999-2000 నాటికి 2.2 శాతానికి పెరిగిందని ప్రభుత్వమే ఒప్పుకుంటున్నది. రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఉపాధి కోల్పోయిన వారిలో అనియత విద్యా బోధకులు, విద్యా వాలంటీర్లు ఉన్నారు. ఖాళీ పోస్టులను మిగులుతో సిబ్బందితో భర్తీ చేస్తుండటం వలన కొత్తగా ఉద్యోగాలేవీ ప్రభుత్వం ఇవ్వడం లేదు. రాజకీయ ప్రయోజనాల రీత్యా ఇటీవలే రెండు సార్లు డిఎస్‌సి ప్రకటించి టీచర్ పోస్టుల భర్తీని ప్రభుత్వం చేపట్టింది. నిరుద్యోగులతో పాటు యువతీ యువకులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) ఎప్పటికప్పుడు స్పందిస్తూ పోరాటం జరుపుతోంది. గ్రూపు-2లో ఖాళీగా ఉన్న నాలుగువేల పోస్టులను భర్తీ చేయాలని ఆందోళన జరిపాం. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉపాధి వ్యూహపత్రంపై మేధావులతో చర్చాగోష్టులు నిర్వహించాం. నిరుద్యోగ సమస్యపై రాష్ట్రవ్యాప్తంగా సదస్సులు జరిగాయి. రంగాల వారీగా వివిధ సమస్యలపై ఆందోళనలు జరిపాం. తీవ్రమైన అభద్రతతో నిరుద్యోగులు ఆత్మహత్య చేసుకుంటున్నారు. నల్గొండ జిల్లా చిట్యాలకు చెందిన యాదగిరి (బిఎస్సీ) హైదరాబాద్‌లోనూ, కర్నూలుకు చెందిన సురేష్‌బాబు (బిటెక్), కృష్ణాజిల్లా బందర్‌కు చెందిన శేషుబాబు ఆత్మహత్య చేసుకున్నారు. తాము చదివిన చదువులకు ఉద్యోగాలు రానందునే చనిపోతున్నట్లు వారు రాసిన లేఖల్లో పేర్కొన్నారు. నేటి యువత ఈ అంశాలను గమనించాలి. ప్రభుత్వం కల్పిస్తున్న భ్రమల నుండి బయటపడి వాస్తవాలను తెలుసుకోవాలి. ఆయా సందర్భాల్లో యువత హక్కుల కోసం జరుగుతున్న ఆందోళనలకు మద్దతునివ్వాలి. గతనెల అల్జీరియాలో జరిగిన పదిహేనవ ప్రపంచ విద్యార్థి యువజనోత్సవాలు సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాటాలను ముందుకు తీసుకువెళ్ళాలని పిలుపునిచ్చాయి. పపంచం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలన్నింటినీ చర్చించి, వాటి సమస్యల పరిష్కారానికి జరుగుతున్న కృషి ఏమిటో తెలుసుకోవడానికి విద్యార్థి, యువజనోత్సవాలు ఎంతగానో తోడ్పడ్డాయి. అమెరికా, బ్రిటన్, జర్మనీ, ఇటలీ, కెనడా, వంటి దేశాల ప్రతినిధులు తమ దేశాల్లో నెలకొన్న మాంద్యం వలన నిరుద్యోగం పెరుగుతున్నదని తెలిపారు. ప్రజల అసంతృప్తిని పక్కదారి పట్టించే జాతిదురంహకార ఉద్యమాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తమ దేశాల వనరులను సామ్రాజ్యవాద దేశాలు ఎలా దోచుకుంటున్నదీ తృతీయ ప్రపంచదేశాల ప్రతినిధులు వివరించారు. దేశ సార్వభౌమత్వాన్ని కాలరాయాలనుకుంటున్న అమెరికా, ప్రపంచబ్యాంకు, ఐఎంఎఫ్ ప్రయత్నాలను వివరించారు. తృతీయ ప్రపంచదేశాల మధ్య సహాయ సహకారాలను పెంచుకుంటూ పోరాటాలను ఉధృతం చేయాలని ఆకాంక్షించారు. సోషలిస్టు దేశాలైన క్యూబా, వియత్నాంలలో విద్య, వైద్యరంగాల్లో సాధించిన విజయాలను ఆయా దేశాల ప్రతినిధులు వివరించారు. పదిరోజుల క్రితం న్యూయార్క్‌లోని డబ్ల్యు.టి.సి. భవనాన్ని ధ్వంసం చేసి వేలాది మంది అమాయకుల ప్రాణాలు బలిగొన్న ఉగ్రవాద దాడిని అందరితో పాటు యువత కూడా ఖండించింది. ఇదే సమయంలో నాటి వియత్నాం నుండి నేటి ఇరాక్ వరకు అమెరికా సామ్ర్యావాదులు జరిపిన అమానుషదాడులను, నరమేధాలను గుర్తుకు తెచ్చుకొని మరోసారి తమ సామ్రాజ్యవాద వ్యతిరేకతను వ్యక్తం చేయడమూ మనం గమనించాలి.



అవుతోంది. కొందరు దౌర్జన్యాలు చేస్తూ బతుకుతుంటే మరికొందరు అరాచకశక్తులుగా తయారవుతున్నారు. హైదరాబాద్ డ్రగ్స్‌కు కేంద్రంగా మారనున్నదని గుర్తించారు. ఇందులో ప్రధాన పాత్ర పోషిస్తున్నది యువతే. గంజాయి, బ్రౌన్‌షుగర్, కొకైన్ వంటివి ఎక్కువగా అమ్ముడవుతున్నాయి. అప్పుడప్పుడు వీటిని రవాణా చేసే వారిని పోలీసులు పట్టుకుంటున్నారు. హైదరాబాద్‌తోపాటు రాష్ట్రంలోని ప్రముఖ పట్టణాల్లో అరాచక శక్తుల సంఖ్య

'నూతనత్వం వైపు మొగ్గు'

-శ్యాంసన్ (బిఎస్సీ)

ప్రతిదాంట్లోనూ ఏదో ఒక నూతనత్వాన్ని నేటి యువత వెదుకుతోంది. ఈ క్రమంలో కొన్ని చెత్త సినిమాలు చూడటం ద్వారాగానీ, కొన్ని పత్రికల్లో వస్తున్న అసభ్య బొమ్మలు గాని చూసి యువత పెడదారి పడుతోంది. సినిమాల విషయానికి వస్తే ఈ మధ్య ప్రేమ చుట్టూ తిరిగే కథలు పెరిగాయి. అప్పటి వరకు వారి మనసుల్లో ఎలాంటి భావం లేని వారు కూడా ఇలా ప్రేమ సెంటిమెంట్ ఉన్న సినిమాలు చూసి కెరీర్‌ను చెడగొట్టుకుంటున్నారు. ఒకవైపు ఎంత చదివినా ప్రభుత్వం ఉద్యోగం ఇచ్చే అవకాశాలు కనిపించడం లేదు. అడ్డూ అదుపు లేకుండా పెరుగుతున్న జనాభా కూడా దీనికి ప్రధాన కారణం. నేనొక స్వచ్ఛంద సేవాసంస్థ సభ్యుడిగా కూడా ఉన్నాను. యువతకు నాలుగు మంచి విషయాలు నేర్పడంతో పాటు నా జీవితాన్ని చక్కదిద్దుకోవడమే ఇప్పుడు నేను చేయాల్సిన పని.

అధికంగా ఉన్న విషయం తెలిసిందే. ఈ ముఠాలన్నింటిలోనూ యువతే అధికంగా ఉంటోంది. రౌడీషీటర్లు, నేరస్తులు, పిక్‌పాకెటర్లు, దౌర్జన్యకారులు, అత్యాచారాలకు పాల్పడుతున్న వారిలో అత్యధిక భాగం యువతే అన్నది ఆందోళన కలిగించే అంశం.

'మీడియా పాత్ర కీలకం'

టీవీ ఛానెళ్ళతో పోలిస్తే యువతను మరింత మత్తులో ఉంచుతున్న రంగం సినిమా మీడియా అని చెప్పాలి. కొత్తగా యవ్వన దశలోకి ప్రవేశించి ఎలాంటి భావాలు లేని వారు కొన్ని రకాల సినిమాలను చూసి తమ మనసును కలుషితం చేసుకుంటున్నారు. బాలీవుడ్‌తో పాటు మన టాలీవుడ్ కూడా ప్రేమ తప్ప మరో లోకం లేదనే చాటి చెబుతోంది. యువతీ యువకులను ప్రేమలోనే ముంచి తేలుస్తున్నాయి సినిమాలన్నీ. ఏదో ఒక కథ తీసుకోవడం, దానిలో కొన్ని ప్రేమ సన్నివేశాలు జోడించడం...ఇదే తంతు. ఏ సినిమా తీసుకున్నా ఇంతకంటే ఎక్కువేం ఉండదు. కాలేజీ స్థాయిలోనే యువకుల మధ్య ప్రేమను పుట్టించి ఇక ఆ ప్రేమ కోసమే జీవితం, ప్రేమలేకపోతే చావే శరణ్యం అన్న మాదిరిగా సినిమాలు తీస్తున్నారు. అదృష్టమో, దురదృష్టమో అలాంటి సినిమాలే ఇప్పుడు వంద రోజులకు పైగా నడుస్తున్నాయి. ఈ సంవత్సరం ప్రారంభంలో ప్రేమ అనే సబ్జెక్టుతో వచ్చిన సినిమాలు, సినిమా చరిత్రలోనే మరెప్పుడూ రాలేదని కూడా చెప్పవచ్చు. వీటి ప్రేరణతోనే పార్కులు కానీ, బేకరీలు కానీ, విహారస్థలాలు కాని నిత్యం కళకళలాడుతున్నాయి.

కాలేజీకి రావడం, ఫ్రెండ్స్‌తో కబుర్లు చెప్పుకోవడం, మధ్యలో బేకరీలో ఫాస్ట్‌ఫుడ్ తినడం, కొంచెం బోర్‌గా అనిపిస్తే ఓ సినిమా చూడటం, సరదాగా ఏదైనా పార్కుకు వెళ్ళడం, ఆ తరువాత రాత్రి పొద్దుపోయే వరకు ఇంటర్నెట్‌లో ఛాటింగ్ చేయడం....ఇవే అంశాలు చాలా మంది యువతకు నిత్యకృత్యమవుతున్నాయి. జీవితంలో ప్రధాన అంశం అయిన పెళ్ళి విషయంలో కూడా ఎక్కువ మంది యువత నిర్లిప్తతోనే వ్యవహరిస్తున్నారు. డబ్బులు బాగా ఉన్న అత్తామామల కోసం కొందరు ఆశపడుతుంటే, మరికొంత మంది సంపాదించే వారు భాగస్వామి అయితే బాగుంటుందనుకుంటున్నారు. కొంచెం చదువు మీద శ్రద్ధ ఉన్నవాళ్ళు కోచింగ్ సెంటర్ల చుట్టూ చేరడం, తమకు పనికివచ్చే అంశాలను అధ్యయనం చేయడంతో సరిపెట్టుకుంటున్నారు. తమ కెరీర్‌ను అభివృద్ధి పరచుకోవడానికి అహర్నిశలు శ్రమిస్తున్నారు. అంతేతప్ప తమ చుట్టూ ఉన్న సమాజంలో జరుగుతున్నదేమిటో పై రెండు తరగతుల యువతకు అవసరం లేకుండా పోతోంది. వర్షం కురిసినా, కురవకపోయినా, పంటలు పండకపోయినా, పేదలు తిండిలేక ఆత్మహత్య చేసుకున్నా, ధరలు చుక్కలనంటుతున్నా, ప్రభుత్వం పన్నులు పెంచుతున్నా వీరు చలించడం లేదు.

'సమస్యల్లో గ్రామీణ యువత'

నగరాలు, పట్టణాల్లోని యువత పరిస్థితి ఇలా ఉంటే గ్రామీణ ప్రాంతాల్లోని యువత మరోరకంగా ఉంటోంది. ఇక్కడ చదువుకున్న నిరుద్యోగుల్లో మహిళల శాతం అధికంగా ఉంటోంది. వీరి ప్రధాన సమస్య వరకట్నం. ఎంత చదువు చదివినా లక్షలు చదివించందే పెళ్ళిళ్లు జరగడం లేదు. అటు ప్రభుత్వ ఉద్యోగాలు రాక, ఇటు ప్రైవేటురంగంలో ప్రోత్సాహం తక్కువగా ఉండి గ్రామీణ యువతులు ఇబ్బందులు పడుతున్నారు. చిన్నతరహా పరిశ్రమల వంటివి ఉన్నా వాటికి ప్రభుత్వ ప్రోత్సాహం నామమాత్రంగానే ఉంటోంది. ప్రైవేట్ టీచర్‌గా పనిచేస్తే 500 నుండి 800 రూపాయలు కూడా రావడం గగనంగానే ఉంది. ప్రభుత్వం సిఎంఇవై వంటి పథకాలు ప్రవేశ పెడ్తున్నా అవి దక్కేది ఏ ఒకరిద్దరికో మాత్రమే. అందులోనూ అవినీతి అధికమై అర్హులకు అందడం లేదు. ఎక్కువశాతం మంది గ్రామీణ ప్రాంతాల నుండి యువకులు నగరాలకు వలస వస్తున్నారు. వీలైన మేరకు చిన్నపాటి ఉద్యోగాలు చేస్తున్నారు. ఎస్‌టిడి బూత్‌లు, కొరియర్ సర్వీసులు, హోటళ్ళు, సేల్స్ కంపెనీలు వీరిని ఆదుకుంటున్నాయి. తమ డిగ్రీ పట్టాలన్నింటినీ పక్కనపెట్టి వేయి నుండి పదిహేను వందల జీతానికి పనిచేస్తున్నారు. ఇది దొరకని వారి సంఖ్య

'లైఫ్‌లో సెటిల్ కావాలి'

-శ్రీధర్ (కంప్యూటర్ విద్యార్థి)

సాయంత్రం ఆరుగంటల నుండి రాత్రి పదిగంటల వరకు ఏదో రకంగా కాలక్షేపం చేస్తాం. ఎక్కువ శాతం ఫ్రెండ్స్‌తో కబుర్లు చెబుతుంటాం. కొన్నిసార్లు పార్కులకు వెళ్తుంటాం. టీ తాగడం, స్నాక్స్ తినడం వంటివి ఎక్కువగా జరుగుతుంటాయి. ప్రస్తుతం మాత్రం లైఫ్‌లో ఎలా సెటిల్ అవ్వాలన్నదే ఆలోచిస్తున్నాను. రెండు మూడేళ్ళ క్రితం జాబ్ గురించిన ఆలోచన ఉండేది కాదు. ఈమధ్యే ఫ్రెండ్సంతా ఈ విషయాలు మాట్లాడుతున్నారు. ప్రభుత్వం ఉద్యోగాలు ఇస్తుందన్న నమ్మకం లేదు. అందుకే ప్రైవేట్‌గా ప్రయత్నిస్తున్నాను.

కూడా అధికంగానే ఉంది.

'కర్తవ్యం ఏమిటి ?'

తమ సమస్యలను తాము గుర్తించకుండా అడ్డుపడుతున్నదెవరో యువత తేల్చుకోవాల్సిన అవసరం ఉంది. ఎంత చదువు చదివినా. రిజర్వేషన్లు ఉన్నా ప్రభుత్వ ఉద్యోగం ఎందుకు రావడం లేదో ఆలోచించాలి. ప్రైవేట్‌రంగంలో ఏవో కొద్దిపాటి ఉద్యోగాలు దొరుకుతున్నప్పటికీ అక్కడ పెట్టే షరతులు. శ్రమదోపిడీని గుర్తించాలి. ఎంతో చదువు చదివి కూడా స్వార్థ రాజకీయాల్లో పావులుగా ఎందుకు మారిపోతున్నామో ఆలోచించాలి. ధరలు పెరగడానికి కారణం ఎవరో తెలుసుకోవాలి. ఇంటిల్లిపాది కష్టపడి పండించిన పంటను నోటి దగ్గర నుండి లాక్కుపోతున్నదెవరో ఆలోచించాలి. సమాజ పురోగతిలో భాగస్వాములు కావాల్సిన వారు ఆత్మహత్య ఎందుకు చేసుకుంటున్నారో పరిశీలించాలి. వారి వెనకే ఉండి వెన్నుపోటు పొడుస్తున్న పాలకులను ఎదిరించే చైతన్యాన్ని పొందాలి. తమ హక్కులు సాధించుకోవడానికి సంఘటితమై పోరాటానికి సిద్ధం కావాలి. కుహనా మేధావులు. స్వార్థ రాజకీయ నాయకుల ప్రసంగాల్లోని ఆంతర్యాన్ని బయటపెట్టాలి. మూఢ నమ్మకాలను ప్రోత్సహించే విద్యను వ్యతిరేకించాలి. ఉపాధి హామీ గల విద్యా విధానానికి కృషి చేయాలి. ఈ కృషిలో మునుముందుకు వెళ్ళే వారే భావిభారత నిర్మాతలు..ముందుతరం దూతలు అవుతారు. వారికిదే ఆహ్వానం. ☆

సాంప్రదాయక అలవాట్లలోని కంటి చికిత్సా దోషాలు

డా॥ బి.సుబ్బారావు,
ఎస్.కె.సూపర్ స్పెషాలిటీ లేజర్ కంటి ఆసుపత్రి,
విజయవాడ

సాధారణ జన జీవన విధానంలో అనేక రకాల అలవాట్లు ఉంటాయి. కాని ఎన్నో సంవత్సరాలుగా వస్తూ వున్న ఈ అలవాట్లలో కొన్ని దోషాలు కూడా ఉంటాయి. ఈ దోషాల వలన ఒక్కోసారి కంటికి చాలా అపాయాలు జరిగే అవకాశమున్నది. ఇటువంటి వాటిలో ముఖ్యంగా అందం కోసం, దిష్టి తగలకుండా ఉండటం కోసం కంటికి కాటుక పెట్టుకుంటూ ఉంటారు. దీనివలన మనకంటికి నష్టాలు అనేకమున్నాయి. ఇంట్లో ఒకరికి ఎవరికైనా కండ్ల కలక వస్తే అదే డబ్బాలోని కాటుక వాడటం వలన ఆ డబ్బా ద్వారా సూక్ష్మ క్రిములు ఒకరి నుండి ఇంకొకరికి వ్యాపించి వారికి కూడా కండ్లకలక రావచ్చు. అలాగే కాటుక కూడా రకరకాలుగా చేస్తూ ఉంటారు. ఒక్కోసారి కొన్ని కెమికల్స్ కూడా కలుపుతూ ఉంటారు. ఈ కెమికల్స్ వలన కొన్ని కెమికల్ అలెర్జిక్ కంజక్టివిటీస్ వస్తాయి. అలాగే ఈ కాటుక కంటికొలుకుల దగ్గరచేరి కంటినీరు ముక్కులోపలికి ప్రసరణ అయ్యే మార్గాలలో చేరి వాటికి అవరోధం కలిగిస్తే కంటినీరు ఎప్పుడూ కారేటటువంటి నాసో క్రిమల్ డక్ట్ బ్లాక్ వస్తుంది. అలాగే కాంటాక్ట్ లెన్సులు వాడే వారు ఏ మాత్రం కాటుక వాడకూడదు ఎందుకంటే కాటుక అంటుకంటే కాంటాక్ట్ లెన్సులు రంగు అంటుకొని చెడిపోయే ప్రమాదముంది. అలాగే కంటి ఆపరేషన్ల ముందు, ఆపరేషన్ అయిన తరువాత కాటుక పెట్టుకోకూడదు. ముఖ్యంగా ఇన్‌ఫెక్షన్ వచ్చే ప్రమాదం ఎక్కువ అవుతుంది. అందువలన కాటుక పెట్టుకోకుండా ఉంటేనే మంచిది.

సూర్య, చంద్ర గ్రహణం చూడటం :

సూర్యగ్రహణం చూడటం వలన కంటిచూపు పోగొట్టుకున్న వారు చాలా మంది ఉన్నారు. కొందరికి పాక్షికంగాను, కొందరికి పూర్తిగాను కంటిచూపు కేంద్రం కాలిపోవటం వలన ఈ విధంగా సంభవిస్తుంది. చంద్రగ్రహణం కన్నా సూర్య గ్రహణాన్ని వీక్షించటం కంటిచూపుకు చాలా అపాయకరం. చాలా మంది సూర్యగ్రహణం చూడటం వలన పునీతులు అయ్యామని, స్వర్గలోక ప్రాప్తి ఫలము లభిస్తుందని అపోహపడుతుంటారు. ఇది సరైన అభిప్రాయం కాదు. సూర్యగ్రహణ సమయంలో అత్యంత శక్తివంతమైన షార్ట్, లాంగ్ ఇన్‌ఫ్రారెడ్ కిరణాలు విడుదల అవుతాయి. అలాగే అనేక రకాల తెలియనివి ఎన్నో కాస్మిక్ కిరణాలు కూడా ఎక్కువగా విడుదల అవుతాయి. వీటివలన కంటి రెటీనాలోని కణాలు వేడెక్కి కాలిపోయి చూపు దెబ్బతింటుంది. కొన్ని నిమిషాల పాటు తదేకంగా రక్షల అద్దాలు లేకుండా చూస్తే చూపుపోవడం తథ్యం. అలాగే ఎక్సరే ఫిల్మ్ ద్వారా కూడా చూస్తారు. నల్లటి అద్దాలు కూడా వాడతారు. వీటివలన అంతగా రక్షణ ఉండదు. కొన్ని సెకనులు చూస్తే ఫరవాలేదు. కాని నిముషాలు మాత్రం చూడకూడదు. అలాగే ఒకసారి కంటిచూపు కేంద్రం వాపు వచ్చి, కాలిపోతే మరలా ఎన్నిరకాల చికిత్స చేసినా కూడా పోయిన చూపును తిరిగి పొందలేము. అందువలన ఏదో ఆషామాషీగా గ్రహణ వీక్షణ చూడకూడదు.

అదే విధంగా సంధ్యావందనం చేసేటపుడు కూడా సూర్యుణ్ణి తదేకంగా చూడకూడదు. అలాగే మిట్టమధ్యాహ్నం సూర్యుణ్ణి కూడా తదేకంగా చూడకూడదు. దీనివలన కూడా చూపు దెబ్బతినవచ్చు.

అందువలన ఎవరైనా కూడా సూర్యగ్రహణాన్ని చూడకుండా ఉంటేనే మంచిది.

కంటిలో నలకపడితే :

సాధారణంగా ముందుగా నీటితో కడిగితే చాలా నలకలు వస్తాయి. లేదా తేమగా ఉన్న దూదితో కాని, కర్చీఫ్‌తో గాని తీస్తే చాలా వరకు నలకలు వస్తాయి. అపుడుకూడా నలకలు రాకుండా ఉంటే మామూలుగా నేత్రవైద్య నిపుణుని దగ్గరకు వెళ్ళే బదులు కొంతమంది నాటు వైద్యుల వద్దకు వెళ్తారు. వీరు ఒక్కోసారి నాలుకతో తీస్తారు. పుల్లలతో, కొబ్బరి పీచుతో కూడా తీస్తూ ఉంటారు. ఇంకా కొంత మంది



నాలుకతో తీసేవారు చిన్న చిన్న ఇసుకరాళ్ళు కూడా తీసామని, మన్ను చాలా ఉందని చూపిస్తూ ఉంటారు. ఇది చాలా మోసపూరితమైనది. ఎందుకంటే చిన్న నలకపడినా కూడా కన్ను తట్టుకోలేదు. అలాగే కంటి అంచులలో మన్ను మొదలైనవి తీస్తారు. చాలామంది పొగాకు పొడి నమిలి, దవడన పెట్టుకొని నాలుక తీస్తూ ఆ తడిపొడిని తీసి ఇది మన్ను అని చూపిస్తూ ఉంటారు. అలాగే సరిగా శుభ్రంగా ఉండని నోటితో తీస్తే ఆ నోటిద్వారా చాలామందికి కండ్లకలక వస్తుంది. అలాగే నలకపడినచోట కంటినల్ల పాపమీద చిన్న అల్సర్ (పుండుగా) కూడా ఏర్పడే ప్రమాదమున్నది. ఒకసారి కంటి కార్నియా (నల్లపాప) మీద పుండు ఏర్పడితే మానిపోవటం చాలా కష్టం. అలాగే మానిపోయినా కూడా మచ్చ ఏర్పడి, ఆ మచ్చవలన చూపు కూడా తగ్గిపోయే ప్రమాదమున్నది. అలాగే ఇనుపరజను కంట్లో పడితే వాటి తుప్పు కూడా నల్లపాప పొరలకు అంటుకొని ఉంటుంది. అది అలాగే ఉంటే చాలా ప్రమాదం. అందువలన ఏ రకమైన నలక అయినా కాని వెంటనే కంటి డాక్టరు దగ్గర చూపించి చికిత్స చేయించటం చాలా మంచిది.

రసాలు, పసర్లు :

కంట్లో చనుబాలు, పేరిన నెయ్యి, నూనె, శొంఠిరసం, తమలపాకు రసం మొదలగునవి వేయటం, రకరకాల ఆకుపసరలు వేయటం ఇవన్నీ కూడా పల్లెటూర్లలో సాధారణంగా జరుగుతూ ఉంటుంది. అందులోనూ చదువు, ఆర్థిక స్థోమత తక్కువగా వున్నవారిలో ఇది ఎక్కువ. అలాగే పట్టణాలలో మురికి వాడలలో ఇది ఎక్కువగా జరుగుతూ ఉంటుంది. వీటివలన ఒక్కోసారి రసాల సాంద్రత ఎక్కువ అయినా కంటికార్నియా (నల్లపాప) తీవ్రంగా డేమేజ్ అయి, తెల్లపడిపోయి చూపు దెబ్బతినే అవకాశమున్నది. అలాగే ఒక్కోసారి కన్ను కూడా పూర్తిగా పోయే అవకాశమున్నది. అందువలన ఎవరైనా సరే పసరులు, రకరకాల ద్రవాలు కంటిచికిత్సకు వాడకూడదు.

పై పద్ధతుల వలన చూపుతగ్గిపోయి, నానా విధాలుగా కష్టాలు పడి ఎంతోమంది మా దగ్గరికి చికిత్సకు వచ్చిన వారు వున్నారు.

ఒకరి కళ్ళజోడు ఇంకొకరు వాడటం :

ఇలా చాలామంది చేస్తూ ఉంటారు. ఈ పద్ధతి చాలా అపాయకరం. ఒకరికి కండ్లకలక లేక క్రానిక్ ట్రకోమా అంటువ్యాధి ఉంటే ఇంకొకరికి రావచ్చు. అలాగే చర్మం అలర్జీ, ఇన్‌ఫెక్షన్ కూడా రావచ్చు. అలాగే ఒకరి నెంబరు, ఇంకొకరి నెంబరు వేరు వేరుగా ఉంటుంది. ఎక్కువ, తక్కువ నెంబర్లు వాడటం వలన తలనొప్పి, మసక, కళ్ళు లాగటం, ఒక్కోసారి హై నెంబరు వాడితే టెంపరరీగా మెల్లకూడా రావచ్చు. ఒకటికి రెండులాగా వస్తువులు కూడా కనపడవచ్చు. ఒకరి ముఖానికి సరిపడా ఫ్రేము ఇంకొకరి ముఖానికి సరిపడక లూజుగాను, టైటుగాను ఉండవచ్చు. ఒకరిది ప్లస్ పవర్ అయితే ఇంకొకరిది మైనస్ పవరు అయి ఉండవచ్చు. అలాగే కొందరికి సిలెండ్రికల్ పవరు ఒక యాంగిల్‌లో ఉంటే ఇంకొకరికి ఇంకో యాంగిల్‌లో ఉండవచ్చు. అలా అనేక రకాలుగా తేడా ఉండవచ్చు. అందువలన ఎటువంటి పరిస్థితిలోనూ ఒకరి కళ్ళజోడు ఇంకొకరు వాడకూడదు.

పాతవి, కొన్ని నెలల తరబడి వున్న మందులు వాడటం :

ఈ పద్ధతి కూడా చాలా అపాయకరం. ఒక జబ్బుకు అవసరమయ్యే చుక్కల మందు అన్ని కంటి జబ్బులకు ఉపయోగపడదు. ముఖ్యంగా పొరబాటున అట్రోఫిన్ అనే చుక్కల మందు కంట్లో ఒకసారి వేసుకుంటే ఒక వారం రోజుల వరకు దగ్గరి చూపు కనిపించదు. అలాగే వెలుతురు కూడా చాలా ఎక్కువ చూసినట్లు, బయటికి వెళ్తే మిరుమిట్లు గొలిపినట్లు ఉంటుంది. కంటిపాప చాలా పెద్దది అయిపోయి ఉంటుంది. వెలుతురుకు అనుగుణంగా స్పందించదు. అలాగే ఆంగిల్‌క్లోజర్ గ్లాకోమా అనే నీటికాసుల జబ్బు వచ్చేందుకు అవకాశమున్న వారికి ఈ మందు వేస్తే సడన్‌గా ఆ జబ్బు వచ్చే అవకాశమున్నది. ఈ రకమైన నీటికాసుల జబ్బు వచ్చి సరిగా గుర్తించి సక్రమమైన చికిత్స తీసుకోకపోతే మొత్తంగా కంటిచూపే తగ్గిపోయే అవకాశమున్నది. అలాగే స్టెరాయిడ్ కలిగి వున్న మందులను కొన్ని నెలల పాటు వేస్తూనే ఉంటారు. ఇలా వాడటం వలన కంటి నల్లపాప (కార్నియా) పలుచబడి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, కంటిలోపల ఒత్తిడి పెరిగి నీటి కాసులు, పోస్టేరియర్ సబ్‌కాప్సులార్ కాటరాక్ట్ అనే శుక్లం కూడా వచ్చి చూపు తగ్గిపోవచ్చు. అలాగే కొన్ని డేట్ ఎక్స్‌పైర్ అయిన మందులు కూడా వాడితే వాటి వలన సైడ్ ఎఫెక్ట్స్ ఎక్కువగా వచ్చే

అవకాశమున్నది. అందువలన ఏ మందులు అంటే ఆ మందులు వాడకూడదు. ఎక్కువ కాలం వాడవలసి ఉంటే తప్పనిసరిగా నేత్రవైద్య నిపుణుని సలహా ప్రకారం వాడుతూ ఏ మాత్రం సైడ్ ఎఫెక్ట్ వచ్చినా వెంటనే మందులు ఆపివేసి దానికి ప్రత్యామ్నాయంగా వేరే మందులు వాడవలసి ఉంటుంది. కంటికి సంబంధించి ఏ మందులు వాడాలనుకున్నా కంటి డాక్టరును సంప్రదించి వాడటం మంచిది. ఎవరంటే వారు చెప్పిన విధంగా తమకు తోచినట్లు వాడకూడదు.

రకరకాల రంగుల కళ్ళజోళ్ళు వాడవచ్చా?

ఇలా ఏ రంగు కళ్ళజోడు అంటే అది పిల్లలకు మనం వాడకూడదు. ముఖ్యంగా రెడ్‌కలర్, క్రీమ్ కలర్‌వి వాడకూడదు. వాటి వేవ్‌లెంగ్త్ వలన కంటి రెటీనా, చూపు కేంద్రం మీద పడే దృశ్యాలు ప్రబలుతాయి. అన్నీ ఎర్రగాను లేక ఆకుపచ్చగానో కనిపించే అవకాశమున్నది. ఇవి వాడితే తలనొప్పి కూడా వస్తుంది. అంబర్ కలర్ (లేత పసుపుపచ్చ రంగు అద్దాలు) వాటిని పగలు వాడకూడదు. వెలుతురు ఎక్కువ అనిపిస్తుంది. రాత్రిపూట అయితే బాగుంటుంది. అలాగే ఫొటోగ్రే కళ్ళజోడును పగలు వాడితే మంచిది. చాలా డార్క్‌గా ఉంటే కళ్ళజోడును రాత్రిపూట వాడకూడదు. ఎందుకంటే కనపడే దృశ్యాలు చాలా మసకగా అయిపోతాయి. అందువల్ల ఏ కళ్ళజోళ్ళు పడితే ఆ కళ్ళజోళ్ళు ధరించకూడదు.

ఎక్కడంటే అక్కడ ఈత కొట్టడం వలన ప్రమాదముందా?

ముఖ్యంగా కొలనులు, కుంటలు, నీటితొట్లు మొదలగు వాటిలో శుభ్రం చేయని నీరు ఉంటే చాలా ప్రమాదం. కంటికి, చెవులకు కూడా ఆ నీరు తగిలి ఇన్‌ఫెక్షన్ వచ్చే అవకాశముంది. ముఖ్యంగా పండుగలలో రద్దీగా ఉన్నచోట్ల, తీర్థస్థలాలలో ఈ ప్రమాదం ఎక్కువగా సంభవించవచ్చు. శుభ్రమైన సబ్బుతో కడిగి పొడిగుడ్డతో తుడుచుకోవటం చాలా మంచిది. అలాగే తడిగుడ్డలతో, తడి తలతో ఎక్కువసేపు ఉండకూడదు. జలుబుతో పాటు, కంటికి కూడా వైరల్, కంజెక్ట్ వైరస్ రావచ్చు. అనేక రకాల కండ్ల కలకలు ఈ కొలనుల ద్వారా వచ్చే అవకాశమున్నది. అందువలన ఎక్కడికి వెళ్ళినా శుభ్రత పాటించటం ఆరోగ్యానికి చాలా మంచిది.

హోమాలు, కట్టెల పొయ్యి దగ్గర పనిచేసే వారికి ఏదైనా కంటి ప్రమాదముందా?

ఈ సమయంలో వచ్చే పొగవలన కండ్లు నీరుకారడం, మసకగా కనిపించటం జరుగుతుంది. అలాగే ఎక్కువ సమయం కట్టెల పొయ్యి దగ్గర పనిచేసే వారికి కండ్ల కలక, కళ్ళు ఎర్రపడటం లేదా వేడివలన శుక్లాలు మామూలు వారికంటే 5 లేక 10 సంవత్సరాల ముందుగా వచ్చే అవకాశముంది. అలాగే కండ్లు కూడా పొడిగా అయిపోయి గుచ్చుకున్నట్లు వుండటం మొదలైనవి వుంటాయి.

పిల్లలకు బహుమానాలు ఇవ్వటం :

మనం పిల్లల్ని ఎవరింటికైనా వెళితే ఏవో ప్రజెంటేషన్స్ తీసుకువెళ్తాము. కాని వాటిలో సూదిగా వున్న వస్తువులు అనగా పెన్స్, పెన్సిల్స్, పదునుగా వున్నవి ఇవ్వకూడదు. అలాగే పిస్టల్స్, బాణాలు, విల్లంబులు రకరకాల ద్రవాలు వంటివి ఇవ్వకూడదు. వీటి వలన కంటికి అనేక రకాల ప్రమాదాలు సంభవించవచ్చు. అలాగే రఫ్ గేమ్స్ ఆడేటప్పుడు తప్పనిసరిగా ప్రొటెక్టివ్ ఐ షీల్డ్ ధరించడం చాలా మంచిదని తెలియచెప్పాలి.

అతిగా కిళ్ళీ, బీడీ, సిగరెట్, చుట్ట, జర్దాకిళ్ళీ, సారాయి వాడటం వలన కంటికి ఏమైనా ప్రమాదమా ?

వీటివలన కంటికి, కంటిచూపుకు అనేక నష్టాలు వస్తాయి. పొగాకు వలన ''టుబాకో అంబ్లియోపియా" అనే వ్యాధి వచ్చి చూపు తగ్గిపోతుంది. ఎన్ని మందులు వాడినా ఫలితం ఉండదు. అలాగే సారాయి వలన 'ఆల్కహాలిక్ ఆప్టిక్ అట్రాఫీ' వస్తుంది. దీనివల్ల కంటి నరము ఎండిపోయి చూపు తగ్గిపోతుంది. జర్దాకిళ్ళీ వాడటం వలన కూడా చూపు తగ్గిపోతుంది. శుక్లాలు (కాటరాక్ట్) మామూలు వారికన్నా 10 సంవత్సరాల ముందే వస్తుంది. మందులు కూడా ఎక్కువ వాడవలసి ఉంటుంది. చికిత్సకు కూడా ఎక్కువ టైం పడుతుంది. అందువలన పైన తెలిపిన వాటిని వాడకుండా ఉంటేనే కంటి, శరీర ఆరోగ్యానికి చాలా మంచిది.

కుంకుడుకాయరసం :

కుంకుడు కాయల రసంతో తలస్నానం చేస్తూ ఉంటాము. దీనివలన ఒక్కోసారి కొంతమందిలో ఆ రసం కండ్లలో పడితే అలర్జిక్ కండ్లకలక వచ్చే అవకాశమున్నది. ఇలా వచ్చేటటువంటి వారు కుంకుడు కాయలకు బదులు మిగతా పద్ధతులు వాడితే మంచిది. అలాగే కంటి ఆపరేషన్ అయిన వారు కుంకుళ్ళు వాడకూడదు. అలాగే కంటి కార్నియా మీద అల్సర్ ఉన్నటువంటి వారు, యువరైటిస్ వున్నవారు, మిగతా కంటిజబ్బులున్న వారు ఇవి వాడకుండా వుంటేనే మంచిది. కండ్లు ఎక్కువ ఎరుపు అయ్యే ప్రమాదమున్నది.

హోళీలో రకరకాల రంగుపొడులు, రంగునీళ్ళు వాడడం

వీటివలన కూడా అనేక రకాల కెమికల్ ఇన్‌డ్యూస్‌డ్ కండ్లకలక వచ్చే అవకాశమున్నది. అలాగే నీరు మురికిగా వుంటే బాక్టీరియా కండ్లకలక కూడా వచ్చే అవకాశమున్నది. బలవంతంగా ముఖం మీద రంగులు పూస్తూ ఉంటారు. వీటివలన ఒక్కోసారి కంటికి, కంటి కార్నియాకు అబేషన్స్ ఏర్పడి, పుండు అయ్యే ప్రమాదం కూడా ఉంది. అందువలన ముఖం మీద రంగులు అద్దకుండా ఉంటేనే మంచిది. ఒక్కోసారి పిచికారీతో రంగులు స్పీడ్‌గా చిమ్ముతూ ఉంటారు. కంటికి తగిలితే దానివలన కూడా ప్రమాదం. అందువలన హోళీ రంగులతో చాలా జాగ్రత్తగా ఉండటం మంచిది.

టపాకాయలు, చిచ్చుబుడ్లు :

దీపావళి పండుగనాడు వాడే టపాకాయలు, చిచ్చుబుడ్లు మిగతా ఫైర్‌వర్క్స్ వలన అనేక ప్రమాదాలు కంటికి సంభవిస్తూ ఉంటాయి. ముఖ్యంగా టపాసులను పేల్చడం వలన అందులోని కెమికల్స్ కంట్లో పడి కార్నియా దెబ్బతింటుంది. అలాగే తీవ్రమైతే కన్నుకూడా పగిలిపోయే ప్రమాదముంది. చిచ్చుబుడ్లు దగ్గరి నుండి పేలితే ఆ మందులు కంటిలో పడి చాలా ప్రమాదాన్ని కలిగిస్తాయి. ఈ విధంగా జరిగితే వెంటనే నేత్రవైద్య నిపుణుని దగ్గరకు తీసుకు వచ్చి ట్రీట్‌మెంట్ కూడా ఇవ్వవలసి ఉంటుంది. అధికంగా వెలుగు చూడటం వలన కూడా కంటిచూపుకు ప్రమాదం. అందువలన దీపావళి పండుగరోజు చాలా జాగ్రత్తగా ఉండి కంటిని, కంటిచూపును కాపాడుకోవాలి.

సంవత్సరాల తరబడి కళ్ళజోడు మార్చకుండా ఉండటం :

చాలా మందికి అపోహ ఏమిటంటే ఒకసారి కళ్ళజోడు వేస్తే జీవితాంతం మార్చవలసిన అవసరం లేదనుకుంటారు. ఇది సరైన అభిప్రాయం కాదు. పెరిగే వయసులోను, 40 సంవత్సరాల తరువాత కంటి నెంబర్‌లో చాలామార్పు వస్తూ ఉంటుంది. అందువలన ఒక్కోసారి ఎక్కువ పవరు, ఒక్కోసారి తక్కువ పవరు, ఒక్కోసారి కళ్ళజోడు కూడా వాడవలసిన అవసరం లేకపోవచ్చు. అందువలన కనీసం ఆరు నెలల నుండి సంవత్సరానికి ఒకసారి కంటిపరీక్ష చేయించటం మంచిది. ☆



నా వయస్సు 44 సం॥లు. పదేళ్ళ క్రితం నాకు థైరాయిడ్ సమస్య తలెత్తింది. అప్పటి నుండి ఎల్‌ట్రాక్సిన్ టాబ్లెట్లు వాడుతున్నాను. అప్పట్లోనే బి.పి. కూడా వచ్చింది. మందులు వాడితే తగ్గింది. మరలా ఈ మధ్య బి.పి. వచ్చింది. అసలు థైరాయిడ్ గ్రంథికి, బి.పి.కి ఏమైనా సంబంధం ఉందా?

- ఎస్.వెంకాయమ్మ, సంతగుడిపాడు

థైరాయిడ్ గ్రంథికీ బిపికి సంబంధంలేదు. థైరాక్సిను అనే హార్మోను ఉత్పత్తి తగ్గినందు వలన మీకు ఎల్‌ట్రాక్సిన్ టాబ్లెట్లను డాక్టరు సూచించి ఉండవచ్చు. బిపీకి వేరేగా మందులు వాడాలి. ఈ రెండు వ్యాధులకూ దీర్ఘకాలం పాటు మందులు వాడాల్సి ఉంటుంది. ఫిజీషియన్‌ను మీరు సంప్రదిస్తూ ఉండాలి.

నా వయస్సు 22 సం॥లు. నా మర్మాంగాల చుట్టూ దురద ఎక్కువగా వుంటోంది. నాకు ఎలాంటి సెక్సువల్ సంబంధాలు లేవు. నిద్దర్లో ఎక్కువగా రుద్ది పుండు అయిపోయింది. పరిష్కారం చూపండి.

- ఎస్.హారున్, పాకాల

మీ దురదకు గజ్జి, తామర కారణమయి ఉండొచ్చు. చూపి నిర్ధారించాలి. చర్మ వ్యాధుల వైద్యునికి చూపించి మందులు వాడితే సులభంగా తగ్గిపోతుంది.

నాకు 1997 సెప్టెంబర్‌లో యూరిన్ బ్లాక్ అయ్యింది. మందులు వాడాను. మళ్ళీ 2001 జూన్ 10న యూరిన్ స్టక్ అయ్యింది. డాక్టర్‌ను సంప్రదిస్తే కిడ్నీలో 33 గ్రా॥ కంతి ఉందన్నారు. ఆపరేషన్‌కు 8,500 ఖర్చు అవుతుందన్నారు. డబ్బులేదంటే యాంటిబయాటిక్స్ మందులు మూడువేలవి రాశారు. అవి వాడుతున్నాను. ఇప్పుడు మూత్రం వస్తోంది. అయితే దీనికి శాశ్వత పరిష్కారం ఏమిటి?

- వై.మార్కెండేయరావు, కొవ్వూరు

కిడ్నీలో కణితి ఉండే శస్త్రచికిత్సతప్ప మరో మార్గం లేదు. హైదరాబాదు ఉస్మానియా ఆసుపత్రిలోగానీ, పుట్టపర్తి సత్యసాయి సూపర్ స్పెషాలిటీలోగానీ సంప్రదిస్తే ఉచితంగా శస్త్రచికిత్స చేసే అవకాశం ఉంది.

- డా॥ కొల్లా నాగేశ్వరరావు,
ఎం.ఎస్. డి.ఎన్.బి.


అమెరికాలో నేను క్షేమంగానే వున్నా.. నా అప్పు ఎప్పుడు..
తీరుస్తావని ఉల్ఫైన్ సన్ ఫోను చేసాడుట..
అప్పటినుండి ఇదే వరస పాపం!!
GANGA DHAR

పాక్
ఇండియా
GANGA DHAR


దీన్ని మొఖానికి తగిలించుకొని నాలాగ..
ఆదర్శంగా పని చేయి బ్రదర్!!
సర్పంచ్
GANGA DHAR

ప్రోగ్రెస్ రిపోర్ట్

మానవత్వానికి పట్టం కట్టినవాడా!
జనం మాటలజెండా పట్టినవాడా!
మహాకవీ! గురజాడా!
వీళ్ల అజ్ఞానానికీ, ఆటవిక తత్వానికీ
అక్షరాయుధాలతో
శస్త్రచికిత్స చెయ్యాలనుకున్నావు
మనసున్న మనుషులుగా మార్చాలనుకున్నావు
భూతవైద్యాలకూ, నాటు పద్ధతులకూ
అలవాటు పడ్డవాళ్లు కదా -
అసలు నువ్వు వైద్యుడివే కాదన్నారు
నీ అవసరమే లేదన్నారు
వీళ్లు కళ్లను వీపుమీద అతికించుకున్నారు
మెదళ్లను మోకాళ్ల కిందకు దిగజార్చుకున్నారు
సిగ్గువిడిచి చెబుతున్నాను - మహాకవీ!
వీళ్ల రోగాలు ఇంకా తగ్గలేదు
వింతగా వికటించి వెర్రి తలలు వేస్తున్నాయి
శతాబ్దాల సహజీవనానికి సమాధి కట్టేశారు
మానవత్వానికి మసిపూసి
పాతరాతియుగం చెట్టుతొర్రలో దాచేశారు
ఆచరణకూ, అవగాహనకూ మధ్యలో
ఆమడదూరం ఉండేలా జాగ్రత్త పడుతున్నారు
ఇంతులను ఇతోధికంగా గౌరవిస్తున్నారు
పూటకూళ్లమ్మకూ, మీనాక్షికీ
అభిమానసంఘాలు ఏర్పాటు చేశారు
"అన్నీ వేదాల్లోనే ఉన్నాయిష!"అంటూ
చరిత్రను చక్కదిద్దుతున్నారు
జ్యోతిష్యాన్ని పాఠ్యాంశం చేసి
జాతిని జోకొడుతున్నారు
ప్రశ్నించే ప్రమాదాలనుంచి పక్కకు తప్పిస్తున్నారు.
నువ్వు ఎగరేసిన దేశభక్తి కపోతాలు
ఎటుపోయాయో తెలీక
ఇంకా వెదుకుతూనే ఉన్నారు
స్విస్‌బేంకు ఖాతాలతోనూ
అవినీతి కుంభకోణాలతోనూ
దేశాన్ని ప్రేమిస్తూనే ఉన్నారు
సొంతలాభాన్ని కొంతమాత్రమే మానుకుని
పంజాబులోనూ, కాశ్మీరంలోనూ
పొరుగువాడికి తోడ్పడుతున్నారు
వట్టిమాటలు కట్టిపెట్టి
గట్టి బాంబులతో చంపుకుంటున్నారు
మహాకవీ!
ఎక్కడో ఏదో పొరపాటు జరిగింది
నిన్ను నోటితోనే చదివారు -
మనసుతో అధ్యయనం చెయ్యలేదు
ఛాందసం మెదడుతో తూచాలనుకున్నారు
స్పందించే హృదయంతో పరిశీలన చెయ్యలేదు
అందుకే - సిగ్గువిడిచి చెబుతున్నాను -
వీళ్ల రోగాలు ఇంకా తగ్గలేదు!
భావాలు ఇంకా మారలేదు!!

- అదృష్ట దీపక్

నడుస్తున్న చరిత్ర

ఒకదేశ రక్షణ రహస్యం
అవినీతి అంచుకు చేరిపోయింది
ఒక అమాయక హృదయం
ఆర్తనాదాల నడుమ
ఆహుతైపోయింది
ఒక చిరుదరహాస చంద్రిక
ముద్రారూపంలో అణచి
వేయబడింది
ఒక కమనీయ రూపలావణ్యరేఖ
వక్రరేఖగా మారిపోయింది.
ఒక మండే గుండె
క్షణంలో సమిధగా మిగిలిపోయింది
ఒక బడుగు జీవి
భూస్వామి కబంధ హస్తాల్లో
నలిగిపోయాడు
ఒక నవయవ్వన సుందరాంగి
కామాంధుని కౌగిట్లో శీలం
కోల్పోయింది

* * *

ఈ కాలం ఆగిపోకుండా
నిశ్శబ్దగీతాలను తనలో
కలుపుకుంటూనే ఉంది

- చిల్లర సాంబశివరావు

మీరు 'మా మంచి నాన్నేనా?'

జి.విజయలక్ష్మి

శ్వేత, రాము గంట నుంచి వాళ్ళ డాడీ కోసం ఎదురు చూస్తున్నారు.

ఈ రోజు వాళ్ళను బైటికి తీసికెళ్తానని ఆయన మాటిచ్చారు. అందుకే స్కూలు నుంచి రాగానే చకచకా హోమ్‌వర్క్ పూర్తి చేసుకొని స్నానం చేసి రెడీ అయిపోయారు. ఆరు గంటలు దాటిపోతోంది. డాడీ రాకపోవడంతో వాళ్ళలో నిరాశ వచ్చేసింది.

"ఈ రోజు డాడీకి ఆఫీసులో వర్క్ అవలేదనుకుంటా. రేపు తీసుకెళ్తారులే" వాళ్ళని బుజ్జగిస్తూ అంది మమ్మీ.

ఆ మాటలు వింటూనే ఏడుపు మోహం పెట్టారు. త్వరగా వచ్చి షికారు తీసుకెళ్తానన్న డాడీ మాట నిలబెట్టుకోనందుకు మౌనవ్రతం పూనారు.

ఏడుగంటలు దాటాక వచ్చిన డాడీ వాళ్ళను శాంతింప చేసేందుకు నానా ప్రయత్నాలు చేయాల్సి వచ్చింది. మర్నాడు త్వరగా వచ్చి పార్క్‌కు తీసుకెళ్తానని ప్రామిస్ చేశాడు. ఆఫీసులో బిజీగా వున్నందున రాలేకపోయానని రేపు పెందళాడే వస్తానని వాళ్ళకి నచ్చచెప్పేప్పటికి తాతలు దిగివచ్చారు. కథలు, కబుర్లు చెప్పి వాళ్ళను బుజ్జగించాడు.

★ ★ ★

రెండు దశాబ్దాల క్రితం ఈ పరిస్థితి లేదు. తండ్రి అంటే సంపాదించి పోషించే వ్యక్తి మాత్రమే. ఆయన ఎదురుగా నిలబడి మాట్లాడాలంటేనే భయపడే వాళ్ళు. పిల్లలు ఏది కావాలన్నా తల్లి ద్వారా చేయించుకోవాల్సిందే.



నేడు ఆ పరిస్థితి కొద్దిగా మారింది. ఇప్పుడు కొందరు తండ్రులు పిల్లలకి చక్కటి నేస్తాలు. నాటి తండ్రులకు పోలిక లేనంతగా తండ్రుల ఆలోచనలు మారిపోతున్నాయి. ఇది ఆహ్వానించదగ్గ పరిణామం. ఒకప్పుడు పిల్లల పెంపకం పూర్తిగా తల్లి బాధ్యతే. పిల్లలను ప్రేమగా దగ్గరకు తీసి కబుర్లు చెప్పే తండ్రులను వేళ్ళమీద లెక్కించవచ్చు.

మారుతున్న కాలంలో పరిమిత కుటుంబాలలో తండ్రులతో సన్నిహితంగా మెలిగే అవకాశం, అవసరం ఏర్పడింది. ఇద్దరూ ఉద్యోగస్తులైతే తల్లి పిల్లలతో గడిపే సమయం తగ్గిపోతున్నది. పగలంతా ఆఫీసు. ఇంట్లో వున్నసమయంలో కుటుంబ అవసరాలు తీర్చడంతోనే ఆమె సమయమంతా గడిచిపోతోంది. ఫలితంగా పిల్లలు తండ్రులకు చేరిక అవుతున్నారు.

భార్య పని భారాన్ని అర్థం చేసుకొనే కొందరు భర్తలు మాత్రం పిల్లల బాధ్యతలను స్వీకరిస్తున్నారు. వాళ్ళను స్కూలుకు తయారు చేయడం, హోంవర్క్ చేయించడం, తినిపించడం లాంటి పనులు చేస్తూ పిల్లల పట్ల గతంలో కంటే ఎక్కువగానే శ్రద్ధ చూపిస్తున్నారు. దాంతో పిల్లలు కూడా పాతకాలంలో వలే తండ్రులంటే భయపడటం, దూరంగా ఉండటం కాక సన్నిహితంగా మెలుగుతున్నారు. దీనివల్ల వారు పెద్ద వారైన తర్వాత కూడా అదే రకమైన స్నేహం, ప్రేమ చూపించగలుగుతున్నారు.

తండ్రితో ఎక్కువ కాలం గడిపే పిల్లలలో మెదడు చురుకుగా పని చేస్తుందని, దాంతో వారు చదువులో ముందుండటమే గాక రోజంతా ఉత్సాహంగా వుంటున్నారని ఈ మధ్య జరిగిన సర్వేలలో ప్రకటించారు. తండ్రితో సాన్నిహిత్యం లేని పిల్లలు ఏ పని చేస్తే డాడీ ఏమంటారో? కొడతారేమో అనే భయంతో మెలుగుతూ వుంటారు. భయం వల్ల మెదడు కణాలలో చురుకుతనం తగ్గిపోతుందని, మందకొడిగా పిల్లలు తయారవుతారని సర్వేలు చెబుతున్నాయి. పిల్లల పట్ల తండ్రులు ప్రేమగా, స్నేహంగా వుంటే భావోద్వేగాల విషయంలో చాలా సమతూకంగా ఎదుగుతారనేది పిల్లల మానసిక నిపుణుల అభిప్రాయం. ఒకవేళ తండ్రి ప్రవర్తన సరిగా లేకుంటే దాని పరిణామాలు తీవ్రంగా వుంటాయి. అంటే అభద్రతా భావం, నరాల బలహీనత, మానసిక చికాకులు, ఎక్కువ ఎమోషనల్‌గా తయారవటంలాంటి రుగ్మతలు పిల్లల్లో తలెత్తే అవకాశం వుందని వారు అంటున్నారు. ఒక్కొక్కసారి పిల్లలు అసాంఘిక శక్తులుగా మారే ప్రమాదం కూడా ఉందని హెచ్చరిస్తున్నారు. కాబట్టి పిల్లల పట్ల తల్లిదండ్రులు బాధ్యతగా మెలగటం చాలా అవసరం. ఈ స్పృహ ఈ తరం తల్లిదండ్రులు కొందరిలో అధికంగానే వుండి వారిని పిల్లలకు దగ్గర చేస్తోంది. అయితే గ్రామాలలో ఇంకా మార్పు రావాల్సి వుంది.

అక్కడ ఇంకా పాత తల్లిదండ్రుల రాజ్యమే కనిపిస్తుంటుంది. తరతరాలుగా వస్తున్న పురుషాధిక్యత వారినింకా వీడడం లేదు. ఇంటి పనులు, పిల్లల బాధ్యతలు ఆడవారి పనులనే చులకన భావంలోనే ఇంకా వారున్నారు. ఖాళీగా వున్న సమయాలలో కూడా సహచరికి సహకరించడం, పిల్లల పనులు చేయడం నామోషీగా, చిన్నతనంగా భావిస్తున్నారు.

ఇటువంటి వారు మారవలసిన అవసరం చాలా వుంది. పిల్లల్ని కనగానే సరిపోదు. వారిని పెంచి విద్యాబుద్ధులు చెప్పించి, జీవితాలలో స్థిరపడేట్లు చేసినపుడే తల్లిదండ్రుల బాధ్యత తీరుతుంది. అప్పటివరకు పిల్లల విషయంలో అప్రమత్తంగానే వుండాలి. ఈ విషయంలో జండర్ వివక్ష వుండరాదు. పిల్లల పెంపకంలో మెళకువలు తెలియచేసేందుకు మన దేశంలో శిక్షణాలయాలు లేవుగానీ విదేశాలలో ఇందుకు సంబంధించిన ప్రత్యేకమైన కృషి జరుగుతోంది.

చైనా, యింకా కొన్ని దేశాలలో బాలల మనస్తత్వం గురించి విస్తృతంగా పరిశోధనలు జరుగుతున్నాయి. అందుకు సంబంధించిన సాహిత్యమూ, పత్రికలు తల్లిదండ్రులకు ఎంతో ఉపయోగకరంగా వుంటున్నాయి. పాశ్చాత్య దేశాలలో కేవలం పురుషులకు మాత్రమే శిక్షణనిచ్చే విద్యాలయాలు వెలుస్తు న్నాయి. మారని పుస్తకాలు చదివి, యితరుల అనుభవాల నుంచి తెలుసుకొని శిశుపోషణ విషయంలో శ్రద్ధ చూపుతున్నారు. ఈ మార్పు మన దేశంలో కూడా రావాల్సి వుంది.

మన దేశ నాయకులలో జవహర్‌లాల్ నెహ్రూ స్వతంత్ర భారత ప్రథమ ప్రధానిగా ఎంతమంచి పేరు తెచ్చుకున్నారో అంత మంచి తండ్రిగా కూడా తన పేరును సుస్థిరం చేసుకొన్నారు. బాలలకు ఆయన 'చాచానెహ్రూ' అయ్యారు. ఆయన తన ఏకైక కుమార్తె ఇందిరను తనతో పాటు అనేక ప్రదేశాలు తిప్పి, జైలు నుంచి అనేక ఉత్తరాలు రాసి భావిభారత ప్రధానిగా తీర్చిదిద్దిన విషయం తెలిసిందే.

అభ్యుదయ సాహిత్యం, ప్రగతిశీల భావాలతో ఉత్తేజితులైన తండ్రులు పిల్లల పెంపకంలో బాధ్యత వహిస్తున్నారు. కొందరు సనాతన వాదులు నవ్వుకున్నా 'నూతన తండ్రులను' పొందే అవకాశం ఈ తరం పిల్లల్లో కొందరికైనా కలిగింది. అయితే అత్యధికులు మాత్రం భార్య ఉద్యోగం చేస్తున్నా తమ పురుషాహంకారాన్ని వదులుకోలేకపోతున్నారు.

ఏ కారణం వల్లనైతేనేమి ఇలా తండ్రులు తమ పిల్లల పట్ల స్నేహంగా మెలగడం, వారి పెంపకంలో బాధ్యతాయుతమైన పాత్ర పోషించడం పిల్లల వికాసానికి చక్కటి బాటలు వేస్తుందంటున్నారు పలువురు మానసిక వైద్య నిపుణులు. ☆

సోమరితనం

కొమరోలు గ్రామంలో కృష్ణానందం అనే రైతు ఉండేవాడు. అతని ఒక్కగానొక్క కొడుకు జీవానందం. కొడుకును తనలాగే వ్యవసాయంలోకి దింపాడు కృష్ణానందం. తను చెప్పింది చెప్పినట్లు చేస్తూ ఎంతో త్వరగా వ్యవసాయంలో మంచి దిగుబడులు సాధించిన కొడుకుని చూసి ఆయన గర్వించాడు. తండ్రీకొడుకుల చేతిలో ఆ పక్క గ్రామాల్లోనే అందరికంటే ఎక్కువ పంట పండేది.

పంటలు బాగా పండటంతో గ్రామస్థులంతా కలిసి ఆ సంవత్సరం సంక్రాంతి పండుగకు వైభవంగా తిరునాళ్ళ జరిపారు. అంతేగాక ఖర్చులు పోను మిగతా ఉమ్మడి డబ్బుతో ఒక డిష్ యాంటెన్నా కొనుక్కువచ్చారు. టీవీలు ఉన్న అందరికీ వెంటనే కనెక్షన్లు ఇచ్చారు. లేని వారు కొనే ప్రయత్నాలు మొదలుపెట్టారు. టీవీల్లో వస్తున్న సినిమాలు, ఆటలు పాటలను చూసి ఎంతో పరవశం చెందారు. సంబరాలకన్నా టీవీలో కార్యక్రమాలే వారిలో అమితోత్సాహాన్ని నింపాయి.

అలా కొద్ది రోజులు గడిచాయి. కంటికి ఇంపుగా రోజుకు కావాల్సినన్ని సినిమాలు చూస్తూ వ్యవసాయ పనులకు డుమ్మా కొట్టసాగాడు జీవానందం. దాదాపు అటువైపు వెళ్ళడమే మానేసాడు. కొడుకులో సోమరితనం పెరిగి పోవడమే తప్ప పూర్వంలా కష్టించాలన్న ఆలోచన లేకపోవడం కృష్ణానందాన్ని కృంగదీసింది. తీవ్రంగా ఆలోచించి ఓ నిర్ణయానికి వచ్చాడు.

ఒకరోజు జీవానందం పొలానికి వెళ్ళాడు. ఉన్న నాలుగు ఎద్దుల్లో రెండింటిని గట్టుమీద ఉంచి మిగతా రెండింటితో తండ్రి అరక దున్నుతున్నాడు. కొడుకుని చూసి...

'అరేయ్...నేను కాసేపు కూచుంటాను. మిగిలిన ఎడ్లను అరకకు కట్టి దున్ను, ఇవి బాగా అలిసిపోయాయి' అన్నాడు కృష్ణానందం.

తండ్రి చెప్పిన ప్రకారం మిగతా ఎడ్లతో అరక కట్టాడు జీవానందం. దున్నడం మొదలు పెట్టాడో లేదో ఒక ఎద్దు మహాబద్ధకంగా కూర్చుండి పోయింది. బలవంతాన దాన్ని లేపి రెండడుగులు వేయించాడో లేదో రెండోది కూడా కూలబడింది. ఆ విధంగా ఒక చాలు దున్నటానికి అరగంట పట్టింది. వాటి ప్రవర్తనలో వచ్చిన మార్పు గురించి తండ్రిని అడిగాడు జీవానందం.

'ఆ రెండూ నీతో పాటు ఇన్ని రోజులూ పొలానికి రాలేదు. పాకలో తిని పడుకున్నాయి. దాంతో పని మీద శ్రద్ధ తగ్గి నిద్ర మీద మనసు మళ్ళింది. మళ్ళీ పనిలోకి దింపాంగా..నిదానంగా దార్లోకి వస్తాయిలే..' చెప్పాడు కృష్ణానందం.

తనలో మార్పు తెచ్చేందుకే తండ్రి ఆ విధంగా ప్రవర్తించాడని గ్రహించిన జీవానందం మునుపటిలాగే కష్టపడి వ్యవసాయంలో పురోగతి సాధించాడు.

-శాఖమూరి శ్రీనివాస్

కథలు పంపండి

నేస్తాలూ,

మీరు ఏమైనా కథలు రాస్తే వాటిని ఈ శీర్షికకు పంపండి. బాగున్న వాటిని వీలు వెంబడి ప్రచురిస్తాం. మీరు పంపే కథలు విజ్ఞానం అందించేవి గాను, మంచి విషయాలు బోధించేవి గాను ఉండాలి. ఇప్పటికే వచ్చిన కథలు కాకుండా మీరు సొంతంగా రాసిన కథలు పంపండి. మీ పాఠశాల ప్రధానోపాధ్యాయులకు చూపించి వారి సంతకంతో పంపితే ప్రచురిస్తాం.



చేయండి ఇలా !



బాలలూ, చేతులతో రకరకాల ఆకృతులను చూపించడం మీకు తెలిసే ఉంటుంది. ఈ వారం మనం చేతులతో కుందేలు బొమ్మను ఎలా చూపించవచ్చో తెలుసుకుందాం. దీనికి మీకు కావాల్సిందల్లా ఒక బల్బు లేదా కొవ్వొత్తి, మీ చేతులు, తెల్లటి గోడ మాత్రమే. పటంలో చూపినట్లుగా మీరు మీ చేతివేళ్లను సరైన దిశలో ఉంచితే మీకు ఖచ్చితంగా కుందేలు ఆకారం కనిపిస్తుంది. వెంటనే ప్రయత్నించండి మరి..

కలంస్నేహం

పేరు : ఎం.డి. రజాక్
వయస్సు : 13
చదువు : 8వ తరగతి
హాబీలు : క్రికెట్, చెస్ ఆడటం
పూర్తి చిరునామా : సన్నాఫ్ ఖాజామియా, రాజ్‌పేట (గ్రామం), కొడిపల్లి (మండలం), మెదక్ (జిల్లా)-502316

పేరు : కుపిరెడ్డి నాగభూషణరావు
వయస్సు : 15
చదువు : 10వ తరగతి
హాబీలు : క్యారమ్స్, క్రికెట్ ఆడటం, చదవడం
పూర్తి చిరునామా : సన్నాఫ్ సత్యం, గ్రా : జక్కువ, మం : మెంటాడ, జి : విజయనగరం

పేరు : వేముల జ్యోతిబాబు
వయస్సు : 13
చదువు : 8వ తరగతి
హాబీలు : క్యారమ్స్ ఆడటం, జి.కె.బుక్స్ చదవడం
పూర్తి చిరునామా : సన్నాఫ్ మహేందర్, గ్రా : వలిగొండ, మం : వలిగొండ, జి : నల్లగొండ-508112

చిన్నారి చిత్రకారులు



టి. సంఘమిత్ర, 4వతరగతి
ఎస్ఎఫ్ఎస్ స్కూల్ ఖమ్మం

షేక్ వలి, ఎ.పి.లింగోటం
నార్కట్‌పల్లి (మం), నల్గొండ (జి)



కెఎండి గౌస్, 9వ తరగతి
గవర్నమెంట్ హైస్కూల్, పత్తికొండ, కర్నూలు జిల్లా

ఎం. శివ, 6వతరగతి
ఎంపియుపి స్కూల్, జె.శాసనాం
కంచిలి (మం) శ్రీకాకుళం జిల్లా

అభిప్రాయం తెలపండి

బాలలూ, మీరు పంపుతున్న పలు బొమ్మలు, ఇతర రచనలు అందుతున్నాయి. వాటిని ప్రాధాన్యతాక్రమంలో ప్రచురిస్తాం..అయితే బాలల పేజీల్లో మీకు ఏవి నచ్చుతున్నాయో, ఏవి నచ్చడం లేదో లెటర్ ద్వారా తెలియచేయండి. మీ అభిప్రాయాలను వీలునుబట్టి ప్రచురిస్తాం. ఇంకా బాలనేస్తాల పేజీలో ఏఏ అంశాలో ఇవ్వాలనుకుంటున్నారో సూచించండి. చిన్నారి చిత్రకారులకు బొమ్మలు పంపేవారు రంగులు వేయవద్దు. అలాగే కలంస్నేహం శీర్షికకు తమ అడ్రస్ పంపేవారు ఫోటో కూడా పంపాలి.

-ఎడిటర్

'విలువైన పలుకులు'

ఏదైనా సాధించాలనుకున్నప్పుడు శ్రమించే భావం ఉండాలి. విమర్శలనెదుర్కొనే సహనం ఉండాలి-బెట్ డేవిస్

ఇచ్చింది మరిచిపోవడం, పుచ్చుకొన్నది గుర్తుంచుకోవడమే స్నేహం-మహాత్మాగాంధీ

వ్యక్తి గుణములన్నింటికీ వినయమే శోభనిస్తుంది-నెహ్రూ

కష్టం లేకుండా విజయం ఉండదు-సోఫోక్లెస్

కోపాన్ని నిగ్రహించుకునేందుకు మార్గం జాప్యం చేయడం-సనేకచీ

-సేకరణ

ఎస్.ఎం.డి. షరీఫ్.

చుక్కలు కలపండి





అడ్డం

1. ఒక దిక్కు (2)
2. యంగ్ జనరేషన్ (4)
4. అటు నుండి దర్పణం (2)
8. తుదకు (4)
10. రౌడీ,...(2)
12. పీక..చివర్లో కొంచెం సాగిందంతే (2)
13. ఇప్పుడు కనుమరుగవుతోన్న ప్రాచీన కళారూపం (6)
16. పిట్ట (3)
20. దీంతో బొమ్మలు కూడా తయారు చేస్తారు (2)
21. హిందీలో వెళ్ళను (2)
22. కలల ప్రపంచం (4)
24. బలపం 3, 2, 1 (3)
26. వెండి (3)
27. ఈ రంగంలో బిలిగేట్స్ రారాజు (4)

నిలువు

1. తడబడ్డ ఆచితూచి (4)
3. అడవి (2)
5. ఇటీవల ఉగ్రవాదులు దాడి చేసింది ఈ దేశంపైనే (4)
6. అన్నంలో కలుపుకునేది (2)
7. పాతతరం హాస్యనటుడు (2)
9. వెంట్రుకలు (3)
11. కొమ్మ (2)
13. వాలం (2)
14. సింధూరం (2)
15. కింది నుండి గేమ్ (2)
16. ఈ దొర చెప్పేవన్నీ అబద్ధాలే (5)
19. 'వివాహ భోజనంబు' పాట ఈ సినిమాలోదే (5)
20. మత్తు (2)
21. కగకల ... (2)
22. తనకు తానే చెప్పుకుంటే ఇది అవుతుంది (3)
23. గడియారంలో ఊగేది (3)
25. మంటలు...ఏకవచనం (2)

గత వారం జవాబులు

మాటలకోట-25

అడ్డం : 1. దజను 3. ఆముదం 6. దురాశ 7. రంభ 9. చిగురు 10. గయారాం 11. స్నేహం 13. గోరింట 15. సగ్గు 18. మాసం 19. విరామం 20. సపోట 23. తంబుర 25. వంద 27. సిరి 29. మామిడి 32. నడుమ 33. కుశలం

నిలువు : 2. నుదురు 3. ఆశ 4. దండయాత్ర 5. వైరం 8. ఖడ్గసృష్టి 9. చికాగో 12. హంస 14. టమాట 17. హేమంతం 21. పోకిరి 22. చందమామ 24. రవ్వ 27. సిగ్గు 30. డికు 31. తైలం

ఒకే విధంగా ఉన్న రెండు ?

1, 3

ఎలా సాధ్యం ?

రాధ నక్షత్రం ఆకారంలో తన తోటలు మొక్కలు నాటింది. అందుకే అవి అలా వరుసలో వస్తాయి.



ప్రైవేటు పేదల నిర్మూలన పథకం

రుక్మిణి

ఆ గ్రామంలో ప్రజలకు ఏమీలేకున్నా గ్రామ పంచాయతీ చావిడిలోని రాగిచెట్టు చప్టా మీద ఒక టి.వి. సెట్టు మాత్రం ప్రభుత్వం వారు అమర్చారు. 'సమాచార విప్లవం' ఏరులై పారుతూ ఒక 'పాయ' ఆ గ్రామాన్నెపుడో నిలువునా ముంచి పారేస్తుంది. ప్రజలు ఒంటిమీద తొడుక్కోవడానికి చొక్కాలు గట్రా లేకపోవడం వల్ల.... బహిరంగంగా వెళ్ళుకువచ్చిన వారు తమ బొమికెల్ని.. వేలాడే కండరాలనూ చూసుకుని మురిసిపోతున్నారు. మొలగుడ్డలకు మాత్రం ప్రస్తుతం ఢోకాలేదు - అయితే ఈ సంవత్సరం వర్షపాతం లేకపోవడం వల్లా.... ప్రభుత్వం వారి నిర్వాకం వల్లా వాళ్ళందరూ ఆకలికి మలమలలాడడం అలవాటు చేసుకున్నారు కాబట్టి సహజంగానే వాండ్ల డొక్కలన్నీ బాగా లోతుకు మాత్రం పీక్కుపోయి వున్నాయి. ఆహార అన్వేషణలో కొందరు వింతవింత పద్ధతులు అవలంబిస్తున్నా... ఇదంతా పీకులాట ఎందుకని చల్లగా 'హరీ'మని మరి కొందరు బక్కెట్ తన్ని నిక్కినీలుగుతున్నారు కూడా! వాటినే 'ఆకలి చావులని' కొందరూ 'రోగాల మహాత్మ్యం' అని మరికొందరూ... "కాలంచెల్లిందని" చప్పరించేవారు కొందరూ వాదులాటలకు దిగిపోతున్నారు.

"ఇంగమనకేం భయంలేదు.. సెంట్రలు గవర్మెంటోడు 'పనికి ఆహార పథకం' ప్రవేశ పెట్టిండు - ఇంగ తిండి వరకు ఢోకా లేదురా!" మల్లేశు టి.వి. మాట నొక్కుతూ ప్రకటించాడు. చుట్టూ చేరిన జనం ఆనందంతో నోర్లు బార్లా తెరిచి డొక్కలెగరేశారు.

"కేంద్ర ప్రభుత్వం 12 లక్షల టన్నుల బియ్యం విడుదల చేసింది - పని చేసిన వాడికల్లా అయిదు కిలోల బియ్యం... మరో 30 రూపాయలంటజేస్తారు..." అదింకా పూర్తిగాక ముందే 'అలగాజనం' ఆనందంగా చిందులు తొక్కారు. "దీనిగాను మరో రెండువేలా రెండువందల ముప్పయ్యయిదు కోట్లు విడుదల చేయాలనీ...

"గదిరా దెబ్బంటే... మన కరువు సంగతి... ఆకలి కేకలు ఢిల్లీదనక చేరినయన్న మాట!" ముసిలోడు చప్పిడిదవడలు నవులుతూ కులాసాగా అన్నాడు. అప్పటికే ఎప్పటిలాగే కరకర ఎండ నడినెత్తి మీదికి వచ్చేసింది. అది అక్కడి వాళ్ళకు బాగా అలవాటే! చాలా మంది ఊర్లోని జనం పనులు దొరక్క ఇతర జిల్లాలకు... రాష్ట్రాలకూ "పాలో" మని వెళ్ళిపోయిరి! కొంతమంది 'టపా' కట్టేసినారు గూడా... కొద్దిపాటి నీళ్ళతో సెనగా... కందీ... మినుం వేస్తే అవట్లా నిక్కి చూస్తున్నాయి!

"పనంటే? ఏం 'పని' చెయ్యాల్నో ఎవడు చెప్పాలె? మనం ఏం 'పని' చెయ్యాల్నట? రాళ్ళు మొయ్యటం నా చాతకాదు - యగసాయం పనులు చెయ్యాల్నంటే ఎవడి పొలంలో చెయ్యాలె! ఎవరు చేయనిస్తరు?" జక్కులోడి భార్య పోరడి చింపిరి తల చిక్కులు తీస్తూ మిక్కుటంగా పండిపోయిన పేన్లని ఏరి వేస్తూ బహు విచారంగా అంది.

అదిగో - అపుడు పక్క టవున్లో నుండి యాద్గిరి ఆగమేఘాలమీద అంగలార్చుకుంటూ... పెద్ద పెద్ద పంగలేసుకుంటూ, ఉరుక్కుంటూ ఆయాసపడుతూ వచ్చాడు!

"ఒరే.. మన మండలాలన్నిటికీ ప్రైవేటుగా యవసాయ అధికార్లను నియామకాలు చేసి పారేసింద్రు.. వాండ్లు అటు రైతులకూ... మనకూ అమూల్యమైన సలహాలు ఇస్తారు!"

"బియ్యం ఇయ్యరా"! గోచీ చీదరగా పీక్కుంటూ గోపయ్యగాడు అడిగాడు. "అర్రె... ముందుమనం ఏదో ఒక పనయితె చెయ్యాలెగద! అబ్బో స్టేటు గవర్మెంటు యగసాయం మంత్రి మంత్రాంగం చేసే అటు మన రైతులకూ... కూడు దొరకని కూల్నాలి జనాలకూ పనికొచ్చే పథకాలే బ్రమ్మాండంగా తయారు చేసినార్రా పిచ్చోల్లారా! అదో... అల్లల్లల్ల... మన యగసాయం అధికారిగార్ని పట్టుకొచ్చిన... మనం 'పనికి ఆహారం పథకం'పనీ... పైసలు... బియ్యం ఆ మతలబులన్నీ ఆయనగారే చెప్తరు!"

అందరూ ఆనందంగా నోళ్ళు వెళ్ళబెట్టి ఎండలోనే దొంతుగాళ్ళమీద కూచుండిపోయారు. పేద రైతులు వున్న చెవులు రిక్కరించుకుని... నీళ్ళు దొరకని ఎండే పొలాలనూ... పైర్లనూ తలుచుకుని గుటకలేస్తూ... పెట్టిన పిడుగుల్లాంటి పెట్టుబడులను తలుచుకుని గుండెలు గుబగుబ లాడుతుండగా రాతికట్టల మీదెక్కి కూర్చున్నారు.

యవసాయం అధికారి యువకుడే... అయినా చదివీ... చదివీ.. తిరిగీ... తిరిగీ ముసలిబారి పోయినట్లు... రివటలా గిడసబారి పైరుగాలికే పరపర ఎగిరిపోయే లాగున్నాడు గదా! ఎత్తైన రావిచెట్టు అరుగు మీదెక్కి ఆయాసపడుతూ తగులుకున్నాడు.

"పంటలు పండితే కరువుండదు.. అందుకని పంటలు బాగా పండి స్వర్ణాంధ్ర దాటి 'హరితప్రదేశ్'ను సాధించాలంటే మీరంతా మీ ఒళ్ళు దాచుకోకుండా పని జెయ్యాలె!"

అరె! తాము ఒళ్ళు దాచుకోడానికి కనీసం ఒంటినిండా గుడ్డపీలికలు కూడా లేవాయె! అంటే సిగ్గూశరం వదిలేసి మొలగుడ్డ కూడా పీకి పారేసి పనిచెయ్యమంటాడా ఏంది? ఏందో... శెంద్రబాబుగారి ఆలోచనన్ని విచిత్రంగానే మిడుకులాయ!

"పండే పంటలకు ఈ చీడ... పురుగులు... రోగాలు తగులుకుని సర్వనాశనం చేస్తున్నాయి. రైతన్నలు నిండుగా మునిగిపోతున్నారు. అప్పులు పెరిగిపోతున్నాయి - పచ్చదనం హరించుకుపోతున్నది"

"ఓర్నీ... రైతుల అప్పులు పెరిగిపోవడం బాగానే వుందిగానీ... మరి గవర్మెంటు శెంద్రబాబు జేసే అప్పుల సంగతేంది దేవుడా!" మల్లేసు మటమటలాడాడు.

"అందుకనీ మీరు 'హరిత ప్రదేశ్'ను సాధించడానికి చేయాల్సింది... ముందుగా మీరు ప్రతిపొలం... చేలూ... తోటల దగ్గర గుంతలు తవ్వితే మీకు తిండి దొరుకుతుందీ - 'హరితప్రదేశ్'ను సాధిస్తాం.. గుంతలు... గుంతలు..

ఆ ఎండలో అందరి బుర్రలూ గిరగిరా తిరిగిపోయాయి... వానల్లేకపాయె! గుంతలు తవ్వి ఏం జేసుకోను... అందులో దాకునా? కాళ్ళీరగవా? గుంతలెందుకటా యాద్గిరి చికాగ్గానే అడిగాడు.

"అదే... అదే... పెరుగుతున్న పచ్చటి పంటల మీద అతి భయంకరంగా కాండం దొలుచు పురుగులూ.., దుర్మార్గంగా పేనుబంక పురుగులూ.. పెరిగి నాశనం చేస్తున్నాయి. ఇంగ 'వయ్యారిభామల' సంగతీ... ఎర్రగొంగళి పురుగుల విషయం చెప్పనక్కర్లేదు. అందుకని ముసలీ ముతకా కుర్రోళ్ళందరూ.. ప్రజలందరూ కాండం దొలుచు పురుగుల్ని జాగ్రత్తగా 'వలిచి' బట్టుకుని బంధించాలె... ఎర్రగొంగళి పురుగుల్ని ఏరాలె! మరి మన మహిళా మణులైన తెలుగు ఆడపడుచులకు తలపేన్లు ఏరడంలో వుండిన నైపుణ్యం అంతర్జాతీయంగా రికార్డులకెక్కింది. వాండ్లు పేనుబంక పురుగుల్ని కుక్కి ఏరిపారెయ్యాలె! మరి మన తెలుగు యువకులందరూ 'వయ్యారిభామల' పనిపట్టి... అన్నింటినీ మీరు తీసుకున్న... కేటాయించుకున్న చేల గుంతల్లోనే నింపుకోవాలె! కిలోకు - కిలో - కిలోకు కిలో బియ్యం... బస్!"

గొంతు నొప్పెట్టేలా వాడు అరుస్తూనే వున్నాడా... లేని జవసత్వాలు తెచ్చుకు ఆడామగా... ముసలీ ముతకా చేతికందిన పనిముట్లందుకుని 'పొలో'మని పొలాల వెంటా.. చెలకలూ.. తోటల మీదా పడ్డారు. గునపాలందుకుని రొప్పుతూ అందిన చోట.. వీలున్నచోట ఎవరికి వారే గుంతలు లగాయించి తవ్విపారేస్తున్నారు. అంతా గందరగోళం. కంగాళీగా హడావుడిగా వుంది!

మర్నాడు- 'యగసాయం అధికారి' మాటనొక్కి టి.వి.లో ఆదేశాలకై ఎదురు చూపులు చూస్తున్నాడు - అంతవరకూ వెంకయ్యనాయుడుగారూ... చంద్రబాబు గారూ కేంద్ర - రాష్ట్ర పథకాల మీద ఒకరిమీద ఒకరు జబ్బలు చరుచుకుంటూ, విరుచుకు పడుతూ... చెణుకులూ, ఛలోక్తులూ విసుర్తూ కాలక్షేపం చేసుకున్నారు. రెండొందల యాభయ్యో... మూడొందల అరవయ్యో కేంద్ర పథకాలను బాబుగారు తన స్వంత పథకాల క్రింద వాడేసుకుంటున్నారని వెంకునాయుడు పెడబొబ్బలు పెట్టాడు - ఇరవయ్యేకటో ముప్పయిరెండో పథకాలను ముష్టిగా తమ మొహం మీద కేంద్రం విదిలించి చేతులు దులుపుకుందని చెంద్రబాబుగారు అంతే స్థాయిలో ఘూంద్రించి దుయ్యబట్టి తెలియజేసుకున్నారు. ఆ 'సరసం' బహు వినోదంగా కడుపులు మండిపోతున్న వారికి కాసేపు వినోదం మాత్రం కలిగించింది.

పొలాల్లో... చెలకల్లో.. చేలల్లో... తోటల్లో ముసలీ ముతకా.. ఆడామగా 'పొలో'మని పురుగుల భరతం పడుతున్నారు. ఆదరాబాదరాగా గంతులేస్తూ 'వయ్యారి భామల్ని' ఏరి పట్టుకుని ఎవడి గుంతలో వాడు నింపుకుంటున్నాడు. అందరూ బహుకసిగా చీడపురుగుల్ని అట్లా 'ఆదా' చేసుకునే ఆబలో మునిగిపోయినారు.

"గాడెక్కడో కర్నాటకలో గీ పురుగులు పట్టినోళ్లు బంగారు మేడలూ.. వెండిపూత కార్లూ.. రంగుటీవీలతో కులుకుతున్నారట! ఓర్నీ... గీపంటల సొంటల కంటె గీ పురుగు లేరుకునే పద్ధతే లాభంగాదే పుల్లమా!" హుషారుగా రంగడు మిసమిసలన్నీ దరిద్రంతో మసిబారుతున్న పుల్లమ్మకు కన్నుగీటుకూ పల్లెపదం ఓటి అందుకున్నాడు. ఆమె కూడా సిగ్గుతో గునుస్తూ సుతారంగా రెండు పురుగుల్ని కాండం నుండి ఏరుకుంది.

సాయంత్రానికి గుంతల్లో నుండి పురుగుల్ని తట్టల్లోనెత్తుకుని బహు ఆనందంగా చిందులు తొక్కుతూ.. సరసాలాడుకుంటూ వచ్చిపడ్డారు. అప్పటికే గిడ్డంగుల నుండి బియ్యం లారీలు కూడా వచ్చి చేరాయి. పురుగుల - బియ్యం కూపన్లు కిలోల వారీగా లెక్కలు గట్టి తయారైనాయి. ఎవరికి వారే లెక్కలు గట్టుకుని... పురుగుల వంతున తమకు తూకం వేసి అందించిన బియ్యాన్ని మూటలు గట్టుకుని కేరింతలు కొట్టుకుంటూ ఇంటిదారి పట్టారు.

యాద్గిరి చింకిరి మంచం మీద కూలబడి బీడీ పీకుతున్నాడు. వాడి మనసంతా ఆందోళనగా వుక్కిరి బిక్కిరిగా వుంది. తమ 'పురుగుల ఏరివేత - పట్టివేత' కార్యక్రమంలో వున్న - ఎదుగుతున్న ఆ పైర్లన్నింటినీ కసాపిసా తొక్కి నామరూపాల్లేకుండా చేయడంలో రైతన్నలు పరమ భీకరంగా బూతులకు తగులుకుని, చేసేదేమీ లేక కూలబడిపోయారు. యాద్గిరి పెండ్లాం గుడిసెలో నుండి చేటా, రెండు గిన్నెలూ బయటకు విసిరేసింది "ఏందె.. ఏమాయె?" యాద్గిరి చికాగ్గా అడిగాడు. 'గిదేందయ్య... గీ బియ్యం నిండా పురుగులు... అన్నీ తుట్టెలు.. నాలుక్కిలోల బియ్యం జోకిస్తే - ఇప్పటికే కిలోన్నర పురుగుల్ని వాటిలో ఏరినగద! ఇంకా కిలో పురుగులెల్తాయి - పో.. పో.. గీ పురుగుల్ని కూడా పట్టకపొయ్యి వాటికి తగ్గ బియ్యం ఎవద్నడిగి పట్టకొస్తవో పట్టకరా.. మళ్ళా వాటిల్లో పురుగు లేర్తా.. వార్నీ గిట్లా మిడిగుడ్లేసుకుని మిటుకూ.. లటుకూ చూస్తవేంది.... యాద్గిరి నిలువునా కొయ్యబారిపోయాడు!! ☆

కాకుల్లెక్కలు

లక్ష్మి

కరెక్టుగా చెప్పలేని లెక్కల్ని కాకుల లెక్కల్లో సరిపెడ్తుంటారు. కొన్ని సందర్భాల్లో లెక్క కరెక్టుగా చెప్పగలిగినా - చెప్పకూడదనే సిద్ధాంతానికి కట్టుబడి వున్నప్పుడు కూడా కాకుల్లెక్కలే చెబుతుంటారు! అనువైన అంకెల్లో సరిపెట్టకోడాన్ని కాకుల్లెక్కలంటారు. ఫలానా ఊళ్లో ఆకలి చావులు అరవై అని ప్రభుత్వం ప్రకటిస్తుంది. ఇది క్లాస్‌వన్ కాకుల్లెక్క నిజానికి ఆ ఊళ్లో ఆకలి చావులు నూటపాతిక! నిజం చెబితే ప్రజల్లో ఆందోళన పెరుగుతుందన్న భయంతో ప్రభుత్వం వారు అరవై మాత్రమేనని స్టేట్‌మెంటిస్తారు. చావుల సంఖ్య చెప్పేటప్పుడు తగ్గిన సంఖ్య - అభివృద్ధి కార్యక్రమాల్లో మాత్రం బాగా పెరుగుతుంది. ప్రభుత్వం తలపెట్టిన ఫలానా పథకంలో పదహారొందల గ్రామాలు బాగుపడ్డాయంటారు. ఇది కూడా కాకుల్లెక్కే! వాస్తవం పరిశీలిస్తే బాగుపడ్డ గ్రామాలు వందకు మించి వుండవు. ఆ వంద కూడా ప్రభుత్వం ప్రకటించిన పథకం కంటే ఎంతోముందే బాగుపడి ఉంటాయి. సంఖ్య పెంచి చెప్పడం వల్ల ప్రజల్లో తమ పథకం పట్ల ఉత్సాహం పెత్రేగిపోతుందని ప్రభుత్వం వారి ఆశ!

అంచేత మంచికీ చెడుకీ కూడా కాకుల్లెక్కలుంటాయి. మంచికి హెచ్చుస్థాయిలోనూ, చెడుకి స్వల్పస్థాయిలోనూ ఈ కాకుల్లెక్కలు నడుస్తుంటాయి. ఏతావాతా తప్పుడు లెక్కల్ని కాకుల్లెక్కలంటారు. తప్పుడు లెక్కలకు కాకుల్నే ఎందుకు ఎంచుకున్నారో మీక్కూడా తెలిసే వుంటుంది. ఒక గోడమీద పది కాకులు మీటింగు పెట్టుకున్నప్పుడు ఆ గుంపులో ఒక కాకిని రాయిచ్చుకొట్టడతాం. ఆ కాకి గిలగిలా తన్నుకుని నేలమీద పడి పోతుంది. ఇంకా ఆ గోడమీద ఎన్ని కాకులుంటాయని లెక్క అడిగితే తొమ్మిదనే ఆన్సరొస్తుంది. వాస్తవానికి ఆ గోడ మీద ఒక కాకి కూడా వుండదు! రాయి తగిలి ఒక కాకి కింద పడటం చూచిన తొమ్మిది కాకులూ ప్రాణభయంతో మీటింగుకి చుక్కపెట్టి ఎగిరిపోతాయేగాని చోద్యం చూస్తూ అక్కడే కాపురం పెట్టవు. అంచేత కాకుల్లో లెక్కలు తయారు చేసుకుందామంటే కుదిరే పని కాదు. లెక్కపూర్తయిందని సంబర పడుతుండగా - కొత్త కాకులు మరికొన్ని వస్తాయి. వాటిని కూడా లెక్కలోకి తీసుకునే ప్రయత్నం చేస్తుండగా - అన్ని కాకులూ ఎగిరిపోతాయి! కాకులు రావడం పోవడం రూలు ప్రకారం జరగదు గనుక - వాటి లెక్కలు కూడా ఎప్పుడూ కరెక్టుగా వుండవు!

కరణం గారి గుర్రం గంటకి పాతిక మైళ్ళు పరుగెత్తితే - అదే గుర్రం ఆరు గంటల్లో ఎన్ని మైళ్ళు పరుగెత్తును అని లెక్కల మేస్టారు ప్రశ్నించినప్పుడు - నూట ఏభై మైళ్ళు పరుగెత్తును అని చదువు మీద శ్రద్ధ ఎక్కువగా వున్న విద్యార్థి సమాధానం సరిగ్గానే చెబుతాడు. చదువు మినహా మిగతా విషయాల్లో శ్రద్ధెక్కువగా వున్న విద్యార్థి మాత్రం - ఆ ఆన్సరు పరమ తప్పంటాడు. కరణం గారి గుర్రం కుంటిదంటాడు. కుంటి గుర్రం అంతదూరం అదే వేగంతో అన్ని గంటలు పరుగెత్తడం అసాధ్యమంటాడు. గుండె పోటొచ్చి మైలు దాటకుండానే చచ్చిపోతుందంటాడు. ఆ మాటకొస్తే కలెక్టరుగారి గుర్రమైనా అంత వేగంతో అంతదూరం పరుగెత్తలేదని సవాలు చేస్తాడు. కాకుల్లెక్కలకి వంకలెట్టకూడదంటాడు లెక్కల మేస్టారు. ప్రభుత్వమే కాకుల్లెక్కల్తో నడుస్తున్నప్పుడు సగటు బడిపంతులు ఆ బాణీలోనే లెక్కలు చెప్పడం తప్పెందుకవుతుంది? భావి పౌరులకు భావి జీవితంలో ఎదురయ్యే లెక్కలు కొన్ని ఇలాగే తగలడతాయని ముందే హెచ్చరించడం తప్పుకాదు గదా? ప్రభుత్వాన్ని వదిలేయండి. సంసారాల్లో కూడా ఇల్లాంటి లెక్కలే ఎక్కువగా వుంటాయి. మగమారాజులు కొందరు ఈ తరహా లెక్కల్నే ఇంటో చెబుతుంటారు! ఇంటి వాతావరణం అనుకూలంగా వున్నప్పుడు ఇరవైకి కొన్న వస్తువుని అరవైకి కొన్నామంటారు. తద్వారా ఆ నెల బడ్జెట్లో తమ సొంత ఖర్చులకు గాను నలభై నొక్కేస్తారు. ఇంటో వాతావరణం ప్రతికూలంగా అఘోరించినప్పుడు అరవైకి కొని ఇరవైకి కొన్నామని కోస్తారు. తద్వారా అద్భుతమైన భర్త అనే బిరుదు సంపాయిస్తారు.

కాకుల్లెక్కలు మాదిరే కాకమ్మ కథలు కూడా అతను అశువుగా చెప్పగలడు. అప్పుడెప్పుడో కలర్ టీవీ కొనుక్కొచ్చి - ఎవరో ఫ్రండు గిఫ్టుగా ఇచ్చేడని చెబుతాడు. ఎంతఫ్రండయినా వేలకువేలు పోసి గిఫ్టులెందుకిస్తారని ఇల్లాలు అడుగుతుంది. అతనికి నేను చేసిన సాయం అలాంటిదంటాడు. ఏమిటా సాయమని అడుగుతుంది. ఉత్తుత్తి సాయాల లిస్టు అతని దగ్గిర చాలా పెద్దదే వుంటుంది. ఏం చెప్పమంటావని నిట్టూర్పు నటిస్తాడు. చెప్పకూడదనిదా అని అడుగుతుంది. నోనో అదేం కాదంటాడు తొట్రుపాటుతో. అయితే చెప్పడానికి సంశయిస్తారెందుకని అడుగుతుంది. అతను డిగ్రీ పరీక్షల్లో నా పేపరు కాపీ కొట్టి పాసయ్యేడని కోస్తాడు. మీ ఫ్రండ్సందరూ మీ పేపర్లు కాపీ కొట్టే వారేనా అని అడుగుతుంది. అదేం ప్రశ్న అని అడుగుతాడతను. మొన్నెప్పుడో ఒక ఫ్రండు గురించి యిలాగే చెప్పేరంటుంది. ఆ ఫ్రండే ఈ ఫ్రండని ఆలస్యం చేయకుండా చెబుతాడు. కాపీ కొట్టడం తప్పుకదా అని కోప్పడుతుంది. తప్పుగనకే కలర్ టీవీ నాకు ప్రెజెంట్ చేసి తనకి శిక్ష వేసుకున్నాడని చెబ్తాడు. ఈ మాయదారి ఆర్గ్యుమెంటు ఎంతకీ తెమలదు. అడిగే కొద్దీ అతను కాకమ్మ కథలు ఆశువుగా చెబుతాడు. అంతేగాని అప్పుచేసి కొన్నాననే నిజం బయటపెట్టడు. ప్రభుత్వం మాదిరి - అబద్ధాన్ని ఆశువుగా చెప్పే ఆర్టుని పోషిస్తున్నంతకాలమూ తనకి తిరుగులేదని నమ్ముతాడు. దిక్కుమాలిన వాస్తవంతో అష్టకష్టాలు పడి బతకడం కంటే కాకుల్లెక్కలూ, కాకమ్మ కథలూ చెప్పి ఆనందంగా రోజులు నెట్టుకుపోవడమే తక్షణ కర్తవ్యమని భావిస్తాడు! ☆

ప్రాచీన చరిత్రను కళ్ళకు గట్టే కరీంనగర్



రాజు

పర్యాటక శాఖ నిర్లక్ష్యం వల్ల కరీంనగర్ జిల్లాలోని పురాతన కాలం నాటి ఆంధ్రుల చరిత్రను మన కళ్ళ ముందు నిలిపే ప్రాచీన కట్టడాలు కనుమరుగవుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా నిజాం కాలం నాటి కట్టడాలు మనకు నేటికీ కనిపిస్తాయి. కరీంనగర్-సిరిసిల్ల రహదారి మధ్యలోని ఎలగందుల, రామగిరి, మొలంగూరు ధోలికట్ట, కోటలింగాల, నాగునూర్, సింగాపూర్ బృహత్ శిలాయుగం నాటి సమాధులు (రాకాసి గుళ్ళు), అర్నకొండ, సుంపుల, మద్దంపూర్, కదంమోబూర్ మొదలైన చోట్ల వున్న సమాధులతో పాటు మానేర్ డ్యాం, గోదావరి తీరంలోని కాళేశ్వరం, వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరి దేవాలయంతో పాటు ధర్మపురి, కొండగట్టులాంటి ఎన్నో యాత్రా స్థలాలున్నాయి. తెలుగు జిలుగుల ఎన్.టి.పి.సి., ఎఫ్. సి.ఐ., సింగరేణి బొగ్గు గనుల అందాలు ప్రజల సందర్శనకు అందుబాటులోకి తేవడంలో పర్యాటక శాఖ పూర్తిగా విఫలమైంది. వేములవాడ దేవస్థానం చాణక్య రాజులైన విక్రమాదిత్య, యుద్ధ మల్లుడు రెండవ నర్సింహదేవుడు వేములవాడ రాజధానిగా చేసుకొని పరిపాలన చేశారని శాసనాలు తెలుపుతున్నాయి. దీంతోపాటు వేములవాడ దేవస్థానం సంస్కృత, ఆంధ్ర, కర్ణాటక భాషలకు నిలయంగా మారిందని ఆధారాల వల్ల తెలుస్తోంది. ఆలయంలో ఇంద్ర నీలఛాయలోని లక్ష్మీగణపతి విగ్రహం ఆనాటి శిల్పకళ ప్రాభవానికి అద్దం పడుతుంది. క్రీ.శ. 850 నుండి 895 వరకు పాలించిన రెండవ మల్లుని కుమారుడైన బద్దెగ భూపతి నిర్మించినట్లు చెబుతున్న భీమేశ్వరాలయం పూలతోటల మధ్య ఉండి యాత్రికులకు ఆహ్లాదాన్ని కలిగిస్తున్నది.

గోదావరి ప్రాణహిత, సరస్వతి నదులు కలిసే చోట వున్న కాళేశ్వరం గుడి గొప్ప శిల్ప కళానిలయంగా ఉండేది. ఇక్కడ బయల్పడిన శిల్పాలు గత వైభవాన్ని చాటి చెబుతున్నాయి. శిథిలావస్థకు చేరిన ఈ దేవాలయాల జీర్ణోద్ధరణ కోసం ఏర్పడిన కమిటీ మొదటి అధ్యక్షుడిగా మాజీ ప్రధాని పి.వి. నరసింహారావు వున్నారు. ఆ తరువాత 1976-82 మధ్య దీన్ని పునర్నిర్మించారు. రామగుండం శివార్లలోని కొండపైన సహజ సిద్ధంగా ఏర్పడిన నీటి గుండాలున్నాయి. శంకరపట్నం మండలం మొలంగూర్ గ్రామంలో గుట్టపైన వున్న మొలంగూర్ ఖిల్లా సందర్శకులను ఆకట్టుకుంటుంది. 17వ శతాబ్దంలో ఓరుగల్లును పరిపాలించిన ప్రతాపరుద్రుడు దీనిని నిర్మించినట్లు చరిత్ర చెబుతున్నది.

కాకతీయుల కళా వైభవానికి ప్రతీకగా నిలిచే గుట్ట ప్రవేశంలోని రాతి ద్వారాలపై సర్వాంగ సుందరంగా చెక్కిన శిల్పాలున్నాయి. ఖిల్లాపై ఇరువైపులా అమర్చబడిన రెండు ఫిరంగులు నేటికీ పర్యాటకులకు కనువిందు చేస్తున్నాయి. అయితే కనీస రక్షణ లేక ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల అవి శిథిలావస్థకు చేరుకుంటున్నాయి.

కరీంనగర్ జిల్లాలోని ధూళికట్ట గ్రామం వద్ద హుస్సేన్‌మియా వాగు సమీపంలో బయటపడిన బౌద్ధ స్థూపం క్రీస్తుపూర్వం మూడవ శతాబ్దం నాటిదని చరిత్రకారులు నిర్ధారించారు. ఇక్కడికి అనేక ప్రాంతాల నుండి వచ్చే బౌద్ధులు, సందర్శకులకు కనీస సౌకర్యాలు లేవు. ఈ ప్రదేశంలో పురావస్తు శాఖ అధికారులు జరిపిన తవ్వకాలలో లభ్యమైన ప్రాచీన వస్తువులలో కరీంనగర్‌లో నిర్మించతలపెట్టిన ధూళికట్ట సైట్ మ్యూజియం ప్రతిపాదన పాతికేళ్ళుగా ఫైళ్ళకే పరిమితమైంది. వందలాది సంవత్సరాలు ఆంధ్రదేశాన్ని పాలించిన శాతవాహనుల ఒకనాటి రాజధానిగా కరీంనగర్ జిల్లా వెల్గటూరు మండలం కోటిలింగాల వుండేదని చరిత్రకారుల అంచనా. శ్రీముఖుడి నాణెం మొదట ఇక్కడే లభ్యమైంది. జైనమతం కూడా జిల్లాలో విలసిల్లినట్లు దాఖలాలు వున్నాయి. జైన కేంద్రాలను పర్యాటక స్థలాలుగా రూపుదిద్దాల్సిన అవసరం వుందని ప్రజలు కోరుతున్నారు. ఎలగందుల ఖిల్లాపై నుంచి చూస్తే మానేరు నీరు, పచ్చని పొలాల రమణీయ దృశ్యాలు కనిపిస్తాయి. జగిత్యాలలోని ఖిల్లాను 1747లో నిజాం ప్రభుత్వ సేనాధిపతి ఇబ్రహీంఖాన్ దంపా నిర్మించినట్లు ఆధారాలున్నాయి. దీంతో పాటు కరీంనగర్ పట్టణ శివారులోని మానేరు డ్యామ్, గంభీరావుపేట మండల కేంద్ర సమీపంలోని నిర్మల్ వద్ద నిజాం కాలంలో నిర్మించిన ఎగువ మానేరు డ్యాం, కోరుట్ల వద్ద నిజాం కాలంలో నిర్మించిన ఎగువ 'సైఫన్' పర్యాటకులను ఎంతో ఆకట్టుకుంటున్నా పర్యాటక శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో జిల్లాలోని ప్రాచీన చారిత్రాత్మక సందర్శనీయ స్థలాలను రాష్ట్ర పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని పర్యాటక శాఖ భావించింది. ఆ మేరకు జారీ అయిన ఆదేశాలననుసరించి జిల్లా అధికారులు తయారు చేసిన "మోడల్ డిస్ట్రిక్ట్ టూరిజం ప్లాన్" ప్రతిపాదనలు కార్యరూపంలోకి మాత్రం వచ్చే జాడలు కనిపించడంలేదు. గత సంవత్సరం అక్టోబర్‌లో పర్యాటక కేంద్రాల అభివృద్ధికి జిల్లాకు 10.5 లక్షల రూపాయలు కేటాయించింది. ఈ నిధులతో ప్రముఖ యాత్రాస్థలాల అభివృద్ధి పనులు చేపట్టడానికి ఒక ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. లోయర్ మానేర్ ధ్యాం పర్యాటకుల్ని ఆకర్షించే విధంగా మెకానికల్ బోటింగ్, మ్యూజికల్ ఫౌంటెన్, పచ్చిక బయళ్ళు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. జిల్లా కేంద్రానికి 130 కిలోమీటర్ల దూరంలో గోదావరి నదీ తీరాన కాళేశ్వరం వద్ద రెస్టారెంట్, గెస్ట్ హౌస్‌ల నిర్మించాలని ఆర్టీసి బస్సులు పెంచాలని నిర్ణయించారు. వరంగల్, మహదేవ్‌పూర్ రోడ్ల వెడల్పుతో పాటు వేములవాడ, బాసరలో జింకల పార్కు అభివృద్ధి, కుందేళ్ళ పెంపకం, ఫిష్ అక్వేరియం, బొటానికల్ గార్డెన్‌ను తీర్చి దిద్దడంతో పాటు పక్షుల పార్కు ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించారు. ధర్మపురిలో గెస్ట్‌హౌస్ నిర్మించాలని, కోతుల పార్కు ఏర్పాటు చేయాలని, యాత్రికులకు ఉద్యానవనం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు, వేములవాడ దేవస్థానంలో రెస్టారెంట్ నిర్మాణం, దేవాలయ సమాచార కేంద్రం ఏర్పాటు, గెస్ట్‌హౌస్ సౌకర్యం, గురిచెరువులో బోటింగ్ సౌకర్యం వంటి ఏర్పాట్లు చేయాలని ప్రణాళికలు రూపొందించారు. ఇప్పటికైనా త్వరతగతిన జిల్లాలో ఉన్న దర్శనీయ స్థలాల అభివృద్ధికి పర్యాటక శాఖ. పాలకులు శ్రద్ధ వహించాలని జిల్లా వాసులు కోరుతున్నారు. ☆

గంగూలిపై విమర్శలు తగునా?

సుధాకర్ నర్వనేని

విభిన్న వూహాగానాలకు తెరదించుతూ భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు సెలెక్షన్ కమిటీ తిరిగి సౌరవ్ గంగూలికే కెప్టెన్సీ కట్టబెట్టింది. గంగూలి ఆటతీరు, నాయకత్వ లక్షణాలపై అనేక విమర్శలు వస్తున్న నేపథ్యంలో సెలెక్టర్లు తిరిగి అతనిపై విశ్వాసం ఉంచడం గమనార్హం. సెలెక్టర్ల నిర్ణయం కొంతమందిని అసంతృప్తికి గురిచేసినట్లు వారి ప్రకటనలు స్పష్టం చేస్తున్నాయి. దక్షిణాఫ్రికా పర్యటనకు జట్టు సన్నద్ధమవుతున్న దశలో కూడా ఇంకా ఈ విమర్శల జోరు తగ్గకపోవడం గమనార్హం. ఈ పరిస్థితుల్లో ఒకసారి గంగూలి ఆటతీరు, నాయకత్వ లక్షణాలను పరిశీలించడం అవసరం.

కెప్టెన్‌గా గంగూలి

ఒకప్పుడు గంగూలిని ఆకాశానికి ఎత్తినవారే నేడు విమర్శల వర్షం కురిపిస్తున్నారు. కెప్టెన్‌గా ఎంపికైన తరువాత దురుసుగా ప్రవర్తిస్తున్నాడని, బ్యాటింగ్‌లో విఫలమవుతున్నాడనేదే వారి ప్రధాన విమర్శ. కెప్టెన్‌గా గంగూలి కొన్ని టెస్టుల్లో విఫలమైన మాట వాస్తవమే అయినా జయసూర్య (శ్రీలంక, సగటు 19.3), స్టీఫెన్ ఫ్లెమింగ్ (న్యూజిలాండ్, 29.2), నాసిర్ హుస్సేన్ (ఇంగ్లండ్, 13.56)తో పోలిస్తే గంగూలి సగటు (29.4) మెరుగ్గావుంది. గంగూలిని మినహాయిస్తే వారు ఎంతోకాలం నుండి కెప్టెన్లుగా కొనసాగుతున్నారు. వారి దేశాల్లో వారిపై ఎలాంటి విమర్శలు చెలరేగడం లేదు. కానీ గంగూలి వ్యవహారాన్ని భూతద్దంలో చూపుతున్నారు. అయితే వన్డేల్లో గంగూలి బ్యాటింగ్ సగటు జట్టులో ఆటగాడిగా ఉన్నప్పటికంటే కెప్టెన్ అయిన తరువాత మెరుగ్గావున్న విషయాన్ని వారు మర్చిపోతున్నారు. అంతదాకా ఎందుకు సచిన్, గంగూలి కెప్టెన్‌లుగా ఉన్నప్పటి వారి రికార్డును పరిశీలిస్తే విషయం స్పష్టంగా అర్థమవుతుంది.

పేరు	ఇన్నింగ్స్	సెంచరీ	అర్ధసెంచరీ	సగటు
గంగూలి	45	5	11	44.4
సచిన్	69	5	12	36.47

ఇక భారత్‌కు సంబంధించినంత వరకు అజరుద్దీన్ తరువాత అత్యధిక టెస్టుల్లో విజయం సాధించిన రికార్డు గంగూలిదే. అతని విజయాల రికార్డు 59 శాతం. ప్రపంచంలో టెస్ట్ క్రికెట్ ఆడే దేశాల కెప్టెన్లతో పోలిస్తే స్టీవ్‌వా, పొలాక్ తరువాత స్థానంలో గంగూలి ఉన్నాడు. గంగూలి కెప్టెన్‌గా ఎంపికైన తరువాత పూర్తిస్థాయి జట్టు అతనికి అందలేదు. సీనియర్లు గాయపడడంతో యువ ఆటగాళ్లతో ప్రయోగాలు చేశారు. కుంబ్లే, శ్రీనాథ్ మొదలుకుని సచిన్, లక్ష్మణ్, నెహ్రా వరకు అనేక మంది సీనియర్ ఆటగాళ్లు గాయాలతో జట్టుకు దూరం అయ్యారు. అయినా యువ ఆటగాళ్లతో జింబాబ్వే, శ్రీలంక పర్యటనలో ఒకో టెస్టులో భారత్ విజయాన్నందుకున్నది. ఇక వ్యక్తిగతంగా ఇటీవల కొన్ని టెస్టుల్లో అతను బ్యాటింగ్‌లో విఫలమయ్యాడు. అయితే శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో అతను రాణించి ఒంటిచేత్తో భారత్‌ను గెలిపించిన విషయం మరువరాదు. ఇక అంపైర్ల తప్పుడు నిర్ణయాలకు గంగూలి కనీసం నాలుగైదుసార్లు బలయ్యాడు. దానిని అతని వైఫల్యంగా పరిగణించడం పూర్తిగా సమర్థనీయం కాదు. ఇక కెప్టెన్‌గా దురుసుగా ప్రవర్తిస్తున్నాడనే ఆరోపణలు అతనిపై ఉన్నాయి. అంపైర్ల తప్పుడు నిర్ణయాలకు అవుటైనప్పుడు కొంత అసహనానికి గురయిన మాట వాస్తవం. అంత మాత్రాన దానిని మరీ ఇదిగా భావించడం సరి కాదు. ఇతర దేశాల కెప్టెన్లు ముఖ్యంగా ఆస్ట్రేలియా ఆటగాళ్లతో పోలిస్తే గంగూలి దురుసుతనం చాలా తక్కువే.

వేటు పరిష్కారమా?

అనుభవం లేని జట్టుతో కొన్ని మ్యాచ్‌ల్లోమాత్రమే విఫలమైనంత మాత్రాన కెప్టెన్‌ను మార్చాలనే ధోరణి మంచిది కాదు. టెస్టు క్రికెట్ ఆడే దేశాలన్నీ ఇదే విధానాన్ని అనుసరిస్తున్నాయా? లేదా అనే విషయాన్ని ఒకసారి పరిశీలించాల్సిన అవసరం ఉన్నది. గతంలో మార్క్‌టేలర్ (ఆస్ట్రేలియా) వరుసగా 22 ఇన్నింగ్స్‌లో ఒక అర్ధసెంచరీ కూడా చేయలేదు. అయినా అతని కెప్టెన్సీ ఊడలేదు. టేలర్ ప్రపంచంలో ఉత్తమ కెప్టెన్‌గా ఎంతపేరు సంపాదించిందీ అందరికీ తెలిసిన విషయమే. ఇంగ్లండ్ కెప్టెన్ నాసిర్‌హుస్సేన్ విషయం కూడా ఇంతే. కాగా ఇటీవలి కాలంలో ఆయా జట్ల కెప్టెన్ల విజయాల రికార్డును ఒకసారి పరిశీలిద్దాం.

కెప్టెన్-దేశం	ఆడినటెస్టులు	గెలిచినవి	ఓడినవి	డ్రా	గెలుపుశాతం
స్టీవ్‌వా (ఆస్ట్రేలియా)	27	20	5	2	77.7
పొలాక్ (దక్షిణాఫ్రికా)	14	7	2	5	67.8
గంగూలి (భారత్)	11	6	4	1	59.08
నాసిర్‌హుస్సేన్ (ఇంగ్లండ్)	23	10	7	6	56.52
జయసూర్య (శ్రీలంక)	24	8	9	7	47.8

పై పట్టికను బట్టి ప్రస్తుతం గంగూలి టెస్టు విజయాల రికార్డు ఎలా ఉన్నదీ తెలుస్తుంది. గంగూలి ఒక ఆటగానిగా అరుదైన రికార్డులు కొన్నింటిని స్వంతం చేసుకున్నాడు కూడా. ఆస్ట్రేలియా గడ్డపై వన్డే సెంచరీ సాధించిన ఏకైక భారత బ్యాట్స్‌మెన్ గంగూలే. ఒక క్యాలెండర్ సంవత్సరంలో అత్యధిక పరుగులు సాధించిన ఆటగాడిగా గంగూలి మూడుసార్లు రికార్డు నెలకొల్పాడు (1997, 99, 2000). దీనినిబట్టి చూస్తే అతను ఘోరంగా విఫలమవుతున్నాడనేది అవాస్తవమని తేలడం ఖాయం. గంగూలి ఆడిన మొదటి వన్డేలోనే విఫలమయ్యాడని రెండేళ్లపాటు జట్టు నుండి దూరంగా ఉంచారు. సచిన్ టెండూల్కర్ కూడా ఆడిన మొదటి రెండు వన్డేల్లో డక్కౌట్ అయ్యాడు. ద్రావిడ్ కూడా అంతే. వారు తొలి వన్డేల్లో విఫలమయ్యారనే సాకుతో జట్టు నుండి తొలగించినట్లయితే ఏమయ్యేది. జట్టుకు ఇద్దరు మంచి బ్యాట్స్‌మెన్ కరువయ్యేవారు. తాత్కాలికంగా కొన్ని మ్యాచ్‌ల్లో విఫలమైనంత మాత్రాన గంగూలిని విమర్శించడం భావ్యం కాదని ఇదంతా చెప్పాల్సివచ్చింది. విమర్శకులు సద్విమర్శలకు ప్రాధాన్యత ఇస్తే బాగుంటుంది. జట్టు మనోస్థైర్యాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలకు దూరంగా ఉంటే మంచిది. ఏమైనా తిరిగి కెప్టెన్సీ సాధించిన గంగూలి కూడా విమర్శలను సహృదయంతో స్వీకరించి అందులోని సూచనలను తన విజయానికి సోపానాలుగా మలుచుకుంటాడని, దక్షిణాఫ్రికా పర్యటనలో జయకేతనం ఎగురవేస్తాడని మనస్ఫూర్తిగా కోరుకుందాం. ☆



బిచ్చగాళ్ళ ఊరేగింపు

డా॥ దేవరాజు మహారాజు

తెల్లటి ఖద్దరు బట్టల ఊరేగింపు అది -

ఖరీదైన బట్టల ఊరేగింపు అది.

ఎప్పుడూ కార్లలో, ప్లేన్లలో, ఫస్ట్‌క్లాస్ కంపార్టుమెంట్లలోనే తప్ప పాదయాత్ర చెయ్యని వాళ్ళు నిశ్శబ్దంగా ఊరేగింపులో వున్నారు.

వాళ్ళ సున్నితమైన కాళ్ళ జోళ్ళు ఎక్కడ నొచ్చుకుంటాయోనని, అక్కడక్కడ కంకర తేలిన తన కరుకుతనం ఎంత బాధిస్తోందోనని, మరీ ఇదయి పోయి ముఖమంతా మాడ్చుకున్నట్టుంది నల్లని తారు రోడ్డు -

భక్తితో లాఠీలు ముడుచుకుని, అంగరక్షకుల్లా తలలు వంచుకుని ఊరేగింపును గౌరవంగా తీసుకెళుతున్నారు పోలీసులు!!

నినాదాల్ని గొంతెత్తి అరవడం లేదు. ఉరుము లేని మెరుపులాగ సాగుతోంది - గుంపు రాజభవన్ వైపు.

పార్టీలలో తమ కోర్కెలు తీర్చగల, ప్రముఖ పారిశ్రామిక వేత్తలకేం కోరికలున్నాయోనని ఆశ్చర్యపోయి, పక్కకు తొలగిదారి విడిచారు కార్మికులు.

తమకేవో లేనిపోనివి నేర్పుతూ వెనకనుండి ఎగవేసే, తెరవెనకనున్న రాజకీయ దురంధరులు కూడా ఊరేగింపులో ఉండి విద్యార్థులకు ఆశ్చర్యాన్ని కలిగించారు.

తమ కోర్కెలు సఫలం చేయించడానికి తమ వైపు నిలబడదామని వాగ్దానం చేసిన ఆటో, టాక్సీ యూనియన్ల ప్రెసిడెంట్లు - స్వయంగా తమ కోర్కెల కోసం ఊరేగింపులో పాల్గొనడం వల్ల, వాహనాలు ఆపి పక్కకు నిలబడి అలాగే చూస్తుండి పోయారు టాక్సీ డ్రైవర్లు ఆశ్చర్యంగా!

ఎన్నికలప్పుడు మాత్రమే కనిపించి, సమస్యలకు సరైన పరిష్కారాలు వెతుకుతామని చెప్పి, కన్నీళ్ళను వృథా చేయకండి పంట కాలవల వైపు మళ్ళించి ఆహారోత్పత్తిని అధికం చేయండి. మీ కన్నీళ్ళకు ఆనకట్టలు కట్టిస్తాను. దానివల్ల మన రాష్ట్రానికి కావల్సినంత పోగా, విద్యుచ్ఛక్తిని మన పక్క రాష్ట్రాలకు కూడా పంపొచ్చని ఉపన్యసించిన (కొద్ది ఓట్లతో మంత్రి పదవి తప్పిపోయినా ఇప్పటికీ ప్రజల వైపే ఉండి, ప్రజల కోసం పాటుపడే) ప్రజా నాయకులు కూడా వారి కోర్కెలు తెలిపే మెమొరాండం సమర్పించి రావడానికి ఊరేగింపులో వెళ్తుండడం... నిజానికి సామాన్య జనానికి ఆశ్చర్యాన్ని కలిగించింది.

"అలాగా! యూనివర్సిటీ నుండి రెండు, మూడు డిగ్రీలు తీసుకున్నా నీకింకా ఉద్యోగం దొరకలేదా! అవును దొరకడం మామూలా ఈ రోజుల్లో. ఫరవాలేదు నేను ఇప్పిస్తాను. అయ్యే ఖర్చులు నువ్వు పెట్టుకో" - రెండు నెలల్లో ఇప్పిస్తానని రెండేళ్ళయినా ఇప్పించక ఖర్చులు మాత్రం భోంచేసిన పైరవీకార్లు కూడా ఆ గుంపులో వెళుతూ ఉండడం నిరుద్యోగులకు ఒళ్ళు మండినా, ఆశ్చర్యం కలిగించింది. అందరిలాగే వాళ్ళూ పక్కకు తొలగి దారిచ్చారు

ధరలు పెంచినా, దొరకని వస్తువులు కూడా తమ నగరంలోని వాళ్ళకు దొరికేట్టు చేస్తున్న వ్యాపారస్తులు!

కొంత ఆలస్యమవుతున్నా, మంచి ముడి సరుకులు దొరక్కపోవడం వల్ల నిర్మాణాలు కొంత పటిష్టంగా ఉండకపోతున్నా ప్రజల డబ్బును, మంజూర్ల ద్వారా పుచ్చుకుని, ప్రజల కోసమే చేస్తున్న ప్రముఖ కంట్రాక్టర్లు కూడా ఊరేగింపులోనే వున్నారు.

ప్రజల అభిమానాన్ని, బ్లాక్ మనీని చూరగొంటూ మరోవైపు పారిశ్రామికవేత్తలుగా, వ్యాపారస్తులుగా తయారవుతున్న సుప్రసిద్ధ సినీ తారలు కూడా పాల్గొనడం - ప్రజలకు పిచ్చెత్తినట్లయ్యింది. ఇప్పుడు యుద్ధం కూడా ఏదీ లేదు కదా! చిరునవ్వులు ఒలకబోస్తూ పరోక్షంగా బలవంతాన విరాళాలు వసూలు చేసే కార్యక్రమమైనా లేనిది, ఇలా రోడ్ల మీద పడ్డారెందుకోనని... నిజంగా ఆశ్చర్యంలోనే మునిగింది ప్రేక్షక లోకం.

ఏదైనా కేసు ఉంటే ఎప్పటిలాగా మనల్ని పిలిచి వాళ్ళకనుగుణంగా పనులు చేయించుకోక, అందరూ ఎటో పోతారేం, ఈ ధనవంతులూ, పెద్ద మనుషులూ! అని ఆశ్చర్యపోయి తరువాత విసుక్కున్నారు గల్లీల చివర్లో నిలబడ్డ... రౌడీలు.. దాదాలు.

నినాదాలు లేవు. డిమాండ్స్ తెలియజేసే బ్యానర్లు లేవు. ప్రొసెషన్ మొదట్లో ఒక ప్రముఖ వ్యక్తి ఒక చిన్న అట్ట పట్టుకున్నాడు. దాని మీద విషయాలు టైపు చేయబడి వున్నాయి. ఆశయాలు దూరంగా వున్నా సామాన్య జనానికి కనిపించకుండా వున్నాయ్. వాళ్ళ కోర్కెలు సామాన్య జనానికి అందకుండా ఉన్నట్టు! అందుకే ఆశ్చర్యపోతున్నారంతా - ఎందుకూ ఏమిటీ? అని!

రకరకాల వాళ్ళ రకరకాల ఆశ్చర్యం.

కాని బిచ్చగాళ్ళకు ఆశ్చర్యం కలగలేదు -

మొదట్లో -

ఇలాంటి ఊరేగింపులు చూస్తూనే వున్నారు. ఈ రోజు ఊరేగింపు వాళ్ళకి కొత్తగా ప్రత్యేకంగా కనిపిస్తోంది. అలాంటి ఊరేగింపు వెళ్ళే త్రోవలో కూర్చుంటే ఎవరో కొందరు దానం విసిరే వారు... దాంతో వాళ్ళ కళ్ళు మెరిసేవి. కాని ఈ రోజు వాళ్ళ దగ్గరికే వెళ్ళనివ్వడం లేదు పోలీసులు.

ఒకరిద్దరు కుంటివాళ్ళు కుంటుతూ, మరో కుష్టిరోగి తన చక్రాల డెక్క మీదా, ఊరేగింపులోని వాళ్ళ దగ్గరికి చేరుకోవాలని యత్నించారు. పోలీసుల లాఠీలు చెదరగొట్టాయి. మిగతా బిచ్చగాళ్ళు భయంతో... అడ్డు రాకుండా దారి విడిచారు. ఈ ఊరేగింపులో ఏదో గొప్పతనం ఉందని తెలుసుకుని భయంగా ఆశ్చర్యంగా ఉండిపోయారు. అడుక్కోకుండా తమంతట తామే అలా దూరంగా వెళ్ళి నిలుచోవడం తమను తామే చంపుకున్నట్టుంది.

విలువైన సబ్బులతో స్నానం చేసి, ఖరీదైన క్రీములు, పౌడర్లు, ఆయిల్స్ లిప్‌స్టిక్స్‌తో నాగరికత పెంచుకున్న ఊరేగింపు - వాళ్ళ వైపు కళ్ళు చిట్లించుకుని, విసుక్కుంటూ, రుసరుసలాడుతూ వెళ్ళిపోతూనే ఉంది. తెల్లని కర్చీఫ్‌తో ముక్కుమూసుకుంటూ, మెత్తని జోళ్ళ మీద, బూట్ల మీద, హైహీల్స్ మీద, చలవబట్టలతో, ఫారెన్ ఇంపోర్టెడ్ సారీస్‌తో సూట్లతో-

ఎంతచెట్టుకు అంతగాలి, మన బాధలు మనకైతే వాళ్ళవి వాళ్ళకుంటాయి అని సరిపుచ్చుకునే మూర్ఖులు కొద్దిమందయితే-ఇదంతా ఎందుకు అని ప్రతివానిలో ప్రశ్నలు అంటుకోవడమే ఎక్కువ.

ఊరేగింపు పోతూనే ఉంది. మనుష్యుల్ని తినే కొండచిలువలా.

మరునాడు అనేక భాషల పత్రికల్లో ఆ వార్త గొప్పగా చోటు చేసుకుంటే అందులో ఆశ్చర్యమేముంటుంది?

★ ★ ★ ★

హైదరాబాద్, జనవరి 1 :

నగరంలోని పారిశుధ్యాన్ని, అందాన్ని, ప్రజల ఆరోగ్యాన్ని, అందాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రముఖ నాయకులు, పారిశ్రామికవేత్తలు, వ్యాపారస్తులు, సినీనటులు, ఇతర నగర ప్రముఖులు కలిసి, ఒకటి రెండు ఫర్లాంగుల దూరం ఊరేగింపుగా పాదయాత్ర జరిపి, రాష్ట్ర గవర్నర్‌కు ఒక మెమొరాండం సమర్పించారు. అందులో ఆనందభరితమైన నగర జీవితంలో బిచ్చగాళ్ళు, కుష్టువాళ్ళు, కుళ్ళిపోయి అసహ్యాన్ని రేపుతున్నారని, ఇది కాస్మోపోలిటన్ సిటీ గనక, తరచూ ఇతర దేశాల నుండి వచ్చేవాళ్ళు వీళ్ళను చూసి, మన గురించి, మన నాగరికత, సంస్కృతి, ఔన్నత్యాన్ని గురించి తక్కువగా నీచమైన అభిప్రాయాలకు వచ్చే ఆస్కారం వుంది. గనక - వీళ్ళను ఫుట్‌పాత్‌ల నుండి, నగర పార్కుల నుండి, సినిమా హాళ్ళు, దేవాలయాల పరిసరాల నుండి అంతటా బహిష్కరించాలని తెలియజేశారు.

పిచ్చికుక్కల్ని మున్సిపాలిటీ వాళ్ళు పట్టుకుని తీసుకుపోయినట్లు, వీళ్ళక్కూడా ఒక పద్ధతిని తక్షణమే అమలు జరపాలని వారు చాలా తీవ్రంగా అందులో విన్నవించుకున్నారు. ఇది కేవలం మానవతా విలువల్ని దృష్టిలో ఉంచుకుని...

ఆ న్యూస్ పేపర్ పత్రున చిరిగిపోయింది విద్యార్థి నాయకుని ఉద్రేకపు చేతుల్లో. పేపరు ముక్కలు ముక్కలయ్యింది. అతని ఊపిరి బరువైంది. అతని ఆలోచనలో కరెంటు సుళ్ళు తిరిగింది. విద్యార్థులు, యువజనులు ఐకమత్యం నీడలో ఆలోచించారు. బిచ్చగాళ్ళను కుక్కల్లా పట్టుకు పోవాలని అన్నందుకు నిరసనగా బంద్ జరిపారు. నిముషాల మీద వార్త నగరం దాటి జిల్లాలకి, తాలూకాలకి పాకింది. పరిస్థితి తీవ్రంగా అయ్యింది. కర్ఫ్యూలు, ఫైరింగ్‌లు అయ్యాయి. ఎందరు చచ్చినా అధికార ప్రకటనలో చచ్చిన వాళ్ళ సంఖ్య మూడు, నాలుగు దాటలేదు. ఈ విషయంలో పార్టీలు తలలు దూర్చాయి. సమస్య రాజకీయంగా రంగు మార్చుకుంది. సామాన్యుడు స్తంభించిన జీవనంలో బతకలేకపోయాడు. సందు దొరికిందని మంత్రులు కొందరు రాజీనామా చేశారు. కొందరు పార్టీలు మార్చారు. ఎంత వెదికినా నోట్లో మాట లేని వాడు గూడా పత్రికా ప్రకటనలిచ్చాడు. దినదినాభివృద్ధి చెంది సమస్య బలిసిపోయి నిగనిగలాడేట్లు కొందరు ఎంతో జాగ్రత్త తీసుకున్నారు. ఫలితంగానే క్రమంగా దేశం తెల్సుకోవాల్సిన అత్యవసర సమస్య అయ్యింది.

దరిద్రులైనా, బిచ్చగాళ్ళయినా మనిషిని మనిషిగా చూడలేని సమాజం గూర్చి తీవ్రంగా ఆలోచించారు మేధావులు. వారికి అది ఎంతో హీనంగా తోచింది.

ప్రభుత్వం మేధావులతో ఒక కమీషన్ వేసింది.

అది -

"అసలు బిచ్చగాళ్ళంటే ఎవరు?

వాళ్ళెందుకు అలా అయ్యారు?

రోడ్ల మీద కనబడగానే లాగిపారేసే అవసరం ఉందా?" అని పరిశీలించారు. బిచ్చగాళ్ళు ఆర్థికంగా, సాంఘికంగా, నైతికంగా అనేక రకాలుగా ఉంటారు గనక - ఆ కమీషను ఒక విషయం తేల్చింది.

"దేశంలో బిచ్చగాడు కానివాడు ఎవడూ లేడు. అందువల్ల ఊరేగింపు తీసిన, నైతికంగా దిగజారిన ప్రముఖ బిచ్చగాళ్ళ నందరినీ, సమాజపు కోరలచాటున దిగిన విషపు బుద్ధలనందరినీ - వారి వారి రంగాల నుండి వెంటనే బహిష్కరించాలి" అని! ☆

ఆ మాత్రం ఆదుకోకపోతే ఎట్లా?

అంపశయ్య నవీన్



మా దగ్గరి బంధువుల అమ్మాయి పెళ్ళికి హైదరాబాద్ వెళ్ళాను - పెళ్ళయిపోయింది - భోజనాలు కూడా అయిపోయాయి. పెళ్ళికొచ్చిన వాళ్ళల్లో చాలా మంది వెళ్ళిపోయారు - ఇంకా కొందరు మ్యారేజ్ హాల్లో అక్కడ కొందరు, ఇక్కడ కొందరు ఫ్యాన్ల కింద కూర్చొని లోకాభిరామాయణం మాట్లాడుకుంటున్నారు - పెళ్ళి వాళ్ళకు చెప్పొస్తానని మా ఆవిడ పెళ్ళికూతురు తల్లిదండ్రుల దగ్గరకెళ్ళింది - ఆమెకోసం ఎదురుచూస్తూ నేనూ ఓ ఫ్యాన్ కింద కూర్చొని వెయిట్ చేస్తున్నాను - నా పక్కనే కూర్చున్న ఇద్దరు పెద్ద మనుషులు మాట్లాడుకుంటున్న మాటలు నా చెవిలో పడ్డాయి. వాళ్ళిద్దరిలో ఒకాయన పేరు వెంకట్రామయ్య అనీ, ఇంకొకాయన పేరు పరంధామయ్య అనీ అర్థమైంది.

"మొన్న బోఫోర్స్..... నిన్న హవాలా... ఇవ్వాళ్ళ తెహల్కా... ఈ దేశంలో ఎన్ని స్కాములండి... నన్నడిగితే ఈ రాజకీయ నాయకులందర్నీ కలిపి పబ్లిగ్గా ఉరితీయాలంటాను" అన్నాడు వెంకట్రామయ్య అనే ఆయన.

"అసలీ తెహల్కా అంటే ఏమిటండీ... నాకేం అర్థంకాలే...." అన్నాడు పరంధామయ్య అనే ఆయన.

"తెహల్కా అని ఓ వెబ్‌సైట్‌లెండి - అదీ ఓ వార్తా పత్రికలాంటిదే... కాకపోతే కంప్యూటర్లకు ఇంటర్‌నెట్ కనెక్షన్ పెట్టించుకున్న వాళ్ళే దాన్ని చూడగల్గారు - ఈ తెహల్కా డాట్‌కామ్ వాళ్ళు మన రక్షణమంత్రిత్వ శాఖలో చాలాకాలంగా సాగుతున్న ముడుపుల భాగోతాన్ని బయటపెట్టారు. రక్షణ శాఖకు కావలసిన బైనాక్యులర్స్ లాంటి కొన్ని ప్రొడక్ట్స్‌ని సరఫరా చేస్తామని, మాకు ఆర్డర్స్ ఇప్పించండని కొందరు రాజకీయ నాయకుల దగ్గరకు, మిలటరీ జనరల్స్ దగ్గరకు వెళ్ళారు - లంచాలిస్తే మీకు ఆర్డర్స్ ఇప్పిస్తామని వాళ్ళడిగారు వాళ్ళన్న మాటల్నీ, వాళ్ళకు లక్షల రూపాయల లంచం ఇస్తుండటం షూట్ చేశారు. అలా తీసిన వీడియో టేపులను వాళ్ళ వెబ్‌సైట్‌లో చూపించారు. దాంతో ఎంతోమంది అత్యంత పవిత్రులమని చెప్పుకున్న రాజకీయ నాయకుల బండారం బయటపడింది" అన్నాడు వెంకట్రామయ్య.

"ఈ తెహల్కా వాళ్ళు కొందరికి వేశ్యలను కూడా సప్లై చేశారట కదా... ఆగొడవేమిటి?"

"అవును.. మీకు ఆర్డర్స్ ఇప్పించాలంటే మీరు మాకు డబ్బే కాదు.. మా సెక్స్ కోరికల్ని తీర్చడానికి వేశ్యలను కూడా సప్లై చెయ్యాలని కొందరు మిలటరీ జనరల్స్ అడిగారట. వాళ్ళను తృప్తి పరచడం కోసం తెహల్కా వాళ్ళు వేశ్యల్ని కూడా సప్లై చేసి వాళ్ళ కామక్రీడల్ని కూడా వీడియో కెమెరాలో బంధించారట..."

"అవ్వ... అవ్వ... ఎంత అన్యాయం.. ఎంత అవినీతి.. దేశం నాశనమైపోతోందండి... ఈ దేశాన్ని ఎవడు రక్షిస్తారంటారు?"

"ఈ లంచగొండుల్నందర్నీ పట్టుకొని షూట్ చెయ్యాలి... అలా తప్ప ఈ దేశం బాగుపడదు..."

"ఎవరు షూట్ చెయ్యాలంటారు?"

"నువ్వూ... నేనూ... అందరమూ. మనలాంటి వాళ్ళంతా ఈ అవినీతి పరుల్ని నిలదీయాలి.. వాళ్ళ బండారాన్ని బట్టబయలు చేసి ప్రజల ముందు నిలబెట్టాలి. అలా చేస్తే ఈ దేశం బాగుపడ్తుంది."

"పోనీయ్‌లెండి... దేశం సంగతి దేశమే చూసుకుంటుంది గానీ మీ పెద్దవాడికేమన్నా ఉద్యోగం దొరికిందా? ఇంజనీరింగ్ చేసి ఊరికేనే ఉంటున్నాడా?"

"ఇంతవరకు దొరకలేదు గానీ ఇప్పుడు దొరుకుతుంది. మొన్ననే వాడో పరీక్షరాశాడు. అది పాసైతే ఇంటర్వ్యూకు పిలుస్తారట... ఇంటర్వ్యూకు పిలుపొచ్చిందంటే వాడికిక ఉద్యోగం దొరికినట్టే...."

"ఔనౌను.. ఎలక్ట్రిసిటీ మంత్రిగారు మీ వాడేగా..."

"మా వాడైతే మాత్రం ఇంజనీర్ ఉద్యోగం ఊరికేనే ఇస్తాడనుకుంటున్నారా? దానికో రేటుంటుంది..."

"ఎంతుంటుందేమిటి?"

"ఓ లక్షన్నా ముట్ట చెప్పందే ఆయన మా వాడికి ఉద్యోగం ఇస్తాడా?"

"లక్ష రూపాయలే... ఇస్తున్నారా?"

"ఇవ్వక తప్పదు కదా... వాడిని రెండు లక్షలు పెట్టి చదివించాను - సీటు కోసం లక్షరూపాయలు డొనేషన్ కట్టాను. అంత డబ్బు ఖర్చు పెట్టి వాడిని ఊరికే ఉంచితే ఎట్లా?"

"మీరు లక్ష రూపాయలిచ్చి మీవాణ్ని ఇంజనీర్‌ని చేస్తే మీకు లాభమేగానీ నష్టం లేదులెండి"

"ఎందుకలా అంటున్నారు"

"మీ వాడికి అసిస్టెంట్ ఇంజనీర్ ఉద్యోగం వస్తే మీవాడి కట్నం రేటు పెరుగుతుంది కదా... మీకుకాబోయే వియ్యంకుడి దగ్గర్నుంచి కనీసం ఓ పదిలక్షలన్నా లాగరూ?"

"పది లక్షలేనా? మొన్న మా బంధువులబ్బాయికి - వాడో స్కూలు టీచర్ - వాడికే పది లక్షలిచ్చారు"

"అయితే మీ వాడికి ఇరవైలక్షలన్నా రాల్తాయి..."

"కాలం కలిసొస్తే వేమూ అలాగే అనుకుంటున్నాము"

"ఇరవై లక్షలిచ్చినా మీ కాబోయే వియ్యంకుడికి నష్టమేమీ ఉండదులెండి - ఎందుకంటే ఆయన కూతురు రేపు రాజభోగాలు అనుభవిస్తుంది కదా.... అసిస్టెంట్ ఇంజనీర్.. అదీ ఆర్ అండ్ బిలో అంటే మాటలా? ఇంట్లో కూర్చుంటే పర్సంటేజీలు వచ్చి పడ్తూనే ఉంటాయి - ఓ రెండు మూడేళ్ళలో లక్షలు సంపాదిస్తాడు"

"సంపాదించకపోతే ఎట్లా? రేపు మా మంత్రిగారు ఎలక్షన్స్‌లో నిల్చున్నప్పుడు ఆయనకో లక్షో, రెండు లక్షలో ఇవ్వకపోతే ఎట్లా? ఉద్యోగం ఇప్పించిన వాడిని మనం ఆ మాత్రం ఆదుకోకపోతే ఎలా?" అన్నాడు వెంకట్రామయ్య.

వాళ్ళిద్దరలా మాట్లాడుకుంటుండగానే వెళ్దాంపదండి అని మా ఆవిడ వచ్చేసింది. ☆

దేవుళ్ళ కథ చెప్పిన రాంభట్ల

మూర్తి

కులమతాల గురించీ, దేవుళ్ళగురించీ వారి పుట్టుపూర్వోత్తరాల గురించీ గతంలో కొన్ని పుస్తకాలు వచ్చాయి. రాంభట్ల కృష్ణమూర్తిగారి వేల్పుల కథ యీ కోవలోకే వస్తుంది.

బౌద్ధ, జైన, లోకాయత, పూర్వమీమాంస, సాంఖ్య, వేదాంత, న్యాయ-వైశేషికములు భారతీయ తాత్విక దృక్పథాన్ని తెలిపే ప్రధానమైన వనరులు. వీటిలో వేదాంత, న్యాయ-వైశేషికములను వదిలివేస్తే మిగిలినవి నిరీశ్వరవాదం వైపుకే మొగ్గు చూపాయి. కాని ఈశ్వరవాదమే మనదేశంలో ప్రబలంగా వ్యాపించింది. నిరీశ్వరవాదం మరుగునపడింది. దేవుని జోలికి పోని బుద్ధుడిని తదనంతర కాలంలో దేవుడిని చేశారు. ఇదీ మనదేశ పరిస్థితి. దీనిని వివరించేటందుకే రాంభట్లగారు పూనుకొన్నారు.

"వేదాల్లో దేవుడే లేడు" (పే - 12) "... అయినా గుళ్ళు గోపురాలు దేవుళ్ళకు యీ దేశాన కొరత లేదు. ఇందుకు కారణం ఏమిటి?" (పే - 111) అన్న ప్రశ్న వేసుకుని దానికి సమాధానంగా రాంభట్ల వారు యీ పుస్తకాన్ని రచించారు. అయితే సూటిదనం, సమగ్రత లోపించిన యీ సమాధానం శాఖాచంక్రమణంగా తయారైంది.

''అన్న పుష్కలత్వం ఉన్నంతకాలం ఎవరికీ దేవుని అవసరం కానరాదు" (పే-37) అన్నది రాంభట్ల వారి అభిప్రాయం. "దేవుని అవసరం వ్యవసాయ సమాజంలో కలుగుతుంది" (పే-40) అని చెప్తూ "వేద సామాజికులు పశుపాలకులేగాని వ్యవసాయం వారెరుగరు" (పే-32) అని అంటారు. కనుకనే "వేదాల్లో దేవుడే లేడు"అని అనగలిగారు.

దేవుడు వున్నాడన్న విశ్వాసం మానవులలో కలగటానికి కారణం కేవలం అన్న మొక్కటేనా అన్న ప్రశ్న పాఠకులలో కలగకమానదు. దైనందిన జీవనంలో తనకు తారసిల్లే అనేకమైనవాటికి అంటే ఉరుములూ, మెరుపులూ, వానలు, వరదలు, దావానలం, జననమరణాలు వగైరాలకు కారణమైన మానవాతీత శక్తి ఏదో వున్నదన్న నమ్మకం మానవులకు కలిగింది. ఈ నమ్మకం నుంచే దేవుడు, దయ్యం తదితరాలు పుట్టుకొచ్చాయనీ, సమాజ పురోగమనంలో తత్సంబంధిత, తద్వ్యతిరేక భావాలు పెరుగుతూ వచ్చాయని పలువురు చెప్తారు. రచయిత యీ అభిప్రాయాన్ని త్రోసిపుచ్చదలచుకున్నట్లయితే దానిని సహేతుకంగా పూర్వపక్షం చేసి తన ఆలోచనలను వెల్లడించవలసి వుంది. కాని అందుకు సరైన ప్రయత్నం యీ గ్రంథంలో జరగలేదని చెప్పకతప్పదు. అదే విధంగా వేదాలలో దేవుడు లేడు అని చెప్పదలచుకున్నప్పుడు ఇంద్రాగ్నివరుణ వాయువులు తదితరులు ఎవరో ఏమిటో చర్చసాగాలి. "బైబిల్ దేవుని లాంటి వాడు భారతీయవరుణుడు. ఇద్దరికీ కాల్చిన నరమాంసం ఉదగరపెట్టాలి'' (పే-34) అని ఒకచోట రచయిత చెపుతాడు. యెహోవాను, వరుణుడిని దైవాలుగా భావించినందునే గదా యీ ఉడుగరపెట్టడం?

"వ్యవసాయం పశుపాలనలకు ఆద్యులు గణకాంతలు" (పే-73). ఇదే అభిప్రాయాన్ని మరికొన్నిచోట్ల కూడా (17, 37, 78) రచయిత వెల్లడిస్తాడు. "మహిళలు పెంచిపోషించిన మందలతోనే ఆర్యులు ఆలమందలను మ్లేచ్ఛులు అజావిగణాలను పెంచారు'' (పే-37). "పశుపాలనలో పశువులను మేపడం దగ్గరనుండి అన్నపచనం వడ్డన వరకు అన్ని పనులు పురుషులే చేసేవారు'' (పే-17) ఈ అభిప్రాయ ప్రకటనలో గందరగోళం వున్నదనక తప్పదు.

వేటలోని అనుభవం పశువుల పెంపకానికీ, కాయకసరులు ఏరటంలోని అనుభవం వ్యవసాయానికి దారితీసిందని, మొదటిది పురుషుల ద్వారా రెండవది స్త్రీలద్వారా వ్యాప్తిలోకి వచ్చిందని, వ్యవసాయంలో పశువులను ఉపయోగించడంతోపాటు స్త్రీ పురుషుల మధ్య ఏర్పడిన శ్రమ విభజన ఫలితంగా వ్యవసాయం కూడా పురుషుని చేతిలోనికి వెళ్ళిందని సాధారణాభిప్రాయం. ఈ అభిప్రాయాన్ని కాదనగలిగేంత బలం రాంభట్ల గారి వాదనలో కనిపించదు. ఆయనవి కేవలం కారణం చెప్పని నిర్ధారణలు మాత్రమే.

పురుషుడు వేటకు వెళ్ళి తాను సంపాదించిన ఆహారాన్ని తన గణంలోని అప్పచెల్లెళ్ళకు యిచ్చి వేటసమయంలో దొరికిన కూనలను మరోగణంలో వున్న తన భార్యకు యిచ్చేవాడని రచయిత చెపుతాడు. ఇక అప్పుడు "ఇంటిపక్కనే కర్రలతో కంచెకట్టి ఆ కంచెలో కూనల్ని పెంచేవారు గణకాంతలు. గుమ్మడి దోసలాంటి తీగకాయలను, దుంపలను ఇంటసరసనే పెంచేవారు గణకాంతలు. ఇలాగ ఇంటి దగ్గరే ఒక పక్క పెరటి వ్యవసాయం, మరోపక్క కంచె పశుపాలన సాగుతూ వుండేది'' (పే-16). ఈ రకంగా వ్యవసాయానికీ, పశుపాలనకు స్త్రీలు ఆద్యులయ్యారని రచయిత ఉద్దేశం. అయితే రచయిత ఉద్దేశం ప్రకారం యిది జంట మనువుల కాలంనాటి పరిస్థితి. కాని పశుపాలనకూ వ్యవసాయానికీ అంతకుముందే బీజాలు పడ్డాయి.

''గణ వివాహదశలో తల్లిదండ్రులెవరో పిల్లలకు తెలియదు. వారు ఎవరి పిల్లలో తల్లిదండ్రులకు తెలియదు" (పే-74). గుంపు వివాహాలు అమలులో వున్నప్పుడు పిల్లలకు తండ్రి ఎవరైనదీ తెలియకపోవచ్చు. కాని బిడ్డను నవమాసాలు మోస్తుంది కనుక తల్లికి తెలుస్తుంది. ఆ రకంగా బిడ్డను తల్లి, తల్లిని బిడ్డ గుర్తు పట్టడం జరుగుతుంది. జంతువుల్లో కూడా యీ లక్షణం కన్పిస్తుంది. కనుక తల్లి ఎవరో తెలియదనడం సబబుకాదు. ప్లేటో వూహించిన వ్యవస్థ ఆనాడు వుండేదని చెప్పలేము గదా!

"ఆర్య, ద్రావిడ అన్న యీ రెండు మాటలూ జాతివాచకాలే నన్న భ్రాంతి యూరోపీయ పండితులకూ, భారత పండితులకూ వుంది. నిజానికా మాటలు భాషా వాచకాలే కాని, జాతి వాచకాలు కాదు'' (పే-64). ఇలా అనుకోవడం రాంభట్లగారి భ్రాంతి తప్ప మరేమి కాదు. ఆర్య, ద్రావిడ శబ్దాలను భాషా వాచకాలు గానే చాలామంది పండితులు గుర్తిస్తున్నారు.

"సింధులో దెయ్యాలదిబ్బగా మారిన నగరం పేరు సుక్కూరు. నేను మాత్రమే ఆ పేరును ప్రస్తావిస్తున్నాను" (పే-61). రచయిత యిలా చెప్పడంలో ఉద్దేశమేమైనప్పటికీ దాదాపు ఏభైయేండ్ల క్రితమే స్టూవర్ట్ పిగోట్ అనే సుప్రసిద్ధ పురాతత్వవేత్త తన ప్రీహిస్టారిక్ ఇండియా (పే-39)లో సుక్కూరును ప్రస్తావించాడు.

ఈ పుస్తకాన్ని మొదటినుండి చివరివరకూ చదివిన తరువాత, ప్రజలు తమ అభీష్టం మేరకే చరిత్రను నిర్మించుకొంటారు గాబోలు అన్పిస్తుంది. గణదాయాలు పశుపాలనను పురుషులకు అప్పచెప్పారనడం, ప్రజలు రాజుకావాలని కోరుకోవడం యిలాంటి అభిప్రాయాన్ని కలిగిస్తుంది. రచయిత తన గ్రంథంలో మార్క్స్ పట్ల గౌరవాన్ని ప్రదర్శిస్తారు. ఆ మార్క్సే చరిత్ర నిర్మాణం గురించి యిలా చెపుతాడు.

"మనుషులు తమ చరిత్రను తామే నిర్మించుకుంటారు. కాని దాన్ని వారు తమ చిత్తం వచ్చినట్లు నిర్మించుకోరు; తాము కోరుకున్న పరిస్థితుల్లో కాక, తమకు తటస్థపడిన, గతంనుండి లభించిన, అందజేయబడిన పరిస్థితుల్లో దాన్ని వారు నిర్మించుకొంటారు".

మతంమీద పోరాటం చేయడమే నేటి తాత్విక కర్తవ్యమని చెపుతూ "ఆ కర్తవ్య నిర్వహణలో భాగంగానే ఇలాంటి చరిత్ర తవ్వకాలను నెత్తినెత్తుకొన్నాను" అని ముగింపులో రచయిత వివరణ యిచ్చారు. దురదృష్టవశాత్తూ ఆయన ప్రయత్నం ఆశించిన ఫలితాలను యివ్వగలిగేదిగా లేదు అని చెప్పవలసి వస్తున్నది. ☆

వేల్పుల కథ

రాంభట్ల కృష్ణమూర్తి

పేజీలు : 133, **వెల :** రు.50-00

ప్రతులకు : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్

స్వీకారం



విజయవాడ నగర కార్పొరేషన్ మేయరుగా రెండు సార్లు, అంతకుముందు మున్సిపాల్టీలో కౌన్సిలర్‌గా పలుసార్లు ఎన్నికయి ఆ రంగంలో చక్కటి అనుభవం కల్గిన టి.వెంకటేశ్వరరావు రచించిన ఈ గ్రంథం ఎంతో ఉపయోగకరం. మున్సిపల్ ఆక్ట్, కార్పొరేషన్ ఆక్టలలో కొన్ని ముఖ్యాంశాలను పరిపాలనలో నిర్వహిస్తున్న ప్రజాప్రతినిధులకు ప్రయోజనకరంగా వుండే వాటినిగా తెలుగులో రాయటమే గాక వాటి అమలులో ఎదురవుతున్న సమస్యలు, వాస్తవ స్వయం పరిపాలనా సంస్థలుగా అవి పని చేయలేని పరిస్థితులను విశ్లేషిస్తూ తెలియజేయడానికి ప్రయత్నించారు. అంతేగాక స్థానిక సంస్థలకు వరప్రదాయినిగా భావించిన 74వ రాజ్యాంగ సవరణ చట్టం, స్థానిక సంస్థల ఆర్థిక పరిపుష్టికి రాజ్యాంగం ఏర్పరిచి, మన రాష్ట్రంలో ప్రభుత్వంచే 1994లో నియమించబడిన ప్రథమ ఆర్థిక కమీషన్ 1997లో చేసిన సిఫార్సులు అవి అమలైన తీరు, పరిపాలనలో మరింత ప్రజాస్వామికంగానూ, వాస్తవ స్వయం పాలనకు వీలైననూతన విధానాన్ని మేయర్ ఇన్ కౌన్సిల్, ఛైర్మన్ ఇన్ కౌన్సిల్ విధానాల వివరాలను చేర్చడం జరిగింది.

ఆంధ్రప్రదేశ్‌లో మునిసిపాలిటీల, మునిసిపల్ కార్పొరేషన్‌ల కరదీపిక

రచన : టి.వెంకటేశ్వరరావు, **వెల:** రు.100, **ప్రతులకు :** విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు,

'కథా సాహిత్యంలో కొత్త మలుపు'



అశోక్‌కుమార్ దంపతులను సత్కరిస్తున్న డా॥ దాశరథి

'ఈ ప్రపంచం తగలబడి పోతున్నది. అందరూ తలోదారి వెళ్ళిపోతుంటే ఈ మంటలు ఆర్పుదాం రండి' అంటూ కేకలు పెట్టేవాడు ఈ *కాలం కవి, రచయిత. అతడే నిజమైన* మానవతా వాది. మానవీయ సంస్కృతిని కాపాడుకుంటూ..మనిషి బతికున్న రోజునే ఉనికి ఉంటుంది. వాదాలు ఎన్నుయినవ్వటికీ సామాన్యుడికి అందుబాటులో ఉండాలి. సామాన్యుడి శ్రేయస్సే సాహిత్యవాదం కావాలి. అందరినీ సంతోషంగా వుంచే సమతావాదమే ఈ రోజు కావాల్సి ఉంది. వాదం, ప్రాంతం, కులం, మతం వర్గం ఏదైనప్పటికీ ప్రపంచీకరణ పేరుతో ఒకే ఒక్క దేశం మిగతా ప్రపంచాన్ని వాడుక వస్తువుగా మార్చుతుండటాన్ని ఎదుర్కోవాలి. భిన్న వాదాలున్నప్పటికీ వస్తు వైవిధ్యం ఎంత ఉన్నప్పటికీ ప్రతి జిల్లాలో రచయితలు, కళాకారులు సమిష్టిగా ఒకే వేదిక మీద కలిసి పనిచేయాలని డాక్టర్ దాశరథి రంగాచార్య ఆకాంక్షించారు.

ఇటీవల విశాలసాహితి బి.ఎన్.రాములు కథా పురస్కారాలు-2001 బహూకరణ సభ కరీంనగర్ జిల్లా జగిత్యాలతో జరిగింది. ఈ సందర్భంగా బోయ జంగయ్య (బోజ కథలు), సింగమనేని నారాయణ (సింగమనేని కథలు), అంబల్ల జనార్దన్ (బొంబాయి కథలు), పి.చంద్ (భూ నిర్వాసితులు కథల సంపుటి, శేషగిరి నవల), కుప్పిలి పద్మ (ముక్త కథలు), పెద్దింటి అశోక్‌కుమార్ (వలస బతుకులు కథలు-ఎడారి మంటలు నవల)కు అవార్డులు బహూకరించారు. సభకు వివిధ ప్రాంతాలకు చెందిన రచయితలు హాజరుకాగా డాక్టర్ దాశరథి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రపంచీకరణను అన్ని భావాల కవులు, రచయితలు వ్యతిరేకించాలని, అమెరికాయే ఇప్పుడు ప్రపంచ ప్రజల ప్రథమ శత్రువని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా 'నూతన శతాబ్దంలో ఉత్తమసాహిత్యం ఎలా రాయాలి' అనే అంశంపై సింగమనేని నారాయణ (అనంతపురం) ప్రసంగించారు. 'రచయిత తాను జీవిస్తున్న ప్రాంతంలోని, కాలంలోని నిర్దిష్ట సమస్యలను పట్టించుకొని సాహితీకరించాలని, అదే ఈ శతాబ్దంలో రావాల్సిన ఉత్తమసాహిత్యంగా' ఆయన పేర్కొన్నారు.

గ్లోబలైజేషన్ వలన మనిషి ఒక వస్తురూపంలోకి మారుతున్నాడని, ఇంత దౌర్భాగ్య స్థితి మనిషి జీవితంలో ముందెన్నడూ లేదని ప్రముఖ సాహితీవేత్త ద్వానాశాస్త్రి ఆవేదన చెందారు. చివరికి మనిషే పరాయీకరణ చెందేలా వచ్చేసిన గ్లోబలైజేషన్‌పై దాడిచేసే మానవీయ సాహిత్యం ఇంకా ఇంకా రావాలని కోరారు. ఏ భావజాలం వారైనా ఇలా ఒక చోట కలుసుకోవడం ఒక గొప్ప సాహితీ మలుపుకు దారి తీస్తుందని ప్రముఖ రచయిత చంద్రశేఖర్ ఆజాద్ అన్నారు. స్త్రీవాద రచయిత్రి కుప్పిలి పద్మ మాట్లాడుతూ బాధలు పడ్డవారే తమ బాధలను గాథలుగా రాయడం వలన ఆ పాత్రలు సజీవంగా ఉంటాయన్నారు. ప్రముఖ రచయిత బోయ జంగయ్య మామూలు ఉపన్యాసం బదులు రసవత్తరంగా ఒక కథ చెప్పి సభను రక్తికట్టించారు. మరో రచయిత అంబల్ల జనార్దన్ బొంబాయి ప్రజల జీవన వైవిధ్యాలు తెలిసే విధంగా తాను బొంబాయి కథలు, నానీలు రాసినట్లు చెప్పారు. పి.చంద్ మాట్లాడుతూ జగిత్యాల నాలుగేళ్ళుగా కథల బడిగా మారిందనడానికి ఈ సభే నిదర్శనమన్నారు. పెద్దింటి అశోక్‌కుమార్ మాట్లాడుతూ ఇక్కడి అవార్డు గ్రహీతల్లో తక్కువ వయస్సు తనకే ఉందని, అవార్డు వచ్చినందుకు *ఎంతో ఆనందంగా* ఉందన్నారు.

దాదాపు వేయిమంది పాల్గొన్న ఈ సభలో మునిమడుగుల రాజారావ్ రచన 'అనాగరిక గేయం'. గోపగాని రవీందర్ రచన 'అంకురం' కవితా సంపుటిలను డాక్టర్ దాశరథి ఆవిష్కరించారు. ప్రముఖ సాహితీవేత్తలు కాలువ మల్లయ్య, జి.వై.గిరి. అన్నవరం దేవేందర్, వైశెట్టి రమణయ్య, కొక్కొల భాస్కర్, కె.వి.నరేందర్. రామలక్ష్మణ్. నల్లాల లక్ష్మీరాజం, దేవరశెట్టి జనార్దన్ మొదలగువారు పాల్గొన్నారు. ఈ సందర్భంగానే డెబ్బై మంది యువ రచయితలకు విశాల సాహితీ తరఫున దాశరథి, కుప్పిలి పద్మ, సింగమనేని చేతుల మీదుగా సన్మానం జరిగింది. ఈ సందర్భంగా బి.ఎస్.రాములు మాట్లాడుతూ ఇప్పుడు సత్కారం పొందుతున్న రచయితలు వచ్చే సంవత్సరం ఇదే వేదికపై తమ రచనలను అచ్చు పుస్తకాలుగా ఆవిష్కరించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

బి.ఎస్. రాములు జన్మదినాన్ని పురస్కరించుకొని నాలుగేళ్ళుగా ఇలాంటి కార్యక్రమం జరుగుతోంది. రాష్ట్రం నలుమూలల నుండి మంచి రచయితలను ఎంపిక చేసి వారిని సన్మానించడం జరుగుతోంది. ఇదే సమయంలో అవార్డు పొందిన వారిని దంపతులతో సహా సన్మానించడం కొత్త సాంప్రదాయం.

-కె.వి.నరేందర్

'చిన్నవయసులోనే ఉత్తమ ప్రతిభ'

చదువుతో పాటు కళారంగంపై మక్కువ పెంచుకొని అందరి ప్రశంసలు అందుకొంటున్నది రమాలేఖ్య. ఆదిలాబాద్ జిల్లా నిర్మల్ పట్టణానికి చెందిన రమాలేఖ్య చిన్నతనం నుండే కూచిపూడి నృత్యంపై ఆసక్తి కనపరిచి పట్టుదలగా నేర్చుకుంది. 13 సంవత్సరాల నాటికే కూచిపూడి, జానపద నృత్యాల్లో జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నది. 10వ తరగతి చదువుతున్న రమకు భీమన్న, ప్రశాంత్ గురువులు. పెద్దపల్లి, మెట్‌పల్లి, హైదరాబాద్‌ల్లో జరిగిన జూనియర్, సీనియర్ విభాగపు నృత్య పోటీల్లో ద్వితీయ, తృతీయ స్థానాలను కైవసం చేసుకుంది. 1997లో వేములవాడలో జరిగిన రాష్ట్రస్థాయి జానపద నృత్య పోటీల్లో సబ్ జూనియర్ విభాగంలో ప్రథమ స్థానం, జూనియర్ విభాగంలో ద్వితీయస్థానం, తిరుపతిలో జరిగిన రాష్ట్రస్థాయి శాస్త్రీయ నృత్య పోటీల్లో ద్వితీయస్థానం సాధించింది.

1998లో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన ఆల్ ఇండియా కల్చరల్ మీట్‌లో తృతీయ స్థానం. సంస్కారభారతి ఆధ్వర్యంలో జరిగిన అఖిల భారత నృత్యోత్సవంలో ద్వితీయ స్థానం పొందింది. చిలుకలూరిపేటలో జరిగిన జాతీయ స్థాయి నృత్యపోటీల్లో ద్వితీయస్థానం, 1999లో జరిగిన జానపద నృత్య పోటీల్లో ప్రథమస్థానం పొందింది. రమాలేఖ్యలోని మరో విశేషం ఏమిటంటే వాలీబాల్ క్రీడాకారిణి కావడం. ఉదయాన్నే వాలీబాల్‌ను, సాయంత్రం నృత్యాన్ని ప్రాక్టీస్ చేసే రమ క్రీడాపోటీల్లో కూడా అనేక బహుమతులు గెలుచుకున్నారు. 1998లో నిర్మల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో తమ జట్టు ప్రథమస్థానం, కడప జిల్లా పులివెందులలో జరిగిన పోటీల్లో ద్వితీయస్థానం సాధించడానికి రమాలేఖ్య మంచి కృషి చేశారు. గత ఏడాది ఫిబ్రవరిలో కలకత్తాలో జరిగిన అఖిలభారత పాఠశాలల స్థాయి క్రీడల్లో రాష్ట్రజట్టుకు ప్రాతినిధ్యం వహించింది. తన కుటుంబ సభ్యులతో పాటు గురువుల ప్రోత్సాహంతోనే తాను ఈ రెండు రంగాల్లో రాణిస్తున్నానని తెలిపింది. భవిష్యత్తులో రమాలేఖ్య మరిన్ని విజయాలు సాధించాలని ఆశిద్దాం.

-మహ్మద్ ఉస్మాన్, (ఆదిలాబాద్ టౌన్)

ఆనాడు గన్నవరంలో సి.పి.ఎం. చౌకడిపోలు

యు.రామకృష్ణ

"అదిగో వచ్చేస్తోంది, ఆ లారీయే" అరిచారెవరో, అంతే! అందరూ రోడ్డుకడ్డంగా నిలబడ్డారు. పై గ్రామం నుండి సమాచారం అందుకున్న కార్యకర్తలు క్షణంలో స్పందించి ఆ రోడ్డు దగ్గరకు చేరారు. సుమారు 500 మంది కార్యకర్తలు ఆ లారీ కోసమే ఎంతో సేపటి నుండి ఎదురు చూస్తున్నారు. లారీ వారి ముందుకొచ్చి నిలిచిపోయింది. అడ్డంగా ఉన్న జనంలోంచి ఓ కార్యకర్త ముందుకొచ్చి లారీని రోడ్డు పక్కగా నిలపమని డ్రైవర్‌ను కోరాడు. డ్రైవర్ అలాగే చేసి అందులో కూర్చున్న వ్యాపారితోసహా కిందకు దిగాడు. వారికేమీ అర్థంకాలేదు. ఒకరి మొహాలు మరొకరు చూసుకున్నారు. వారిద్దరినీ కార్యకర్తలు అల్లంత దూరంలో చెట్టుకింద వేసిన కుర్చీల్లో కూర్చోబెట్టారు. ఆవరించిన నిశ్శబ్దాన్ని చీలుస్తూ ఒక కార్యకర్త గొంతు విప్పారు.

" చూడండి, మేము మీ మీద దౌర్జన్యం చేసి ధాన్యం బస్తాలు దోచుకుపోవడానికి రాలేదు, మీరు ఈ లారీలో తీసుకుపోతున్న వందలాది బస్తాల్లో ఒక పాతిక బస్తాలు ఖరీదుకు మాకు ఇవ్వండి. 25 బస్తాలకూ ధర చెల్లిస్తాం, వాటిని మేం మర ఆడించి కూలి పనులు దొరకని పేదలకు కిలో బియ్యం రూపాయికి అందజేస్తాం !"

ససేమిరా కుదరదన్నాడా వ్యాపారి.

"మీ ధాన్యం మొత్తాన్ని మేమడగటంలేదు. పనుల్లేని కూలీలకు తక్కువ ధరకు బియ్యం అమ్మించేందుకు మిమ్మల్ని ఖరీదుకే పాతిక బస్తాలడుగుతున్నాం. మీరు ఒప్పుకుంటే సరి, లేకపోతే మీకు ధర చెల్లించి మాకు అవసరమైనన్ని బస్తాలు దింపుకుంటాం" చెప్పాడా కార్యకర్త.

ఎలా తీసుకుపోతారో చూస్తానన్నాడా వ్యాపారి.

వ్యాపారి ముందే కార్యకర్తలు లారీ ఎక్కి తమ కవసరమైన పాతిక బస్తాలను కిందకు దింపడం ప్రారంభించారు. దీనితో వ్యాపారి షడన్‌గా లేచి అటుగా వెళ్తున్న వాహనం ఎక్కి పోలీసులకు ఫిర్యాదుచేయడానికి వెళ్లాడు. పావుగంటలో పోలీసులు అక్కడికి వచ్చి వాలారు. ప్రతి పోలీసు చేతిలోనూ తుపాకీ ఉంది. దీనితో కార్యకర్తలు కూడా ఆ పక్కనే పొదల్లో దాచిపెట్టిన కర్రలను బయటకు తీయకతప్పలేదు. ఇరు పక్షాలూ ఎదురెదురుగా మోహరించాయి. ఎస్.ఐ. చిన్న సైజు మైకును అందుకని "ఇంకో పావుగంటలో ఎటువాళ్ళు అటు వెళ్ళిపోతే సరి, లేకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుంది" అంటూ హెచ్చరించాడు.

"ఆకలితో నకనకలాడే పేదలకు సరసమైన ధరకు బియ్యం అందించేందుకు మాత్రమే మేము ఈ ధాన్యాన్ని అమ్మమంటున్నాం. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరనే చెల్లిస్తామంటున్నాం. ఇందులో మేము దోచుకుపోతున్నదేముంది.'' తొణక్కుండా, బెదరకుండా చెప్పారా కార్యకర్తలు.

''సరే, ఈ విషయం కూర్చొని చర్చిద్దాం. అంత వరకూ బస్తాలు దింపకండి" పోలీసులు ఓ ప్రతిపాదన పెట్టారు.

చర్చలు జరిగాయి. ప్రభుత్వ మద్దతు ధరకు కార్యకర్తలు ధాన్యాన్ని కొనుగోలు చేశారు.

★ ★ ★

ఈ సంఘటన 1970 సంవత్సరం డిసెంబర్‌లో కృష్ణాజిల్లా గన్నవరం తాలూకా కేసరపల్లి గ్రామం వద్ద ఐదవ నెంబర్ జాతీయ రహదారిపై జరిగింది. ఆ రోజుల్లో గన్నవరం తాలూకాలో జరుగుతున్న ఆందోళనలో అదొక సంఘటన మాత్రమే. తాలూకా అంతటా సిపిఎం ఆధ్వర్యంలో ధాన్యాన్ని ప్రొక్యూర్‌చేసి గ్రామ గ్రామానా చౌకడిపోలను ఏర్పాటుచేసి కిలో బియ్యం రూపాయికి అమ్మించారు. ఆనాడు గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో మొత్తం ప్రభుత్వ చౌకడిపోలు 41 ఉండేవి. ఈ డిపోల్లో ప్రభుత్వం కిలో బియ్యం రూపాయి పావలాకి అమ్మిస్తుండేది. కరువు పరిస్థితులేర్పడి పనుల్లేక ఆకలితో అలమటించి పోతున్న వ్యవసాయ కార్మికులు, గ్రామీణ పేదలు రూపాయి పావలాకు కూడా బియ్యం కొనలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ పరిస్థితుల్లో సిపిఎం గన్నవరం డివిజన్ కమిటీ భూస్వాముల నుండి ఎకరాకు ఒక బస్తా ధాన్యం చొప్పున ఉచితంగా వసూలు చేయాలని, అలాగే అక్రమంగా ధాన్యం నిల్వచేసిన వారి నుండి, వ్యాపారుల నుండి కూడా ప్రభుత్వ మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయాలని, ఆ విధంగా పనులు లేని అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలల్లో వ్యవసాయ కూలీలను, గ్రామీణ పేదలను ఆదుకునేందుకు ప్రొక్యూర్ చేసిన ధాన్యాన్ని మర ఆడించి లాభం లేని రీతిలో బియ్యం అందజేయాలని నిర్ణయించింది. గన్నవరం నియోజకవర్గంలో ప్రభుత్వ చౌకడిపోలు 41 ఉండగా, దానికి సమాంతరంగా సిపిఎం ఆధ్వర్యంలో కూడా 39 చౌకడిపోలను ఏర్పాటుచేశారు.



నాటి రైతాంగ, కూలి పోరాటాలలో పాల్గొన్న ఆత్కూరు సి.పి.ఎం. వాలంటరీ దళం. వారి మధ్య ఆ ఉద్యమాలకు నాయకత్వం వహించిన అట్లూరు శ్రీమన్నారాయణ

ప్రభుత్వం తాను ఏర్పాటుచేసిన చౌకడిపోల్లో కిలో బియ్యం రూపాయి పావలాకు అమ్మిస్తుంటే, సిపిఎం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన డిపోల్లో కిలో బియ్యం రూపాయికే అమ్మించారు. సిపిఎం ఏర్పాటుచేసిన చౌకడిపోలు పనుల్లేక ఇబ్బందులు పడుతున్న వ్యవసాయ కార్మికుల కోసం ఉద్దేశించినా, ఆ తరువాత ఆయా గ్రామాల్లో అన్ని సామాజిక తరగతులకు చెందిన పేదలందరికీ చౌకధరకు బియ్యం అందజేశారు. దీంతో ప్రభుత్వ డిపోలు వెలవెలబోయాయి. ప్రభుత్వ డిపోలకు వెళ్ళి ఆయా గ్రామాల్లో ఒక్క వ్యక్తి కూడా బియ్యం కొనుగోలు చేయకపోవడంతో ప్రభుత్వం ఆ మూడు నెలలకాలం తమ డిపోలను మూత వేసుకోవాల్సి వచ్చింది. అయితే సిపిఎం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చౌకడిపోలు మాత్రం నిత్యం కళకళలాడుతూ కూలిజనంతో కిటకిటలాడుతుండేవి.

కనుకనే ఆనాడు సిపిఎం ఏర్పాటుచేసిన చౌకడిపోల గురించి ప్రముఖ పత్రికలు పతాక శీర్షికలు పెట్టి వార్తలు ప్రచురించాయి. 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్', 'ది హిందూ' పత్రికలు 'గన్నవరంలో సిపిఎం పోటీ ప్రభుత్వం' అంటూ శీర్షికలు పెట్టి ఆరోజుల్లో పతాక వార్తలు ప్రచురించింది. ఆంధ్రప్రభ దినపత్రిక ఏకంగా సంపాదకీయమే రాసింది. ఒక చిన్న పార్టీ 39 గ్రామాల్లో చౌకడిపోలు పెట్టి కిలో బియ్యం రూపాయికి అమ్మిస్తుంటే, ప్రభుత్వానికి అలా అమ్మించడం చేతగాకపోవడాన్ని ఎద్దేవా చేసింది. ఇప్పటికైనా ఆవిధంగా బియ్యం అమ్మించగలరా అని ప్రశ్నలు వేసింది.

★ ★ ★

గన్నవరం నియోజకవర్గంలో సిపిఎం ఇలా చౌక డిపోలను మూడు నెలల కాలం నిర్వహించగలిగిందంటే,

చాలా గ్రామాల్లో రైతుకూలీ ఐక్యత ఎంతగానో తోడ్పడింది. కొన్ని గ్రామాల్లో భూస్వాములు, ధనిక రైతుల నుండి తీవ్ర స్థాయిలో ప్రతిఘటన ఎదురైనా వాటిని విజయవంతంగా తిప్పికొట్టింది. కూలీలపట్ల ఏర్పాటుచేసుకున్న చులకనభావం, వారికి కూలి ఇచ్చే విషయంలో లొల్లు చేయడం వంటి విషయాన్ని రైతుల్లో సిపిఎం చాలా గ్రామాల్లో ఆనాడు చైతన్యం తీసుకురాగలిగింది. ఇందుకు పార్టీ ఇబ్బందులను కూడా ఎదుర్కొంది. నియోజకవర్గంలో ఈ ప్రయోగానికి మొట్టమొదటగా ఆత్కూరులో అంకురార్పణ చేశారు. నాడు సిపిఎం డివిజన్ కార్యదర్శిగా ఉన్న అట్లూరు శ్రీమన్నారాయణ సారధ్యంలో మధ్య తరగతి, చిన్న, సన్నకారు రైతులకు చేపట్టిన అనుభవ పూర్వకమైన అధ్యయనం కూలి సమస్య పరిష్కారానికి, రైతు కూలీ ఐక్యతకు ఎంతగానో తోడ్పడింది.

"ఏరా, ఏంటలా పొద్దుకేసి చూస్తున్నావ్, ఇంకా గంట పొద్దుంది. ఒళ్ళు వంచి పనిచేయకపోతే డబ్బులెలా వస్తాయిరా?" గట్టుమీద కూర్చున్న ధనిక రైతు సణుగుడది.

"బలేటోరే, పొద్దుట్నించి వంచిన నడుం ఎత్తకుండా పని చేత్తున్నాం, మేమేమైనా యంత్రాలమా? నడుం నొప్పిగా ఉంటే ఓసారి లేచి నిల బడ్డాను. ఇందులో ఒళ్ళు దాచుకున్నదేముంది బాబయ్యా" ఓ కూలీ వేదన ఇది.

" మీకిచ్చే రూపాయిన్నర కూలి శుద్ధ దండగ, అర్ధరూపాయికోసి ఇస్తేగాని తెలియదురా పని విలువ ఏంటో"

"మాలాంటోరి కట్టాలు మీలాంటోరు గుర్తించకుంటే మా బతుకులు కట్టం బాబయ్యా! మేం చేత్తున్న చాకిరికి రూపాయిన్నర ఏమూలకూ చాలదు. రెండు రూపాయలిత్తే మాకు గిడుద్ది'

" ఓ యబ్బో, చాలా ఉందే ఆశ, అసలు మిమ్మల్ని కూలికి పిలవడం నాది బుద్ధి తక్కువ" ఆ కాలంలో రైతు, కూలీల మధ్య ఈ విధమైన పరిస్థితులు కొనసాగుతుండేవి.

కూలీలు తమ కష్టాలను పార్టీకి చెప్పుకునేవారు. పార్టీ ఈ విషయాలను రైతులకు ఓర్పుగా నచ్చచెప్పేది. కూలీలపై కోపంతో తామే వరికోత కోసుకున్న రైతులు తాము పంటను నష్టపోయిన తీరును కార్యకర్తలు ఆ రైతులకు ఓపిగ్గా వివరించేవారు. ఒక ఎకరం వరికోతను 10 మంది కూలీలు కోస్తారు. కూలి రూపాయిన్నర ఉంది. అర్ధరూపాయి చొప్పున పెంచితే వీరందరిపై రైతుకు అదనంగా ఐదు రూపాయలు ఖర్చవుతాయి. కానీ అదనపు కూలి అడిగారనే కోపంతో కూలీలను పిలవకుండా రైతులే వరికోత కోసుకుంటే, రైతు ఎంతమేరకు నష్టపోయేదీ కార్యకర్తలు లెక్కలుగట్టి రైతులకు చెప్పేవారు. వ్యవసాయ కూలి మాదిరిగా రైతు వరికోత కోయలేదు. కూలీ మాదిరిగా నడుం వంచి పనిచేసే అలవాటు లేకపోవటం, వరిని పైపైన కోయడం వల్ల వరిగడ్డి ఎంతో నష్టపోవాల్సి వచ్చేది. అక్కడక్కడా వరి దుబ్బులు కూడా వదిలి పెట్టడం జరుగుతుంది. ఈ విధంగా వదిలి పెట్టిన వరిదుబ్బులకున్న ధాన్యాన్ని దులిపితే రెండు బస్తాలయ్యేవి. బస్తా ధర 37 రూపాయలు ఉండేది. రెండు బస్తాలకు 84 రూపాయలు, గడ్డితో కలిపి 100 రూపాయలు నష్టపోయేవారు. దీనితో పోల్చితే కూలీలకు ఇచ్చే ఐదు రూపాయల అదనపు కూలి ఏపాటి అని కార్యకర్తలు వివరించినప్పుడు రైతులు అనుభవ పూర్వకంగా తమకు జరిగిన నష్టాన్ని అర్ధం చేసుకునేవారు. కూలీల పోరాటాలకు అండదండలిచ్చేవారు.

★ ★ ★

ఈ విధమైన రైతు-కూలీ ఐక్యతే ఆ తర్వాత భూస్వామ్య వ్యతిరేక పోరాటానికి దారితీసింది. ఈ పోరాటాల్లో రైతులూ, వ్యవసాయ కూలీలు భుజంభుజం కలిపి పనిచేశారు. ఈ పట్టుతోనే సి.పి.ఎం. ఆగ్రామంలోని భూస్వాములను, ధనిక రైతులను సమావేశపరచి, పనుల్లేని వ్యవసాయ కూలీలను ఆదుకోవడానికి తమ వంతుగా ఎకరానికి ఒక బస్తా ధాన్యం చొప్పున విరాళంగా అందజేయాలని కోరింది. ఆ సమావేశానికి 70,80 మంది వరకు రైతులు వచ్చారు. సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ నెలల్లో పూర్తిగా పనుల్లేక అల్లాడి పోతున్న కూలీల కుటుంబాలు ఆత్కూరు గ్రామంలో వెయ్యిదాకా ఉండేవి. ఈ రైతులందరి నుండి ఎకరానికి ఒకబస్తా చొప్పున వెయ్యిబస్తాల ధాన్యం ఇవ్వడం భావ్యం అని అడిగారు. 10 ఎకరాలకు పైన పొలం ఉన్నవారి వద్ద నుండి రెండు బస్తాల చొప్పున సేకరిస్తే 800 బస్తాల ధాన్యం అవుతుంది. పెద్ద రైతులందరూ సుమారు 400 బస్తాల ధాన్యాన్ని విరాళంగా ప్రకటించారు. దీనితో సమావేశానికి రాని మిగతా రైతులను కూడా పిలిచి ధాన్యం అడగాలని నిర్ణయించారు. మిగిలిన రైతులు కూడా ధాన్యం ఇస్తే వెయ్యి బస్తాల సేకరణ పూర్తవుతుందని పార్టీ కార్యకర్తలు భావించారు. ఇక ఆనాటికి సమావేశం ముగిసింది. సమావేశం నుండి ఇంటికి వెళ్ళి మంచం మీద నడుం వాల్చారో లేదో ఈ కార్యక్రమానికి నాయకత్వం వహిస్తున్న అప్పటి సి.పి.ఎం. డివిజన్ బాధ్యులూ, ఆగ్రామ సర్పంచ్ కూడా అయిన అట్లూరి శ్రీమన్నారాయణను పోలీసులు అరెస్ట్ చేశారు. రైతులకు అధ్యక్షుడుగా ఉన్న ఓ 50 ఎకరాల భూస్వామి కుదరవల్లి నాగేశ్వర రావు సమావేశానికి రాకుండా చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు వచ్చి కామ్రేడ్ శ్రీమన్నారాయణను అరెస్ట్ చేశారు. అంతకు ముందు ఊళ్ళో కూలి సమ్మె జరిగింది. రైతుల పక్షాన కుదరవల్లి నాగేశ్వరరావు, కూలీల పక్షాన అట్లూరి శ్రీమన్నారాయణ సమ్మె సందర్భంగా పొలాలవద్ద తమతమ బలాలతో మోహరించాల్సి వచ్చింది. పొలాల వద్ద ఉభయ పక్షాల మధ్య [illegible] విషయం తెలుసుకున్న డి.ఎస్.పి. క్షణాల్లో తమ బలగాలతో అక్కడకు చేరుకున్నారు. ఆయన ఉభయ పక్షాల నాయకులతోనూ చర్చలు జరిపి, చివరిగా ఒక అంగీకారాన్ని కుదిర్చారు.

"ఎవరైనా సరే సమ్మె అక్కరలేదు. కూలికి వెళ్ళాలనుకున్నవాళ్ళు పొలంలోకి వెళ్ళొచ్చు. అలాంటి వారిని ఎవరూ అడ్డగించటానికి వీల్లేదు. ఎవరైనా సరే" అంటూ డి.ఎస్.పి. కూలీలను కోరాడు. అయితే ఏ ఒక్క కూలీ కూడా పొలాల్లోకి వెళ్ళేందుకుముందుకు రాలేదు. డి.ఎస్.పి మరోమారు అడిగారు. అయితే ఈసారి బండ ముత్యాలు అనే వ్యవసాయ కూలి పొలంలోకి వెళ్ళేందుకు ముందుకు వచ్చాడు. అయితే ముత్యాలు తప్ప ఒక్కరుకూడా పొలంలోకి వెళ్ళడానికి ముందుకు రాలేదు.

దీనితో డి.ఎన్.పి. భూస్వాములను మందలించి "కూలీలు కోరిన కూలి చాలా సబబు, వారడిగింది ఎకరానికి ఐదు రూపాయలు. ఎందుకు పంతాలు. ఆవిధంగా కూలిచ్చి కలిసిమెలిసి పనిచేసుకోండి" అని చెప్పి వెళ్ళిపోయాడు.

దీనితో అహం దెబ్బతిన్న భూస్వామి నాగేశ్వరరావు సమయం కోసం ఎదురు చూస్తూ ప్రస్తుతం రైతులనుండి ధాన్యం సేకరించే పద్ధతిని వక్రీకరించి, తనను ధాన్యానికై బెదిరించారని కేసు పెట్టడంతో అట్లూరి శ్రీమన్నారాయణను అరెస్ట్ చేశారు. దీనితో ఆ కార్యక్రమానికి తాత్కాలికంగా అంతరాయం కలిగింది. మళ్ళీ అట్లూరి బెయిల్‌పై విడుదలై వచ్చిన తర్వాత ఆ ఉద్యమం ఊపందుకుంది. గ్రామ పార్టీ శాఖలు ఎక్కడికక్కడ కదిలి పెద్ద రైతులనుండి, వ్యాపారులనుండి ధాన్యాన్ని ప్రొక్యూర్ చేసి, వాటిని మర ఆడించి ఆ బియ్యంతో మూడు నెలలపాటు చౌక డిపోలను ఏర్పాటుచేశాయి. ఈ డిపోలు ఆ కరువుకాలంలో దిగ్విజయంగా నడిచాయి. 'దిహిందూ', 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్', 'ఆంధ్రప్రభ' వంటి పత్రికలు ప్రశంసలను బట్టే ఆ కార్యక్రమం ఎంత దిగ్విజయంగా జరిగిందీ ఊహించుకోవచ్చు. ☆

కొండబాబు

అపరంజిబొమ్మ

"ఏదొకటి ఇవాళా రేపట్లో చెప్పాలి. లేకపోతే ముహుర్తాలు అయిపోతాయి. మామయ్యోళ్ళు తొందర పడుతున్నారు" సావిత్రమ్మ అంది ఎదురుగా కూర్చున్న కొడుకుతో.

సారధి మాట్లాడలేదు.

"బాబూ.. చెప్పవేరా? నీ అభిప్రాయం చెప్పు" సారధి పక్కనే కూర్చున్న అతడి అక్క శివబాల నొక్కి అడిగింది.

"కొడుకు ఏం చెపుతాడా?" అని వరండాలో కూర్చొన్న పరశురామయ్య చెవి ఒగ్గి ఉన్నాడు.

"ఏం చెప్పను? ఇంతకు ముందే చెప్పానుగా.. నేను ఆ అమ్మాయిని చేసుకోను" అన్నాడు సారధి తలదించుకునే. తల్లీ, తండ్రీ, అక్క వాళ్ళు చేస్తున్న వత్తిడి అతడికి ఇబ్బందిగా ఉంది. అయిన వాళ్ళని మామయ్య కూతుర్ని చేసుకోమంటున్నారు. తనకిష్టం లేదు. అమ్మా వాళ్ళు వత్తిడి పెరుగుతోంది. తను గట్టిగా చెప్పలేకపోతున్నాడు. వాళ్లు తన ఫీలింగ్స్ అర్థం చేసుకోరు.

"ఏరా..., ఎందుకని?.." బాధగా, కోపంగా రెట్టించింది సావిత్రమ్మ.

"ఆ పిల్లకి ఏమైందిరా.. అపరంజి బొమ్మలా ఉంటుంది. మామయ్య వాళ్ళు అంత లేనోళ్ళేం కాదు... బాగానే ఇస్తారు.." శివబాల చెప్పుకుపోతోంది. సారధి మధ్యలోనే కట్ చేశాడు విసుగ్గా.

"ఎన్ని సార్లు చెప్పాలి మీకు? ఆ అమ్మాయి బాగుండదని ఎవరన్నారు? ఆ అమ్మాయి చదువు కేవలం క్లాసుపుస్తకాలకే పరిమితమైన చదువు. నాకు అలా ఇష్టం ఉండదు. నా ఆలోచన్లు ఆ అమ్మాయికి అర్థంకావు. నా బాధ మీకు అర్థం కాదు.. భార్యంటే అందంగా ఉంటే సరిపోతుందా? భర్తంటే సంపాయించే వాడయితే చాలా? చుట్టూ ఉన్న ప్రపంచం గురించి ఆలోచనలు, ఆలోచనలు పంచుకోడాలు అక్కర్లేదా?" అన్నాడు కోపంగా.

కొడుకు చేప్పేది తనకే సరిగా అర్దం కాలేదు. ఎలా ఒప్పించాలో తోచలేదు సావిత్రమ్మకు.

★ ★ ★

ఇలాంటి సంధర్భాలు, సంఘటనలు తెలుగునాట చాలా ఇళ్ళలో జరుగుతూ ఉంటాయి. జరుగుతూనే ఉన్నాయి. సరే, ఇదికాదు ప్రస్తుతం చర్చ. సారధి అక్క శివబాల మాటలు ఒక్కసారి చదవండి. ఆవిడ 'అపరంజి' అనే పదం వాడింది. అదీ అంశం.

చాలా సందర్భాల్లో ప్రధానంగా పెళ్ళి లాంటి ఫంక్షన్లలో అందమైన ఆడపిల్లలను గురించి చెప్పేటప్పుడు అపరంజి బొమ్మ, కుందనపు బొమ్మ అనే పదాలు పెద్దవాళ్లు వాడుతుంటారు. సినిమాలు, నాటకాలు, ప్రస్తుతపు టివి సీరియల్స్‌లోనైతే ఇలాంటి సన్నివేశాలు కుప్పలు తెప్పలు. కాబట్టి-అలాంటి సందర్భాల్లో ఈ పదాల వాడుక ఎక్కువే.

సాధారణంగా ఆయా పదాల అర్థం తెలియకపోవచ్చు గానీ, ఆయా సందర్భాల్లో వాడుకను బట్టి దాని భావం అర్థం చేసుకోవచ్చు. అలాగే 'అపరంజి' అనే పదానికి సూటిగా అర్థం తెలియకపోయినా 'అందమైన దాని'కి ఉపమానంగా ఉపయోగిస్తున్నాం కాబట్టి-అలాంటి అర్థాన్నే గ్రహిస్తుంటారు.

మరి 'అపరంజి' అంటే ఏమిటి? అనేది తెలుసుకోవాల్సి ఉంది.

తెలుగు నిఘంటువులు ఈ పదానికి 'మేలిమి బంగారము', 'కుందనము' అనే అర్థాన్నిచ్చాయి. కుందనము అన్నా బంగారమే. అంటే అందమైన ఆడపిల్లలను 'అపరంజి బొమ్మ' అనడంలో ఉద్దేశం 'బంగారు బొమ్మ' అని వారి సౌందర్యం గురించి చెప్పడం. లోహాల్లో బంగారాన్ని అత్యుత్తమంగా చూస్తారు గాబట్టి, అంత అత్యుత్తమమైనదని అర్థం.

సరే, ఈ 'అపరంజి' ఎలా ఉద్భవించినది? అనేది ప్రశ్న. చాలా మంది ఇది సంస్కృత పదమని చెప్తారు. మరికొందరు తెలుగు పదమంటారు. కాని కాదు.

'అప్‌రంజ్' అనే ఉర్దూ పదమిది. ఉర్దూలో 'అపరంజ్' అంటే బంగారమే, ఉర్దూకి కూడా సొంతం కాదిది. 'అపరంజ్' అనే పారశీక పదమే ఉర్దూ వాడక అయింది. దేశంలోనూ, తెలుగునాట మహ్మదీయుల పాలన ఆరంభమైన నాటి నుంచి ఈ మాట ప్రాచుర్యంలోకి వచ్చింది. ఆనాడు వర్తకంలో బంగారం మారకంగా ఉండటం, సామాన్యుడి నుంచి ప్రభువుల వరకూ బంగారం పట్ల వ్యామోహం కలిగి ఉండటం, మహ్మదీయ పాలకుల ప్రభావం మెండుకావడం.. తదితర కారణాల రీత్యా బంగారానికి పర్యాయంగా 'అపరంజ్' మారింది. అదే 'అపరంజి'గా రూపాంతరం చెంది దేశీయమయింది.

"అపుడతి రయమ్మునంబన్నీ
రపరంజి పసిండిగిండి యందుకొని..",
పట్టెనే వంశమపరంజి గట్టుమీద.." - ఇలా మధ్యయుగ కవులు ఈ పదాన్ని తెలుగుగా గ్రహించారు కూడా. అందుకే ఇంతటి ప్రాచుర్యం. ఇక 'అపరంజి బొమ్మ' అనేది ఎలాగొచ్చిందో పెద్దగా చర్చ అనవసరమేమో. కొండపల్లి బొమ్మ, బాపూబొమ్మ ఎలాగొచ్చాయో దాదాపు అంతే! ☆

పాఠక స్పందన

హృదయాలను కలచివేసిన కవర్ స్టోరీ

16-9-2001 ఆదివారం అనుబంధంలోని కవర్ స్టోరీ 'న్యూయార్క్ వాసుల బ్రతుకుల్లో ఉషోదయాన గాఢాంధకారం' చదువుతున్నంత సేపూ హృదయాలను కలిచివేసింది. ఈ దురాగతానికి కారకుడని భావిస్తున్న అంతర్జాతీయ తీవ్రవాది ఒసామా బిన్ లాడెన్‌ను పట్టుకుని కఠినంగా శిక్షించాలి. ఆఫ్ఘనిస్తాన్‌పై అమెరికా దాడితో సమస్య పరిష్కారం కాదు. ప్రశాంతంగా ఆలోచించి సమస్యకు పరిష్కారం కనుగొనాలి. కార్టూన్ కదంబం కడుపుబ్బ నవ్వించింది.

- బట్టా రామకృష్ణ, సౌత్ మోపూరు, నెల్లూరు జిలా

డాక్టర్ సలహాలు బాగుంటున్నాయి

డాక్టర్ సలహాలు శీర్షిక బాగుంటోంది. సెప్టెంబర్ 16వ తేదీ కవర్ స్టోరీ చాలా వివరంగా తెలియజేశారు. బాలనేస్తాలు శీర్షిక ఆసక్తిగా ఉంటోంది. బాలవికాసం టూరిస్ట్ గైడ్ బాగుంటున్నాయి.

- పి.ఎస్.ఎస్.కిరణ్, రామచంద్రాపురం

మంచిమాష్టారు కథ బాగుంది

సెప్టెంబర్ 9వ తేదీ ఆదివారం అనుబంధంలో ప్రచురించిన బాలల కథ 'మంచిమాష్టారు' మమ్మల్ని ఎంతగానో ఆనందపరిచింది. పెండెం జగదీశ్వర్ గారికి అభినందనలు. ఆరోగ్యమైన కళ్ళతో అందమైన ప్రపంచం ఎంతో ఉపయోగకరంగా వుంది.

- ఎస్.శ్రీదేవి, డా॥ ఎస్.సి.రావు, మల్లంపేట

మనలో మాట బాగుంది

సెప్టెంబర్ 9 ఆదివారం అనుబంధంలో మనలో మాట బాగుంది. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే అవినీతికి నిదర్శనంగా వున్నాయి. కార్టూన్స్ బాగుంటున్నాయి. తెలుగు వారి కీర్తిని ఇనుమడింప చేసిన చిన్నారులు హంపి, హరికృష్ణలకు హాట్సాఫ్. కాలం చిందులు కథ వాస్తవానికి దగ్గరగా వుంది. కళాసాహితిలో 'కూరగాయలతో కళాకృతులు' బాగుంది. రియల్ స్టోరీ చదువుతుంటే కంటనీరు వచ్చింది.

- పి.కిషోర్, శృంగవృక్షం, ప.గో.జిల్లా

ప్రగతిపథంలో మదనపల్లె పురపాలక సంఘము

1-4-2000 నుండి చేపట్టిన అభివృద్ధి పనులు

1.) రు. 36.00 లక్షల వ్యయంతో రోడ్లు వేయడం జరిగినది. 2) రు. 4.40 లక్షల వ్యయముతో కాలువలు నిర్మించడం జరిగినది. 3) రు. 2.10 లక్షల వ్యయముతో ఒక క్లాసు రూము నిర్మించడం జరిగినది. 4) రు. 2.06 లక్షల వ్యయముతో హిందూ బరియల్ గ్రౌండ్‌లో షెడ్లు వేయడం జరిగినది. 5) రు. 1.30 లక్షల వ్యయముతో పరిసరాల అభివృద్ధి పథకం క్రింద 1 రోడ్లు 1 వైపు లైను పనిని చేపట్టడం జరిగినది. 6) చిన్న మరియు మధ్య తరహా అభివృద్ధి పథకం క్రింద రు. 80.00 లక్షల వ్యయంతో షాపింగ్ క్లాంపెక్సులు, టౌన్ హాలు, బ్రిడ్జి జంతు వధశాల నిర్మాణం పనులు చేపట్టడం జరిగినది. 7) రు. 110.00 లక్షల అంచనాతో వారపు సంతలో స్టాల్సు, షాపు రూములు రు. 59.00 లక్షల అంచనాతో ఆఫీసు కాంప్లెక్సు పనులు చేపట్టుటకు చర్యలు గైకొనబడినవి. 8) కరువు నివారణ పథకం క్రింద 39.00 లక్షలతో నీటి సరఫరా పనులు చేపట్టడం జరిగినది. 9) రు. 25.00 లక్షల అంచనాలతో ఎస్.జె.ఎన్.ఆర్.వై / ఎన్.ఎస్.డి.పి. పథకంల క్రింద పనులు చేపట్టుటకు చర్యలు గైకొనబడినవి. 10) పట్టణంలో ప్రజలకు మౌళిక సదుపా[illegible]ములు కలుగజేయుటకు రు. 1263.00 లక్షలు మంజూరు చేయవలెనని మరియు నీటి సరఫరా కొరకు రు. 958.00 లక్షలు మంజూరు చేయవలెనని ప్రభుత్వమునకు ప్రతిపాదనలు పంపడమైనది. 11) పట్టణ ప్రజల ఆరోగ్య దృష్ట్యా ప్రతి రోజు 132 కి.మీ. కాలువలు, 112 కి.మీ. రోడ్లు శుభ్రపరచడం జరుగుచున్నది. 13) నీరు-మీరు కార్యక్రమము క్రింద 2000 క్యూమి. పని చేపట్టడం జరిగినది.

పట్టణ ప్రజలకు విజ్ఞప్తి

బి. నరేష్‌కుమార్‌రెడ్డి
ఛైర్‌పర్సన్
మున్సిపాలిటి, మదనపల్లె

1. సకాలంలో పన్నులు పురపాలకసంఘంనకు చెల్లించి పట్టణాభివృద్ధికి తోడ్పడండి. 2. పట్టణాన్ని పరిశుభ్రంగా వుంచి పర్యావరణాన్ని రక్షించండి. 3. చెత్తా చెదారాన్ని కుప్పతొట్లలో వేసి వీధులను శుభ్రంగా వుంచండి. [illegible]. చెట్లు నాటండి - ఆరోగ్యాన్ని పరిరక్షించుకోండి. 5. 0-5 పిల్లలకు పోలియో చుక్కలు వేయించండి. 6. నీరు వృధా చేయకండి. పొదుపుగా వాడుకోండి.

సదా మీ సేవలో వున్న పురపాలకసంఘము వారికి సహకరించండి.

ఎస్. రవీంద్రబాబు
కమీషనర్
మున్సిపాలిటి మదనపల్లె

స్థానిక శాసన సభ్యులు

పురపాలక సంఘు వా[illegible] మెంబర్[illegible]

నీలకంఠాపురం గ్రామపంచాయితీ

కురుపాం మం।।, విజయనగరం జిల్లా.

శ్రీ బిడ్డిక దుర్గారావు
సర్పంచ్, నీలకంఠాపురం

శ్రీ కొండ గొర్రిరసూల్
సి.పి.ఎం. జిల్లా నాయకులు

శ్రీ బిడ్డిక అన్నోజీరావు
మండల ఉపాధ్యక్షులు, కురుపాం,
ఎం.పి.టి.సి. నీలకంఠాపురం

శ్రీ ఎం. ధర్మారావు
ఉపసర్పంచ్, నీలకంఠాపురం.

వార్డు మెంబర్లు

- మండంగి పెంటమ్మ — 1వ వార్డు, దండుసూరగూడ
- మూటక నర్రు — 2వ వార్డు, దండుసూరగూడ
- పాలక భాస్కరరావు — 3వ వార్డు, ధర్మలక్ష్మీపురం.
- ఆరిక గురపన్న — 4వ వార్డు, డంగులుగుండ.
- ఆరిక దొర — 5వ వార్డు, వాడకొయ్య
- కొండగొర్రి భోగాలమ్మ — 7వ వార్డు, సిరికొండ.
- ఆరిక బోడయ్య — 8వ వార్డు, నాయుడుగూడ
- ఆరిక సింగయ్య — 9వ వార్డు, మాల్లడిగూడ
- టి. దమయంతి — 10వ వార్డు, నీలకంఠాపురం
- ఆర్. పుష్పదత్ — 11వ వార్డు, నీలకంఠాపురం.
- కొచ్చెర్ల వెంకట రత్నం దాసు బాబు — 12వ వార్డు, నీలకంఠాపురం.

చేయవలసిన పనులు

1. పంచాయితీ భవన నిర్మాణానికి కృషి, 2. త్రాగునీరు మెరుగుకు కృషి. 3. వీధి కాలువల మెరుగుకు కృషి.
4. విద్యుత్ సౌకర్యం అభివృద్ధికి కృషి. 5. మారుమూల గ్రామాల[illegible]వృద్ధికి కృషి.
6. విద్యాభివృద్ధికి విద్యార్థుల తల్లి దండ్రులతో వారం, వారం సమావేశం [illegible] నీరు అభివృద్ధికి కృషి.


HAYWARDS
5000
THE ORIGINAL
DARTING KIT